గురువారం 5-12-2019


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 254




**ఇక చిన్న మదుపరికీ బాండ్లు!**

భారత్ బాండ్ ఈటీఎఫ్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర -బిజినెస్‌లో



**కోహ్లి మళ్లీ నంబర్‌వన్**

టెస్టు బ్యాట్స్‌మన్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి భారత కెప్టెన్ -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

# ఈ దిశగా పోలీసింగ్...



ముంబైలో తెలుగు అమ్మాయి ఎస్తర్ అనూహ్య, హాజీపూర్‌లో అక్కాచెల్లెళ్లు, వరంగల్‌లో 9 నెలల పాప, నిన్నటికి నిన్న మానస, టేకుల లక్ష్మి, దిశ..

**పసిపిల్ల దశ నుంచే రక్షణ కరువు!**

తన బిడ్డను పోగొట్టుకున్న బాధ తెలిశాక ఇంకే బిడ్డా ఇలాంటి ఘోరానికి బలికావద్దు.. అనుకున్నాడు ఎస్తర్ అనూహ్య తండ్రి.. ఎస్.జి.ఎస్ ప్రసాద్. దిశ సంఘటన నేపథ్యంలో ఆయన చేస్తున్న విన్నపం..

-ఫ్యామిలీలో

★ సరైన 'దిశ'లో.. - వివరాలు 2లో




# ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

**మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు**

**రోజువారీగా సత్వర విచారణ**

**ఉత్తర్వులు జారీ చేసిన న్యాయ శాఖ**

**తెలంగాణలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయడం ఇది రెండోసారి..**

సాక్షి, హైదరాబాద్

దిశ అత్యాచారం, హత్య ఘటనలో దోషులను త్వరితగతిన తేల్చేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటైంది. జస్టిస్ ఫర్ దిశ కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు హైకోర్టు ఆమోదముద్ర వేసింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు వీలుగా బుధవారం రాష్ట్ర న్యాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ మొదటి అదనపు సెషన్స్ జిల్లా జడ్జి కోర్టును ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుగా పరిగణిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. రోజువారీగా 'దిశ' కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు విచారించి సత్వరం తీర్పు వెలువరించనుంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కావడం ఇది రెండోసారి. ఇటీవల వరంగల్ జిల్లాలో 9 నెలల పాపపై అత్యాచారం చేసి, హత్య చేసిన కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటైంది. ఈ కేసులో సత్వర విచారణ జరిపిన కోర్టు 56 రోజుల్లో తీర్పు చెప్పింది. నిందితుడికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విధించిన ఉరిశిక్షను హైకోర్టు యావజ్జీవ కారాగార శిక్షగా మార్పు చేసింది.

**సీఎం ఆదేశాల మేరకు:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన 'దిశ'ఘటనలో విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించిన విషయం తెలిసిందే. అందుకు అనుమతివ్వాల్సిందిగా రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి ఎ.సంతోష్‌రెడ్డి ఈనెల 2వ తేదీన హైకోర్టుకు లేఖ రాశారు. ఈ మేరకు ఆ తర్వాతి రోజే హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఆమోదముద్ర వేశారు. హైకోర్టు అనుమతితో ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తూ 3వ తేదీతో న్యాయ శాఖ ఉత్తర్వులు (జీవో ఆర్‌టీ నంబర్ 639) జారీ చేసింది.

★ నెట్ లేకున్నా ఎస్‌వోఎస్ ★ పోకిరీల లెక్క తీయండి 2లో



## సూడాన్‌లో భారీ అగ్నిప్రమాదం

- 18 మంది భారతీయులు మృతి
- సిరామిక్ పరిశ్రమలో పేలిన ఎల్పీజీ ట్యాంకర్ -5లో



## దక్షిణాదిపై కేంద్రం వైఖరి మారాలి

- పనిచేస్తున్న రాష్ట్రాలను ప్రోత్సహిస్తే మరింత ముందుకెళ్తాయి
- టీఎస్‌ఐపాస్ ఐదేళ్ల ఉత్సవాల్లో ఐటీ మంత్రి కేటీఆర్

-వివరాలు 4లో

# ఐటీ సేవలే కాదు.. అంతకుమించి

సాక్షి, హైదరాబాద్

- పరిశోధనలు, అభివృద్ధిలోనూ హైదరాబాద్ ముందంజ
- ఏఐ, బ్లాక్‌చెయిన్, ఐవోటీ రంగాల్లోనూ ఆవిష్కరణలు
- గేమింగ్, వినోద రంగాల్లో 'ఇమేజ్'తెచ్చేందుకు కృషి
- ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీకి తగిన వాతావరణ కల్పనకు ప్రణాళిక

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సేవల రంగంలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ.. ఐటీ రంగంలో వస్తున్న నూతన సాంకేతికతల పరిశోధన, అభివృద్ధి రంగాలకు కూడా చిరునామాగా మారుతోంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ వంటి కొత్త సాంకేతికతలపై జరిగే పరిశోధన, అభివృద్ధి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ ఐటీ కంపెనీలు రాష్ట్రానికి తరలివస్తున్నాయి. మరోవైపు ఐటీ అనుబంధ రంగాలతో పాటు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీ కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఐటీ రంగంలో ఆఫీసు వసతి, ఉద్యోగాల కల్పన విషయంలో వచ్చే ఐదేళ్లలో బెంగళూరుపై పైచేయి సాధిస్తామని ఐటీ శాఖ ధీమా వ్యక్తం చేస్తోంది. కాగా, ఐటీ రంగంతో పాటు అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో ఎలక్ట్రానిక్స్ పరిశోధన, అభివృద్ధి, తయారీ వాతావరణాన్ని హైదరాబాద్‌లో కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఎలక్ట్రానిక్స్ రంగంలో గత ఐదేళ్లలో 30 వేల ఉద్యోగాలు సృష్టించగా, వచ్చే నాలుగేళ్లలో 3 లక్షల ఉద్యోగాలు ఈ రంగంలో సాధించాలని భావిస్తోంది. ఇటీవల చైనాకు చెందిన స్కైవర్త్ కంపెనీ 50 ఎకరాల్లో రూ.700 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ పార్కు ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ తయారీ రంగంలో పరిశోధన, అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వాతావరణం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**ఏఐ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీలు**

కృత్రిమ మేధస్సుకు సంబంధించి జాతీయ స్థాయిలో పరిశోధన, అభివృద్ధి కోసం దేశంలో 5 సెంటర్స్ ఆఫ్ రీసెర్చ్ ఎక్సలెన్స్ (కోర్), 20 ఇంటర్నేషనల్ సెంటర్స్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఇక్టయ్) ఏర్పాటుకు అవసరమైన మార్గదర్శకాలు

మిగతా 4వ పేజీలో ▶





బుధవారం విశాఖ సాగర తీరంలో ఒళ్లు గగుర్పొడిచే యుద్ధ విన్యాసాలు చేస్తున్న నేవీ సిబ్బంది. (ఇన్‌సెట్‌లో) తూర్పు నౌకాదళాధిపతి, వైస్ అడ్మిరల్ అతుల్‌కుమార్ జైన్‌తో కలిసి విన్యాసాలను వీక్షిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న కేంద్రమంత్రి జవదేకర్


# పౌరసత్వ బిల్లుకు కేబినెట్ ఆమోదం

- ఈ వారంలోనే పార్లమెంటుకు బిల్లు!
- ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల పొడిగింపునకూ ఓకే

-వివరాలు5లో

**మరికొన్నింటికి ఆమోదం..**

- వ్యక్తిగత డేటా ప్రొటెక్షన్ బిల్లు.
- కేంద్ర సంస్కృత యూనివర్సిటీల ఏర్పాటుకు ఉద్దేశించిన బిల్లు
- జమ్మూకశ్మీర్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఉపసంహరించేందుకు ఆమోదం.
- ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో 3.7 ఎకరాల స్థలం ఐటీడీసీకి.. ఐటీపీఓలకు 99 ఏళ్ల పాటు లీజుకు అప్పగించే ప్రతిపాదన




# జంబ్లింగ్ లేకుండానే ఇంటర్ ప్రాక్టికల్స్!

- సమయం తక్కువగా ఉన్నందున జంబ్లింగ్ వద్దనుకుంటున్న బోర్డు.. ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను ఈసారి కూడా సెంటర్ల జంబ్లింగ్ లేకుండానే నిర్వహించాలని ఇంటర్ బోర్డు భావిస్తున్నట్లు తెలుస్తోంది. బోర్డు కార్యదర్శిగా సయ్యద్ ఉమర్ జలీల్ ఇటీవలే రావడం, విద్యా శాఖ మంత్రిగా సబితా ఇంద్రారెడ్డి కూడా కొత్తవారే కావడంతో ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్‌పై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. జంబ్లింగ్ అమలుకు మొదట్లో ఆలోచనలు చేసినా అది ఇప్పటికిప్పుడు సాధ్యం కాదన్న భావనలో బోర్డు వర్గాలు ఉన్నాయి. అందుకే 2020 ఫిబ్రవరి 1 నుంచి 20 వరకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానం అమలు సాధ్యం కాదని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ప్రాక్టికల్ పరీక్షల ప్రారంభానికి సమయం తక్కువగా ఉన్నందున జంబ్లింగ్ సాధ్యం కాదన్న భావనకు బోర్డు వర్గాలు వచ్చాయని తెలుస్తోంది. దీంతో వచ్చే విద్యా సంవత్సరంలోనే జంబ్లింగ్ విధానాన్ని అమలుచేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

**అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనుకున్నా:** రాష్ట్రంలో 2,500 వరకు జూనియర్ కాలేజీలు ఉండగా, వాటిల్లో దాదాపు 10 లక్షల మంది చదువుతున్నారు. అందులో ద్వితీయ సంవత్సర విద్యార్థులు 5 లక్షల మంది వరకు ఉండగా, అందులో సైన్స్ కోర్సుల మిగతా 4వ పేజీలో ▶

## షోలాపూర్ మేయర్‌గా తెలుగు మహిళ

- సదాశివపేటకు చెందిన కాంచన యెన్నం గెలుపు
- మహారాష్ట్రలోనే తొలి తెలుగు మహిళా మేయర్‌గా రికార్డు.. నాలుగు సార్లు కార్పొరేటర్‌గా ఎన్నిక -14లో













'దిశ' ఘటనను నిరసిస్తూ జమ్మూలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


గువహటిలో అస్సాం పరిషత్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

## మహిళలు పెప్పర్ స్ప్రే తెచ్చుకోవచ్చు

**వెసులుబాటు కల్పించిన హైదరాబాద్ మెట్రో**

**సాక్షి, హైదరాబాద్:** మెట్రోలో ప్రయాణించే మహిళలు ఆత్మరక్షణ కోసం తమ వెంట పెప్పర్ స్ప్రే తెచ్చుకునే వెసులుబాటును హైదరాబాద్ మెట్రో కల్పిస్తోంది. బెంగళూరు మెట్రోలో అమలులో ఉన్న ఈ విధానాన్ని హైదరాబాద్ మెట్రోలో పరిచయం చేస్తున్నట్లు ఆ సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే మెట్రోలో భద్రతా కార్యకలాపాలు పర్యవేక్షించే అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. దిశ హత్యాచారం తర్వాత మహిళల భద్రతపై దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతమైన నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై మహిళా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 'దిశ'పై పోస్టులు.. మరొకరి అరెస్టు

**గుంటూరులో కీలక నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు**

**సాక్షి, హైదరాబాద్:** ఫేస్‌బుక్ వేదికగా 'దిశ'పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో కీలక నిందితుడు సాయినాథ్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. శనివారం నమోదు చేసిన కేసులో ఇతడే కీలకమని, మంగళవారం చిక్కిన శ్రీరామ్ సహ నిందితుడని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉన్న అమరావతి కొండయ్య కాలనీకి చెందిన సాయినాథ్ అలియాస్ నాని బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇటీవల జరిగిన దిశ ఉదంతం నేపథ్యంలో ఆమెను ఉద్దేశించి తన వాల్‌పై నాని అనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేశాడు. వీటిని సమర్థిస్తూ శ్రీరామ్ సహా మరికొందరు కామెంట్స్ పెట్టారు. వీటిపై స్పందించిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ వ్యవహారంపై శనివారం సుమోటోగా కేసు నమోదు చేశారు. ఆధారాలను బట్టి సాయినాథ్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. బుధవారం గుంటూరు వెళ్లిన ఓ ప్రత్యేక బృందం అతడిని అరెస్టు చేసింది. నిందితుడిని నాంపల్లి కోర్టులో హాజరుపరిచిన పోలీసులు.. జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

## 'దిశ' నిందితుల కస్టడీపై ఉత్కంఠ

- 7 రోజుల పాటు ఇచ్చారని వార్తలు
- గోప్యత పాటిస్తున్న పోలీసులు

**షాద్‌నగర్ రూరల్:** దిశ అత్యాచారం, హత్య కేసులో నిందితుల కస్టడీ వ్యవహారంపై ఉత్కంఠ కొనసాగుతోంది. నిందితులను కస్టడీకి కోరుతూ సోమవారం షాద్‌నగర్ పోలీసులు స్థానిక కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సోమవారం కస్టడీ విషయంలో ఎలాంటి స్పష్టత రాకపోవడంతో మంగళవారమైనా తీర్పు వస్తుందని అందరూ భావించారు. కానీ ఎలాంటి సమాచారం లేదు. ఈ క్రమంలో బుధవారం నిందితులను పోలీసు కస్టడీకి అనుమతిస్తారని అనుకున్నారు. చివరకు ఎటువంటి స్పష్టతా రాలేదు. మరోపక్క పోలీసులు ఈ విషయంలో గోప్యత పాటిస్తున్నారు. అయితే 7 రోజుల పాటు నిందితులను కస్టడీకి ఇచ్చారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను 'సాక్షి' సంప్రదించగా.. నిందితులు తమ కస్టడీలోకి రాలేదని తెలిపారు.

**కమిషనర్ కార్యాలయానికి అటాచ్..**

దిశ నిందితులకు సంబంధించిన వీడియో లీకేజీ వ్యవహారంపై షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లోని ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని సైబరాబాద్ కమిషనర్ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

## 'మహిళా ఫీల్డ్ అధికారులకు భద్రత కల్పించాలి'

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మహిళల భద్రతకు, రక్షణకు సంబంధించి పోలీసు శాఖ తరఫున అవగాహన సదస్సును నిర్వహించాలని టీజీవో మహిళా సభ్యులు కోరారు. టీజీవో కార్యాలయంలో సంఘం అధ్యక్షురాలు వి.మమత ఆధ్వర్యంలో బుధవారం జరిగిన భేటీలో పలు తీర్మానాలు ఆమోదించారు. మహిళా ఫీల్డ్ అధికారులు సురక్షితమైన ప్రదేశాల్లో విధులు నిర్వర్తించడానికి అవసరమైన పరిస్థితులను కల్పించాలని ఈ భేటీలో తీర్మానించారు. విధిగా మహిళల రక్షణకు ఉపయోగపడే ఫోన్ నంబర్లు, సూచికలను అందరికీ అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలన్నారు. ఈ సమావేశంలో టీజీవో నేతలు సుజాత, స్వర్ణలత, శారద, సునీత జోషి, స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

# సరైన 'దిశ'లో..

**దిశ ఉదంతం నేర్పుతున్న పాఠాలెన్నో**

- మెట్రో నగరాల పోలీసుల ముందు జాగ్రత్త చర్యలు
- బెంగళూరు, లూధియానా, కోల్‌కతాల్లో మహిళలకు ప్రత్యేక సేవలు
- రాచకొండ కమిషనరేట్‌లోనూ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'దిశ' ఉదంతం దేశవ్యాప్తంగా పోలీసులకు ఎన్నో పాఠాలు నేర్పుతోంది. మహిళలు, యువతుల భద్రత విషయంలో వారు తీసుకుంటున్న చర్యల 'దిశ' మారుస్తోంది. పంజాబ్‌లోని లూధియానా, బెంగళూరు, కోల్‌కతా, హైదరాబాద్ సహా అనేక మెట్రో నగరాల పోలీసులు మహిళల భద్రత విషయంలో వరుస నిర్ణయాలు తీసుకుంటున్నారు.

### రాచకొండ నుంచే మొదలైన సేవలు..

'దిశ' ఉదంతం వెలుగులోకి వచ్చిన వెంటనే తొలుత స్పందించింది రాచకొండ పోలీసులే. సీపీ మహేశ్ భగవత్ గత గురువారమే స్పందించి యువతులు, మహిళలకు అదనపు సేవలు అందించేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. వాహనాల్లో పెట్రోల్ అయిపోయినా, పంక్చర్ అయినా పోలీసులకు ఫోన్ చేయాలని లేదా వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలంటూ సూచించారు. ఈ సర్వీసును ఆ మరుసటి రోజు నుంచే అనేక మంది వినియోగించుకున్నారు.

### లూధియానాలో ఫ్రీ ట్రావెల్ సర్వీస్..

రాత్రి వేళల్లో ప్రయాణించే మహిళలు, యువతుల కోసం పంజాబ్‌లోని లూధియానా పోలీసులు ఆదివారం నుంచి కొత్త సర్వీసు ప్రారంభించారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య మహిళలకు సురక్షితమైన ప్రయాణం అందించేందుకు ఉచితంగా సేవలందిస్తున్నారు. ఆ సమయాల్లో ప్రయాణించేందుకు వాహనం దొరక్కపోతే పోలీసులకు ఫోన్ చేయాలంటూ రెండే ప్రత్యేక నంబర్లు కేటాయించారు. వీటికి కాల్ చేస్తే కంట్రోల్‌రూం వాహనం లేదా స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ వాహనం వచ్చి సదరు మహిళను సురక్షితంగా గమ్య స్థానానికి చేరుస్తాయని లూధియానా పోలీస్ కమిషనర్ రాకేశ్ అగర్వాల్ ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే.




### బ్యాన్ చేసిన బెంగళూరు కాప్స్..



'దిశ'పై అఘాయిత్యానికి పాల్పడ్డ దుండగులు ఆమెపై పెట్రోల్ పోసి కాల్చేశారు. పెట్రోల్‌ను ఓ బంకు నుంచి బాటిల్‌లో కొని తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో బెంగళూరులోని అన్ని బంకులకు పోలీస్ కమిషనర్ భాస్కర్‌రావు సోమవారం నోటీసులు జారీ చేశారు. బాటిళ్లు, క్యాన్లతో వచ్చే వారికి ఇంధనం విక్రయాన్ని నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. దీన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఈ విషయాన్ని బంకుల్లో బోర్డుల ద్వారా అందరికీ తెలిసేలా ఏర్పాటు చేయించారు.

### కోల్‌కతాలో కెమెరాల ఏర్పాటు..



పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా పోలీస్ కమిషనర్ అంజూ శర్మ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో 'దిశ' కేసును ప్రస్తావించి.. అలాంటి ఘటనలు కోల్‌కతాలో జరగకుండా కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటిలో భాగంగా కళాశాలలు, పాఠశాలలు ఉన్న ప్రాంతాలతో పాటు నిర్మానుష్య ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాధారణంగా మహిళలు, యువతులు కాలకృత్యాల కోసం నిర్మానుష్య ప్రదేశాలకు వెళ్లి దుండగుల బారినపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నగరవ్యాప్తంగా మొబైల్ టాయిలెట్స్ అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

## పోకిరీల లెక్కతీయండి..

- గ్రామాల్లో జులాయిల వివరాల సేకరణలో పోలీసులు
- స్వయం సహాయ గ్రూపు మహిళలకు ప్రత్యేక శిక్షణ
- స్కూళ్లలో వేధింపులపై ప్రచారం

**సాక్షి, హైదరాబాద్:** గ్రామాల్లో జులాయిగా తిరిగే పోకిరీల డేటా పోలీసుల వద్దకు చేరనుంది. అమ్మాయిలను వేధించే ఆకతాయిల జాబితా ఇకపై ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేకంగా నిర్వహించనున్నారు. 'దిశ' ఘటన దరిమిలా మహిళల భద్రత, రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పోకిరీల డేటా సేకరించనున్నారు. పట్టణాలతో పాటు గ్రామాల్లో పనీపాటా లేకుండా తిరిగే వారిపై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టనున్నారు. మహిళలపై వేధింపులకు సంబంధించిన కేసుల్లో అధిక శాతం నిందితులు పనీపాటా లేనివారే కావడం గమనార్హం.

### ఎస్‌హెచ్‌జీలకు శిక్షణ...

మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు.. సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం స్వయం సహాయక గ్రూపు(ఎస్‌హెచ్‌జీ)ల్లోని మహిళకు చట్టాలు, సైబర్ క్రైమ్, లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్, పోలీసులను ఎలా సంప్రదించాలి.. తదితర సమస్యలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. వీరు పాఠశాలలు, కాలేజీల్లో మహిళా రక్షణపై విద్యార్థులను చైతన్యం చేయనున్నారు. వీరికి షీటీమ్స్, పోలీసు కళాబృందాలు తోడవనున్నాయి. విద్యాసంస్థలే కాదు, కార్యాలయాలు, గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించనున్నారు.

### పాఠ్యాంశాల్లోనూ మార్పులు..

మహిళా భద్రత కోసం సమాజం ఆలోచనల్లో మరింత మార్పు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. బాలికలపై వివక్షను రూపుమాపడం, లింగ సమానత్వం సాధించడానికి స్కూలు పాఠ్యాంశాల్లో కొత్త అంశాలు చేర్చాలని నిర్ణయించారు. అమ్మాయిలను వేధిస్తే తలెత్తే పరిణామాలు, చట్టపరంగా ఎలాంటి శిక్షలు పడతాయో వివరించేలా పాఠ్యాంశాలు రూపొందించనున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఈ మేరకు మార్పులు చేయాలని భావిస్తోంది.

## నెట్ లేకున్నా ఎస్‌ఓఎస్..

- హాక్–ఐలో ప్రత్యేక ఫీచర్ ఏర్పాటు చేసిన అధికారులు
- బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చిన వెర్షన్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర పోలీసు విభాగం హాక్–ఐలో కీలక మార్పు చేసింది. మొబైల్ డేటా అందుబాటులో లేని/ఆన్‌లో లేని సందర్భాల్లో ఎస్‌ఓఎస్‌ను సమర్థంగా వినియోగించుకునేలా డయల్–100కు అనుసంధానం చేసింది. ఈ అప్‌డేటెడ్ ఆండ్రాయిడ్ వెర్షన్ బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చిందని పోలీసు విభాగం పేర్కొంది. హాక్–ఐ యాప్ వినియోగాన్ని గణనీయంగా పెంచేందుకు పోలీసులు సోషల్ మీడియా, ఎస్‌ఎంఎస్‌లు, పలు క్యాబ్‌లపై ఉంటున్న ప్రకటన బోర్డుల్నీ వాడుతున్నారు. ఫలితంగా దీన్ని ప్రజలు భారీ సంఖ్యలో డౌన్‌లోడ్ చేసుకున్నారు.

### ఆఫ్‌లైన్‌లో ఇలా...

బుధవారం నుంచి అందుబాటులోకొచ్చిన ఈ వెర్షన్ ప్రకారం.. మొబైల్ డేటా లేనప్పుడు బాధితులు ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే అది ఫోన్ కాల్‌గా మారి 'డయల్–100'కు చేరుతుంది. అక్కడి సిబ్బంది సదరు బాధితురాలు/బాధితుడు ఉన్న ప్రాంతాన్ని తెలుసుకుంటారు. ప్రతి గస్తీ వాహనానికీ జీపీఎస్ ఉండటంతో '100' సిబ్బందికి ఏ వాహనం ఏ ప్రాంతంలో ఉందో కంప్యూటర్ తెరపై కచ్చితంగా తెలుస్తుంది. దీంతో బాధితుడు ఉన్న ప్రాంతానికి సమీపంలో ఉన్న వాహనానికే నేరుగా ఆ ఫోన్‌కాల్‌ను డైవర్ట్ చేస్తారు. ఈ వ్యవహారం మొత్తం కొన్ని సెకన్ల వ్యవధిలో పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశారు.




| | |
|---|---|
| ఇప్పటి వరకు హాక్-ఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వారి సంఖ్య | 9 లక్షలు |
| 'దిశ' ఉదంతం తరువాత (6 రోజుల్లో) డౌన్‌లోడ్ చేసుకున్న వారి సంఖ్య | 3.5 లక్షలు |

## సత్వర తీర్పులు రావాలి..

**జస్టిస్ జాస్తి చలమేశ్వర్ వెల్లడి**



**సాక్షి, హైదరాబాద్:** చట్టాలను కఠినతరం చేసినా మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. ఇలాంటి నేరాలకు సంబంధించిన కేసుల్లో సత్వర తీర్పులు రాకపోవడం కూడా ఒక కారణమని అభిప్రాయపడ్డారు. న్యాయవ్యవస్థలో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. నీలం రాజశేఖరరెడ్డి పరిశోధనా కేంద్రం, సీఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం మఖ్దూంభవన్‌లో 'మహిళల రక్షణ–సవాళ్లు (దిశ–నిర్దేశం)' అంశంపై సదస్సు జరిగింది. సీపీఐ జాతీయ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సదస్సులో జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ.. ప్రస్తుత చట్టాలు సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తర్వాత విశ్రాంత ఐపీఎస్ అధికారి సి.ఆంజనేయరెడ్డి, సురవరం సుధాకరరెడ్డి, ప్రముఖ రచయిత్రి ఓల్గా మాట్లాడారు. ఈ సదస్సులో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, పల్లా వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళల రక్షణకు ఏపీలో కొత్త చట్టం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో మహిళల రక్షణకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి మేకతోటి సుచరిత తెలిపారు. బుధవారం సచివాలయంలో ఆమె మాట్లాడుతూ.. 'దిశ' లాంటి ఘటనలు జరిగినప్పుడు నిందితులకు తక్షణం శిక్ష పడేలా కొత్త చట్టాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ దుర్ఘటనపై సీఎం తీవ్రంగా చలించిపోయారని, రాష్ట్రంలో అటువంటి ఘటనలు జరగకుండా కఠినమైన చట్టాలను తీసుకొస్తున్నారని వివరించారు. ఇప్పటికే సైబర్ మిత్ర, మహిళా మిత్ర (9121211100)ను ప్రవేశ పెట్టడంతో పాటు ఈ మధ్యనే 'బీ సేఫ్' అనే యాప్‌ను ప్రవేశ పెట్టామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల్లో మహిళా పోలీసులను నియమించామన్నారు. అలాగే మహిళల రక్షణకు యుద్ధ ప్రాతిపదికన ఓ ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తున్నామని హోంమంత్రి వెల్లడించారు.

## ఇంట్లోకి చొరబడి బాలికపై అత్యాచారం

**రాజాపూర్ (జడ్చర్ల):** ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా సంగమ్మగూడ గ్రామపంచాయతీ పరిధిలోని హేమ్లానాయక్ తండాకు చెందిన ఓ బాలిక రాజాపూర్ కేజీబీవీలో ఎనిమిదో తరగతి చదువుతోంది. మంగళవారం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా బాలిక ఇంట్లో ఉంది. బాలిక ఇంట్లో టీవీ చూస్తుండగా అదే తండాకు చెందిన శంకర్ (22) అత్యాచారానికి పాల్పడి పరారయ్యాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు విషయం తెలుసుకుని బుధవారం తండా పెద్దలతో పంచాయితీ పెట్టించారు. మేజరయ్యాక బాలికను శంకరే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించారు. అప్పటి వరకు రెండెకరాలను బాధితురాలి పేరున రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. అందుకు యువకుడి కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు.

## ప్రేమ పేరుతో బాలికపై అఘాయిత్యం

**సైదాబాద్:** ప్రేమ పేరుతో తన ఇంట్లో అద్దెకు ఉంటున్న బాలికపై ఓ వివాహితుడు పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆ బాలికతో కలసి దిగిన ఫొటోలను బాలిక తండ్రికి వాట్సాప్‌లో పంపి తనని పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. దీంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిని అరెస్టు చేశారు. ఈ ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. సైదాబాద్‌కు చెందిన ఓ 50 ఏళ్ల వ్యక్తి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి మొదటి భార్య 14 ఏళ్ల క్రితం మరణించింది. వీరికి ఓ కుమార్తె(16) ఉంది. రెండో వివాహం చేసుకున్న సదరు బాలిక తండ్రి.. కుటుంబంతో కలసి సైదాబాద్ డివిజన్ పూసలబస్తీలోని ఎ.భార్గవ్‌కుమార్ (32) ఇంట్లో అద్దెకు ఉండేవారు. భార్గవ్ భార్య గర్భవతి కావడంతో పుట్టింటికి వెళ్లింది. దీంతో ఇంట్లో అద్దెకు ఉండే బాలికపై కన్నేశాడు. విషయం తెలిసిన బాలిక తండ్రి భార్గవ్‌ను హెచ్చరించినా మార్పు రాకపోవడంతో ఇంటిని ఖాళీ చేసి పక్క వీధిలో నివాసం ఉంటున్నారు. ఇద్దరం ప్రేమించుకున్నామని, పెళ్లి చేసుకుంటామంటూ బాలికతో కలసి దిగిన ఫొటోలను ఆమె తండ్రికి భార్గవ్ వాట్సాప్‌లో పోస్ట్ చేశాడు. తన కుమార్తెను ప్రేమ పేరుతో భార్గవ్ వేధిస్తున్నాడని బాలిక తండ్రి సైదాబాద్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భార్గవ్ ఇప్పటికే తన కుమార్తెను గత వారం యాదగిరిగుట్టకు తీసుకెళ్లి ఓ లాడ్జిలో అత్యాచారం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు భార్గవ్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

## రాజ్‌ఘాట్ వద్ద స్వాతి మలివాల్ దీక్ష



**సాక్షి, న్యూఢిల్లీ:** మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న దోషులకు తక్షణ శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్షను ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ కొనసాగిస్తున్నారు. మంగళవారం జంతర్‌మంతర్ వద్ద దీక్షను ప్రారంభించగా పోలీసులు అనుమతి లేదంటూ ఆమెను అక్కడి నుంచి తరలించారు. దీంతో స్వాతి తన ఆమరణ నిరాహార దీక్షను బుధవారం నుంచి రాజ్‌ఘాట్ వద్ద కొనసాగిస్తున్నారు. ఆమె మాట్లాడుతూ.. దిశ ఘటన యావత్తు దేశాన్ని షాక్‌కు గురి చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో అనేక ప్రాంతాల్లో ప్రతి రోజూ మహిళలపై తీవ్రమైన అఘాయిత్యాలు జరుగుతున్నాయని, గత మూడేళ్ల కాలంలో ఇలాంటి 55 వేల ఘటనలు ఢిల్లీ మహిళా కమిషన్ దృష్టికి వచ్చాయని తెలిపారు. దిశ ఘటనలో దోషులకు తక్షణ శిక్ష విధింపు, చట్టాల అమలు, పోలీసుల్లో బాధ్యత పెంపు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు, నిర్భయ దోషులకు ఉరిశిక్ష అమలు చేసే వరకు తన దీక్ష విరమించబోనని ఆమె తెలిపారు.

# అవగాహనతోనే వేధింపులకు చెక్

**మహిళల రక్షణపై ఉన్నతస్థాయి సమీక్షలో హోంమంత్రి మహమూద్ అలీ**

**సాక్షి, హైదరాబాద్:** మహిళల భద్రత–రక్షణపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని, అప్పుడే వేధింపుల నివారణ సాధ్యమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. 'దిశ' ఘటన నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బుధవారం హోంమంత్రి కార్యాలయంలో పలువురు మంత్రులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిపారు. మహిళల భద్రతకు అనుసరించాల్సిన వ్యూహాలు, వారిపై జరుగుతున్న అఘాయిత్యాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం చర్చించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, డీజీపీ మహేందర్ రెడ్డి, ఐజీ– షీటీమ్స్ స్వాతి లక్రా, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


హోం మంత్రి కార్యాలయంలో మహిళా భద్రతపై చర్చిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు

### సమావేశంలో తీసుకున్న నిర్ణయాలివే..

- మహిళలు అదృశ్యమైన కేసుల్లో నిర్లక్ష్యం వహించకుండా వెంటనే కేసులు నమోదు చేయాలి.
- పోలీస్‌స్టేషన్ల పరిధులతో సంబంధం లేకుండా ముందు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలి.
- షీటీమ్స్ మరింత బలోపేతానికి హాక్ ఐ వినియోగాన్ని పెంచేలా ప్రోత్సహించాలి.
- హెల్ప్‌లైన్లు, పోలీసు యాప్స్ వినియోగం పెరిగేలా మహిళల్లో అవగాహన కల్పించాలి.
- డయల్ 100, 181, 1098, 112 హెల్ప్‌లైన్ నెంబర్లను విద్యాసంస్థల్లో ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రైల్వే, మెట్రో, పార్కులు, ఆటో, క్యాబ్‌ల్లోనూ ఇతర ప్రదేశాల్లోనూ ప్రదర్శించాలి.
- బాలబాలికలు, ఉద్యోగులకు వేధింపులు లింగ సమానత్వంపై అవగాహన తీసుకువచ్చేందుకు ఈ–లెర్నింగ్ కోర్సులు అందుబాటులోకి తేవాలి.
- సినిమాహాళ్లు, టీవీల్లో లఘుచిత్రాలు, స్లైడ్లు ప్రదర్శించాలి.
- షీటీమ్స్‌తో కలిసి విద్యాసంస్థల్లో అమ్మాయిలపై వేధింపులపై అవగాహన కల్పించే సాంస్కృతి కార్యక్రమాల నిర్వహణ.
- గ్రామం నుంచి జిల్లా స్థాయివరకు అంగన్‌వాడీ, ఆశా, సెర్ప్ తదితర సంఘాలను మహిళా భద్రతపై ప్రచారానికి వినియోగించాలి.
- పిల్లలు నడుచుకుంటున్న విధానంపై తల్లిదండ్రులతో స్కూలు ఉపాధ్యాయులు చర్చించాలి.

## దిశ ఘటనలో కేంద్రానికి నోటీసులు

- దిశ వివరాలు బయటకొచ్చినందుకు వివరణ కోరిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ:** దిశ అత్యాచారం, హత్య ఘటనలో బాధితురాలి పేరు, వివరాలు మీడియాలో రావడంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై సమాధానం ఇవ్వాల్సిందిగా కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు, పలు మీడియా సంస్థలకు, సోషల్ మీడియా సంస్థలకు కూడా నోటీసులు ఇచ్చింది. అలాగే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలను కూడా వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. బాధితురాలైన దిశ వివరాలు బయటపెట్టిన మీడియా సంస్థలు, వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఢిల్లీ హైకోర్టులో న్యాయవాది యశ్‌దీప్ చాహల్ పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీఎన్ పటేల్, జస్టిస్ సి.హరిశంకర్ విచారణ జరిపారు. వాదనలు విన్న ధర్మాసనం నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది.


బీజేపీకి, టీడీపీకి మీరెప్పుడూ దూరం కాలేద్సార్... అలా నటించారంతే!!

# బస్సులో బంగారు బిస్కెట్లు



**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ పాత బస్తీలో బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి నుంచి డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు 1.7 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. డీఆర్ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు వస్తున్న బస్సులో ఓ వ్యక్తి బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నాడన్న సమాచారం వచ్చింది. చార్మినార్ సమీపంలో అధికారులు ఆ బస్సును ఆపి తనిఖీలు చేయగా.. ఓ ప్రయాణికుడి వద్ద విదేశాల నుంచి అక్రమంగా దిగుమతి చేసుకున్న 1.7 కిలోల బరువున్న 17 బంగారం బిస్కెట్లు దొరికాయి. బంగారాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు అతన్ని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హిందూ ధర్మానికే ముప్పు

## సీఎం కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ధ్వజం



**సాక్షి, హైదరాబాద్:** హిందూ ధర్మానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద ముప్పుగా పరిణమించారని, సంస్కృతులు, సంప్రదాయాలను మంట కలుపుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. యాదాద్రి మూలవిరాట్‌కు భంగం కలిగించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. యాదాద్రిలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై కేసీఆర్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహుడు స్వయంభువు అని, పవిత్రమైన ఆయన విగ్రహాన్ని తాకడమే మహాపాపమని పేర్కొన్నారు. అలాంటి విగ్రహాన్ని ఉలితో చెక్కడం, సెల్ఫీలు తీసుకోవడం మహాదారుణమన్నారు. ఆలయ ప్రాకార స్తంభాలపై ఆ మధ్య సీఎం శిల్పాలనే చెక్కారని, బీజేపీ ఆందోళన చేపట్టడంతో వెనక్కి తగ్గారన్నారు. ఆలయాన్ని పునరుద్ధరించే క్రమంలో భాగంగా గర్భగుడిని, మూలవిరాట్‌ను, ఆంజనేయస్వామి ఆలయాన్ని ముట్టుకోబోమని కేసీఆర్ ప్రకటించారని, ఆగమ శాస్త్ర నియమాల ప్రకారమే ఆలయాన్ని నిర్మిస్తామని పదే పదే చెప్పారన్నారు. కానీ, ఆగమ శాస్త్ర నియమాలకు మహాపచారం జరుగుతోందని ధ్వజమెత్తారు. యాదాద్రిలో అభివృద్ధి కంటే అక్కడ రియల్ ఎస్టేట్ అభివృద్ధిపైనే కేసీఆర్ మక్కువ చూపుతున్నారని విమర్శించారు. గుడి పునర్నిర్మాణానికి ముందే యాదాద్రి చుట్టుపక్కల సీఎం సంబంధీకులు, టీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారని, వాటి ధరలను పెంచుకోవడానికే పునర్నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ కోసం పునర్నిర్మాణం ప్రారంభించి ఇప్పుడు మహాపచారాలకే పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు.













# దక్షిణాదిపై కేంద్రం వైఖరి మారాలి

- పనిచేస్తున్న రాష్ట్రాలను ప్రోత్సహిస్తే మరింత ముందుకెళ్తాయి
- రాజకీయ కారణాలతో తెలంగాణను పట్టించుకోవట్లేదు..
- మరో 2 వేల ఎకరాలు సేకరించగానే ఫార్మా క్లస్టర్ ప్రారంభం
- టీఎస్ఐపాస్ ఐదేళ్ల ఉత్సవాల్లో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వ వైఖరి మారాలని, పనిచేస్తున్న రాష్ట్రాలకు కేంద్రం ప్రోత్సాహం లభిస్తే అవి మరింత ఉత్సాహంతో ముందుకెళ్తాయని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. కానీ కేంద్రం ఆ దిశగా ఆలోచించడం లేదని విమర్శించారు. రాజకీయ కారణాలతో కేంద్రం తెలంగాణను పట్టించుకోవడం లేదని, పారిశ్రామికీకరణలో రాజకీయాలు చేయకూడదన్నారు. బుధవారం శిల్పకళావేదికలో టీఎస్ ఐపాస్ చట్టం చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. 'బుల్లెట్ రైలు అనగానే ఢిల్లీ, ముంబైలేనా..? హైదరాబాద్ ఎందుకు గుర్తుకు రాదు.. డిఫెన్స్ కారిడార్‌ను హైదరాబాద్–బెంగళూరుల మధ్య కాకుండా మరోచోట ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పారిశ్రామిక కారిడార్ అంటే ఢిల్లీ–ముంబై మధ్యలోనేనా? దక్షిణాది రాష్ట్రాల మధ్య పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయకూడదా? అదివస్తే వారికంటే ఎక్కువగానే అద్భుతాలు చేయగలుగుతాం'అని అన్నారు.

**సీఎం మానస పుత్రిక టీఎస్ఐపాస్**

'టీఎస్ఐపాస్ సీఎం కేసీఆర్ మానసపుత్రిక. తెలంగాణ ఏర్పడ్డాక అమోదించిన తొలి బిల్లు ఇది. పటిష్టంగా అమలవుతున్న దీని క్రెడిట్ అంతా ముఖ్యమంత్రిదే. సీఎం స్ఫూర్తితో ఇన్నొవేషన్, ఇంక్యుబేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి కొత్త తరహా ఆలోచనలను అమలు చేస్తున్నాం. 27 శాఖల ద్వారా 35 సర్వీసులకు సంబంధించిన అనుమతులను టీఎస్ఐపాస్ ద్వారా అందిస్తున్నాం. ఐదేళ్లలో దాదాపు 12 వేల పరిశ్రమలకు అనుమతుల ద్వారా రూ.1.73 లక్షల పెట్టుబడుల సాధనతో పాటు 13.02 లక్షల మందికి ఉపాధి కల్పించాం. పరిశ్రమలకు రాయితీలిస్తే పారిశ్రామికవేత్తలకు ఇస్తున్నట్టుగా అపోహలున్నాయి. ఈ రాయితీలు కార్మికులకు జీవనాధారం'అని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు (టీప్రైడ్) రూ.205 కోట్ల రాయితీలను ఈ సందర్భం గా కేటీఆర్ అందజేశారు. '2014–19 మధ్యకాలంలో 40 వేల ఎకరాల్లో 49 పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేశాం. కొత్త ఆవిష్కరణలు, కొత్త తరహా ఆలోచనలతో తెలంగాణ ముందుకు దూసుకెళ్తోంది. హైదరాబాద్‌ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దబోతున్నాం. నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలిస్తాం. ఇందుకు టీఎస్ఐఐసీ 13 స్థలాలను ఎంపిక చేశాం. సులభతర వాణిజ్యం (ఈఓడీబీ)పై రాష్ట్రాల మధ్య కేంద్రం పోటీ పెట్టిన విధంగా, పరిశ్రమల ఏర్పాటులో 33 జిల్లాల మధ్య పోటీ పెట్టి ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం కల్పిస్తాం. ప్రపం చంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్‌ని హైదరా బాద్‌లో ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు 10 వేల ఎకరాలను సేకరించాం. ఇంకో 2 వేల ఎకరాలు సేకరించగానే క్లస్టర్‌ని ప్రారంభిస్తాం. ఫార్మా రంగంలో ప్రపంచానికే కేంద్రం గా హైదరాబాద్ మారుతుంది. సులభతర వాణిజ్యంలో అగ్రభాగాన ఉన్నాం. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు ఆకర్షిస్తున్నాం'అని కేటీఆర్ చెప్పారు.


మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

**నేనేమి మాయ చేయలేదు: మల్లారెడ్డి**

'నన్ను చూసి నేర్చుకోండి. కష్టపడి పనిచేస్తే ఎవరైనా ఏ స్థాయికైనా ఎదగొచ్చని చెప్పడానికి నేనే నిదర్శనం. సైకిల్‌పై తిరిగి పాలు పోసే మామూలు స్థాయి నుంచి 13 ఇంజనీరింగ్ కాలేజీలు, రెండేసి చొప్పున మెడికల్, డెంటల్ కాలేజీలు స్థాపించాను. ఇందుకోసం నేనేమి మాయ చేయలేదు. ప్రతి రూపాయి కష్టపడి సంపాదించా'అని అన్నారు.

## ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో ముందున్నా..

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో ముందున్నప్పటికీ హైదరాబాద్‌ను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని మంత్రి కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ రంగంలో నిపుణులైన మానవ వనరులు, పరిశోధన సంస్థలు హైదరాబాద్ సొంతమని గుర్తుచేశారు. సీఐఐ ఏర్పాటు చేసిన డిఫెన్స్ రంగ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో డిఫెన్స్, ఏరోస్పేస్ యూనిట్ల ఏర్పాటు సమయంలో రాజకీయాలను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో యూనిట్ల ఏర్పాటుకు ఎక్కడైతే డిఫెన్స్ రంగం పటిష్టంగా ఉందో ఆ ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పెట్టుబడుల విషయంలో అల్ప రాజకీయాలు చేయకూడదంటూ హితవు పలికారు. 'కారిడార్ ఏర్పాటు చేయాల్సిందిగా ఐదేళ్లలో నలుగురు రక్షణ శాఖ మంత్రులను కలిశాను. డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో వృద్ధి బాటన ఉన్న హైదరాబాద్‌ను మరింత ప్రోత్సహించండి అని కోరా. డిఫెన్స్ ప్రొడక్షన్ కారిడార్లను ఒకటి ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్, మరొకటి చెన్నైలో ఏర్పాటు చేయనున్నట్టు ఒక మంత్రి తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు కాకుండా ఏ ప్రాతిపదికన ఈ నిర్ణయం తీసుకున్నారని ఆ మంత్రిని అడిగా. అర్థం లేని సమాధానం చెప్పారు. జాతీయ శ్రేయస్సు కన్నా ప్రాంతీయ, రాజకీయ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని కేంద్రం వ్యవహరిస్తోంది. కేంద్ర డిఫెన్స్ శాఖ తన బడ్జెట్ నుంచి పలు ప్రాజెక్టులకుగాను రూ.1.05 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, ఇందులో తెలంగాణకు ఒరిగిందేమీ లేదు' అని అన్నారు. కేంద్రాన్ని కోరుతోంది తన నియోజక వర్గం సిరిసిల్ల కోసం కాదని, తెలంగాణ కోసమని చురక అంటించారు.


బుధవారం రాజ్‌భవన్‌లో జరిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ సమావేశంలో సెల్యూట్ చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ చీఫ్ కమిషనర్ కవిత

## రాష్ట్రం ఆరోగ్యంగా ఉందా?

**గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆరా.. నేడు సమీక్ష**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో డెంగీ జ్వరాలు, స్వైన్‌ఫ్లూ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సమీక్షించనున్నారు. గురువారం వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. ఎంతమందికి డెంగీ జ్వరాలు వచ్చాయి? ఎందరు చనిపోయారు? అధికారులు చేపట్టిన చర్యలపై సమీక్షించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. చలికాలం మొదలైనందున స్వైన్‌ఫ్లూ రావడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దాని నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపైనా సమీక్షించే అవకాశముంది. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న కీలకమైన కేసీఆర్ కిట్, కంటి వెలుగు పథకం పూర్తయిన తర్వాత కళ్లజోళ్ల పంపిణీపైనా వివరాలు తీసుకోనున్నారని తెలిసింది. కేసీఆర్ కిట్ పథకం కింద లబ్ధిదారులకు ఇచ్చే ప్రోత్సాహకపు సొమ్ము 5 నెలలుగా నిలిచిపోయిందని, ఎప్పుడు విడుదల చేస్తారన్న దానిపైనా ఆమె అధికారులతో చర్చించనున్నట్లు తెలిసింది. ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితులు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది ఖాళీలపైనా గవర్నర్ ఆరా తీసే అవకాశముందని అంటున్నారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**రెవిన్యూ విభాగము**
**కలెక్టర్ కార్యాలయము, పెద్దపల్లి**
**ఫారం -సి**

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం- 2016 (రాష్ట్ర చట్టం 21/2017) ద్వారా సవరించబడిన, కేంద్ర భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు 2013 (చట్టము నెం. 30/2013) యొక్క సెక్షన్ 11(1) క్రమము మరియు 10ఎ మినహాయింపు ననుసరించి (రూల్ 6/12 చూడండి)

కలెక్టర్ ప్రొ. నెం. ఓ2/1293/2018 తేది: 28-11-2019

**ప్రకటన**

పెద్దపల్లి జిల్లా, రామగిరి మండలములోని ముస్త్యాల గ్రామము పరిధిలో గల, ఈ దిగువ షెడ్యూల్ నందు చూపబడిన భూమి మొత్తం విస్తీర్ణము ఎ. 16-04 గుంటలు భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తము అనగా "సింగరేణి సంస్థ ఉపరితల బొగ్గుగని-V కొరకు అవసరమై యున్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ పెద్దపల్లి గారు భావిస్తున్నారు. కావున ఇట్టి ప్రకటన జారీ చేయనైనది.

**షెడ్యూల్**

గ్రామము: ముస్త్యాల మండలము: రామగిరి జిల్లా: పెద్దపల్లి

| క్ర. సం | సర్వే నెం. | భూమి స్వభావం | భూమి రకం ఖుష్కి/ తరి | భూప్రతిపాదనకు ప్రతిపాదించిన విస్తీర్ణము | పట్టాదార్లు & అనుభవదార్లు పేర్లు | హద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 1 | 360 | పట్టా | మెట్ట | 1-27 | పట్టాదారు & అనుభవదారులు: సుందిళ్ళ పుల్లయ్య తండ్రి రాజయ్య, చెప్యాల శరత్‌రావు తండ్రి కిషన్‌రావు, వర్మ భాగ్యలక్ష్మి భర్త శివశంకర్, సుంకరి శంకరయ్య తండ్రి కిష్టయ్య, పేర్మ పోచమల్లు, మద్దెల ఓదెలు తండ్రి మల్లయ్య, బొద్దుపల్లి రాజయ్య తండ్రి మల్లయ్య, దీకొండ మధునయ్య తండ్రి రామయ్య, మద్దెల పోచమ్మ భర్త మల్లయ్య, ఉదురుకోట గంగయ్య తండ్రి రాజయ్య, ఉదురుకోట రాజయ్య తండ్రి రాజయ్య, బేతి నర్సయ్య తండ్రి పోచం, మేకల రాజమ్మ భర్త పర్వతాలు, మెరుగు భూమయ్య తండ్రి లస్మయ్య, నాగురి తిరుపతి తండ్రి పార్థసారధి | 359 | 363 | 361 | ఎర్ర చెరువు |
| 2 | 361 | పట్టా | మెట్ట | 14-17 | పట్టాదారు & అనుభవదారులు: ఇసగంటి అరుణ భర్త హన్మంతురావు, ఓరిక ఇండియా లిమిటెడ్, ఇసగంటి రాజమనోహర్‌రావు తండ్రి మార్తాండరావు, ఇసగంటి రామ్మోహన్‌రావు తండ్రి మార్తాండరావు | 358 | 362 | 378 | 360 |
| | | | | 16-04 | | | | | |

**చెట్లు**

| సర్వే నెం. | రకము | సంఖ్య |
|---|---|---|
| 361 | ఇట్టి భూమిలో మొత్తం టేకు, మామిడి, ఎర్ర చందనం, వేప మరియు కొబ్బరి చెట్లు ఉన్నవి. అందువలన చెట్లను లెక్కించలేదు. చెట్లను లెక్కించిన తదుపరి చెట్ల సంఖ్య వేయబడును. | |

**స్ట్రక్చర్స్**

| సర్వే నెం. | రకము | సంఖ్య |
|---|---|---|
| 361 | బోరు బావి | 1 |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం–2016 రాష్ట్ర చట్టం 21/2017) ద్వారా సవరించబడిన, కేంద్ర భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013 (కేంద్ర చట్టము నెం. 30/2013) యొక్క సెక్షన్ 11(1) ప్రకారము సంబంధిత భూయజమానులందరికి తెలియజేయుటకు గాను జారీ చేయబడినది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, పెద్దపల్లి మరియు భూసేకరణ అధికారి, భూసేకరణ విభాగము, సింగరేణి సంస్థ, గోదావరిఖని గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినము కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును.

సదరు చట్టములోని సెక్షన్ 12 ననుసరించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారు మరియు భూసేకరణ అధికారి, భూసేకరణ విభాగము, సింగరేణి సంస్థ, గోదావరిఖని గారిని మరియు వారి సిబ్బంది సదరు భూములలో ప్రవేశించి, సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

చట్టం సెక్షన్ 11(4) ననుసరించి భూసేకరణకు ప్రతిపాదించిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారి ముందస్తు అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరు ఎటువంటి క్రయవిక్రయాలు, లావాదేవీలు / తాకట్టు లేదా ఏ ఇతర లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

ప్రతిపాదిత భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు గాని ఆక్షేపణలు గానీ ఉన్న యెడల మరియు సవ్యపరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారము కొరకు ప్రభావితమైన / ప్రయోజనము గల వ్యక్తులందరూ, సదరు చట్టంలోని సెక్షన్ (15) ననుసరించి, ఇట్టి ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి (60) దినములలోగా జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారికి / భూసేకరణ విభాగము, సింగరేణి సంస్థ, గోదావరిఖని గారికి లిఖిత పూర్వకంగా దాఖలు చేసుకోవచ్చును.

సం/- భూసేకరణ అధికారి, భూసేకరణ విభాగము, సింగరేణి సంస్థ గోదావరి ఖని
సం/- సంయుక్త కలెక్టర్ పెద్దపల్లి
సం/- జిల్లా కలెక్టర్ పెద్దపల్లి

DIPR Ro.No.1115/LA/PP/Agency/2019-20


## నేడు సాగునీటి ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

**ప్రాజెక్టుల కింద సాగునీరు, కాలువల ఆధునీకరణపై చర్చించే అవకాశం**



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు గురువారం సమీక్షించనున్నారు. ఈ మేరకు ఈఎన్‌సీలు, అన్ని ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లు, ఇతర ముఖ్య అధికారులు మధ్యాహ్నం తర్వాత జరిగే సమీక్షకు హాజరుకావాలని ముఖ్యమంత్రి కార్యాలయం సమాచారం అందించింది. భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద 30 లక్షల ఎకరాలు, చిన్ననీటి వనరుల కింద మరో 10 లక్షల ఎకరాలకు ఈ యాసంగి సీజన్‌లో నీళ్లు ఇవ్వాలని ఇప్పటికే నీటి పారుదలశాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల వారీగా నీటి విడుదల ఎలా ఉండాలి, ఎప్పటి నుంచి ఎప్పటి వరకు నీటి విడుదల జరగాలి, ప్రాజెక్టుల కాలువల నుంచి చెరువులు నింపాల్సిన ప్రాధాన్యం తదితర అంశాలపై సమీక్షలో చర్చించనున్నారు. ఎస్సారెస్పీ, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, నాగార్జునసాగర్ కాలువల ఆధునీకరణ, తూముల నిర్మాణం, చెక్ డ్యాం నిర్మాణాలపై సీఎం మార్గదర్శనం చేయనున్నారు. వచ్చే ఏడాది వర్షాకాలం నాటికి సీతారామ, తుమ్మిళ్ల, ఉదయ సముద్రం, ఎస్సారెస్పీ పునర్జీవ పథకం పనుల పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపైనా సీఎం స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని నీటిపారుదలశాఖ వర్గాలు వెల్లడించాయి.

## 'భారత్ బచావో'కు 4 వేల మంది

**ఈ నెల 14న ఢిల్లీకి తరలనున్న రాష్ట్ర కాంగ్రెస్ దళం**

**సాక్షి, హైదరాబాద్:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ అనాలోచిత విధానాలు, మోదీ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా ఈ నెల 14న దేశ రాజధాని ఢిల్లీలో ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'భారత్ బచావో' ఆందోళనకు రాష్ట్రం నుంచి 4 వేల మంది నాయకులు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు టీపీసీసీ నేతలు పొన్నం ప్రభాకర్, కుసుమ కుమార్, శ్రీనివాస్‌లకు కార్యక్రమ సమన్వయ బాధ్యతలను అప్పగించింది. ఈ కార్యక్రమంపై బుధవారం గాంధీభవన్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా టీపీసీసీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు.

## ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని 4 శాతానికి పెంచండి

**సప్లిమెంటరీ డిమాండ్స్‌పై చర్చలో ఎంపీ రంజిత్‌రెడ్డి**

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆర్థిక క్రమశిక్షణ, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) పరిమితిని తెలంగాణ రాష్ట్రానికి ప్రస్తుతమున్న 3.5 నుంచి 4 శాతానికి పెంచాలని టీఆర్ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. బుధవారం లోక్‌సభలో సప్లిమెంటరీ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ డిమాండ్ అన్ని రాష్ట్రాల నుంచి వస్తోందని గుర్తుచేశారు. 'కేంద్ర ప్రభుత్వం ఈ పరిమితిని దాటొచ్చు. కానీ రాష్ట్రాలకు వచ్చేసరికి ఎందుకు అభ్యంతరం. యూపీఏ–2 హయాంలో కేంద్రం ఎఫ్ఆర్‌బీఎం 5.5 శాతానికి చేరుకుంది. ప్రస్తుతం 3 శాతం ఉన్నప్పటికీ ఆర్థిక సంవత్సరం చివరినాటికి అది 4 శాతానికి చేరొచ్చు'అని పేర్కొన్నారు. అలాగే జీఎస్టీ పన్ను విషయంలో పాలను, మెర్సిడెజ్ కారును ఒకే రీతిలో చూడొద్దని కోరారు. రాష్ట్రానికి ఉజ్వల కనెక్షన్ల కేటాయింపు పెంచాలని విన్నవించారు.

## చేపల చెరువుల లీజులు మరో ఏడాది పెంపు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని మత్స్యశాఖ పరిధిలో ఉన్న చెరువుల లీజులను మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2014, జూలై 1 నుంచి 2019 జూన్ 30 వరకు ఐదేళ్ల పాటు చెరువులను నిర్ణీత ధరలకు మత్స్య సహకార సంఘాలకు లీజుకిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ గడువు ముగియడంతో మరో ఐదేళ్ల పాటు లీజులు పొడిగించాలని కోరుతూ మత్స్య సంఘాలతో పాటు ప్రజాప్రతినిధులు ప్రతిపాదించారు. దీంతో లీజు ధరలను సవరించకుండా ఐదేళ్ల పాటు రెన్యువల్ చేయడం కుదరదనే ఆలోచనలతో ప్రస్తుత ఏడాది వరకు ఈ లీజు గడువును పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది (2018–19) ధరలతో ప్రస్తుత ఏడాది (2019–20) కూడా చెరువులను సంబంధిత మత్స్య సహకార సంఘాలకు లీజుకివ్వాలని మత్స్య శాఖ కమిషనర్ సువర్ణ.. జిల్లా ఎల్ఆర్ నం.1909/సీ2/2019 ద్వారా కలెక్టర్లకు లేఖ రాశారు. శాఖ పరిధిలోనికి వచ్చే చెరువుల లీజులను మరో ఏడాది పొడిగించాలని ఆ లేఖలో కలెక్టర్లను కోరిన సువర్ణ.. ప్రభుత్వం తీసుకునే తుది నిర్ణయానికనుగుణంగా సంఘాలతో ఒప్పందం చేసుకుని లీజులివ్వాలని స్పష్టం చేశారు. అవసరమైతే లీజు ధరలను గతేడాది కంటే పెంచినా ఆ మేరకు మిగిలిన మొత్తాన్ని చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయా సంఘాలకు తెలియజేయాలని వెల్లడించారు.


**తెలంగాణ ప్రభుత్వం**
**కమిషనర్ కార్యాలయం, ఎండోమెంట్స్ శాఖ, హైదరాబాద్**

NIT No.EE/39/Tender Notice/2019, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన** తేది: 02.12.2019 (2వ పిలుపు)

కామారెడ్డి జిల్లా, మద్నూర్ మండలం, సలబత్పూర్ గ్రామం, శ్రీ మారుతి మందిరంలో కొన్ని అభివృద్ధి పనుల కోసం **రూ. 670.00 లక్షల** వ్యయంతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు కోరబడుచున్నది. మరింత సమాచారం కోసం https://tender.telangana.gov.in దర్శించండి. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ: 05.12.2019. బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది (దాఖలు): 12.12.2019.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎండోమెంట్స్ శాఖ, హైదరాబాద్

DIPR RO No. 1854 -DP/CL/Advt/1/2019-20, Dt:04-12-2019

**తెలంగాణ ప్రభుత్వం**
**సాగు నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ**
**పర్యవేక్షక ఇంజినీర్ వారి కార్యాలయం,**
**నీటిపారుదల శాఖ సర్కిల్, వరంగల్**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్**

**సంఖ్య: 30/2019-20** **తేది: 27.11.2019**

మిషన్ కాకతీయ-IV- జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలోని (01) ఒక చెరువు మరమ్మత్తు పనుల కొరకు తేది: 03.12.2019 నుండి 10.12.2019 వరకు బిడ్స్‌ను ఆహ్వానించడమైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ http://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సం/-
పర్యవేక్షక ఇంజినీర్, ఐ అండ్ సి ఎడిడి.,
నీటిపారుదల శాఖ సర్కిల్, వరంగల్ ఫోన్ నం.0870-2577221

DIPR RO No. 525-PP/CL/Advt/1/2019-20, Dt:04-12-19


# మండలానికి 2 ప్యాక్స్‌లు

- ఆ ప్రకారం కొత్తగా 453 ప్రాథమిక సహకార సంఘాల ఏర్పాటు
- దీంతో 909 నుంచి 1,362కు చేరనున్న ప్యాక్స్‌ల సంఖ్య
- కీలక ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణ వ్యవసాయశాఖ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రతి మండలానికి రెండేసి ప్రాథమిక సహకార సంఘాలు (ప్యాక్స్) తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. ఆ ప్రకారం రాష్ట్రంలో కొత్తగా మరో 453 ప్యాక్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారధి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు కనీసం ఒకటి ఉండాలన్న నిబంధనను, కనీసంగా రెండు ఉండేలా సర్కారు నిబంధనను మార్చింది. అలాగే కొత్త మండలాల్లోనూ రెండేసి ప్యాక్స్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత అనేక కొత్త మండలాలు ఏర్పడ్డాయి. దాంతో మండలాల సంఖ్య 573కు పెరిగింది. ప్రస్తుతం 273 మండలాల్లో ఒక ప్యాక్స్ చొప్పున మాత్రమే ఉన్నాయి. వాటిల్లో మరో ప్యాక్స్‌ను మంజూరు చేస్తారు. అలాగే 81 మండలాల్లో ఒక్కటి కూడా లేదు. వాటిల్లోనూ రెండేసి ప్యాక్స్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆ ప్రకారం ఇప్పటికే ఉన్న 909 ప్యాక్స్‌లతో కలిపి రాష్ట్రంలో 1,362 ప్యాక్స్ అందుబాటులోకి రానున్నాయని సహకారశాఖ కమిషనర్ ఎం.వీరబ్రహ్మయ్య విశ్లేషించారు. 45 రోజుల్లోగా కొత్త వాటిని అందుబాటులోకి తీసుకొస్తామని, మున్సిపల్ ఎన్నికల తర్వాత అన్ని ప్యాక్స్‌లకు ఎన్నికలు జరుపుతామని ఆయన వెల్లడించారు. ఆ తర్వాత డీసీసీబీలకు, టెస్కాబ్‌కు కూడా ఎన్నికలు జరుగుతాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం రెండు ఆపైన ప్యాక్స్ ఉన్న మండలాలు కూడా ఉన్నాయి. ఒక మండలంలోనైతే ఏకంగా ఏడు ప్యాక్స్ ఉన్నట్లు వీరబ్రహ్మయ్య తెలిపారు.

**సేవల విస్తరణే లక్ష్యం..**

ప్యాక్స్‌లను రైతులకు మరింత చేరువ చేయడం, వారికి అవసరమైన రుణ సదుపాయం కల్పించడం, ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులకు అందించడంలో మరింత సాయపడటం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే కిందిస్థాయి నుంచి సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలన్నది మరో ఉద్దేశమని ఉత్తర్వులో పేర్కొన్నారు. 10 నుంచి 20 వరకు గ్రామాలున్న మండలాల్లోనూ ఒకటే ప్యాక్స్ ఉండటం వల్ల రైతులు సుదూర ప్రాంతాలకు వచ్చి సేవలు పొందడం కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితిని మార్చాలన్నది సర్కారు ఉద్దేశం. స్థానిక రుణ సంస్థల ద్వారా రైతుల రుణ అవసరాలను తీర్చాల్సిన అవసరం ఉంది. ఇంకా ఇతర అనుబంధ వ్యాపారాలలోకి డిపాజిట్ మొబిలైజేషన్, గోల్డ్ లోన్ బిజినెస్, లాకర్ సౌకర్యం, గోడౌన్ సౌకర్యం, పెట్రోల్ బంక్స్ మొదలైన వాటిల్లోనూ ప్యాక్స్ ప్రవేశించేలా తీర్చిదిద్దుతారు. అలాగే ధాన్యం కొనుగోలు, ఇతర పంటల సేకరణ సేవలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తారు. మొత్తంగా ప్యాక్స్ వ్యవస్థను మరింత తీర్చిదిద్దుతారు. ఈ నిబంధనల ప్రకారం ఏ ప్యాక్స్‌నైనా ఇతర వాటిల్లో కలపడం లేదా విలీనం చేయడం లేదా విభజించడం లేదా బదిలీ చేయడం వంటివి చేయడానికి కూడా అవకాశం కల్పించారు. కొన్ని మండలాల్లో రెండు కన్నా ఎక్కువ ప్యాక్స్ ఉంటే వాటిని అలాగే కొనసాగిస్తారు. గతంలో లాభాల్లో ఉన్న వాటిని కొనసాగించి, నష్టాల్లో ఉన్న ప్యాక్స్‌లను తీసేశారు. దీంతో అనేక మండలాల్లో ప్యాక్స్ లేకుండా పోయాయని అధికారులు చెబుతున్నారు.

## ..అంతకుమించి

మొదటి పేజీ తరువాయి

రూపొందించే బాధ్యతను కేంద్రం తెలంగాణకు అప్పగించింది. మరోవైపు వ్యవసాయం, పట్టణీకరణ, రవాణా, ఆరోగ్య రంగాల్లో కీలక సవాళ్ల పరిష్కారానికి ఏఐ సాంకేతికత అమలును రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారంగా భావిస్తోంది. ఈ నేపథ్యంలో సంబంధిత రంగాల్లో ఏఐ సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2020ను 'ఇయర్ ఆఫ్ ఏఐ' (కృత్రిమ మేధో సంవత్సరం)గా ప్రకటించింది. రాష్ట్రంలో నకిలీ సర్టిఫికెట్ల నివారణకు 'బ్లాక్‌చెయిన్' ఐటీ సాంకేతికతను పరిష్కారమని భావిస్తూ ఎస్సెస్సీ బోర్డు, బాసర ట్రిపుల్ ఐటీలో ఈ టెక్నాలజీని ఐటీ శాఖ ప్రయోగాత్మకంగా పరిశీలించింది. త్వరలో జేఎన్టీయూ ద్వారా జారీ అయ్యే సర్టిఫికెట్ల వివరాలు కూడా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో అనుసంధానించనున్నారు.

**గేమింగ్, వినోద రంగాలకూ**

గేమింగ్, టెక్నాలజీ, వినోద రంగాల్లో దక్షిణాసియాకు తెలంగాణను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని 150కి పైగా వీఎఫ్ఎక్స్ స్టూడియోలు, 2డీ, త్రీడీ యానిమేషన్, గేమింగ్ కంపెనీలు సుమారు 30 వేల మందికి ప్రత్యక్ష, 90 వేల మందికి పరోక్ష ఉపాధి కల్పిస్తున్నాయి. 2020–25 నాటికి గేమిగ్ రంగం 300 బిలియన్ డాలర్ల పరిశ్రమగా వృద్ధి చెందే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో వీఎఫ్ఎక్స్, గేమింగ్, యానిమేషన్ రంగాల్లో లక్షలకొద్ది ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని అంచనా వేస్తోంది. అత్యాధునిక స్టూడియోలు, సదుపాయాలతో కూడిన ఇమేజ్ టవర్స్ 2022 నాటికి అందుబాటులోకి రానుంది. డిజైనర్స్, ఎంట్రప్రెన్యూర్స్, స్టార్టప్‌లకు ఉపయోగపడేలా ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ ప్రొటోటైపింగ్, మెకానికల్ డిజైనింగ్ రంగంలో భారత్‌లోనే తొలి ప్రొటోటైప్ సౌకర్యం కలిగిన 'టీ వర్క్స్' మూడు నాలుగు నెలల్లో అందుబాటులో రానుంది. నైపుణ్య శిక్షణ, నూతన ఆవిష్కరణలకు సంబంధించి టీహబ్, వీహబ్‌లు ఐఐటీ, ట్రిపుల్ ఐటీతో పాటు పలు ప్రైవేటు ఐటీ సంస్థలు భాగస్వామ్యంతో పనిచేస్తున్నాయి.

**రాష్ట్రంలో ఐటీ ఘనత..**

- 2018–19లో ఐటీ ఎగుమతులు రూ.1.09 లక్షల కోట్లు
- 2017–18తో పోలిస్తే ఐటీ ఎగుమతుల్లో 9 శాతం వృద్ధి రేటు నమోదు కాగా, తెలంగాణ 17 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది.
- 2017–18లో ఐటీ రంగంలో 4.85 లక్షల ఉద్యోగాలు ఉండగా, 2018–19లో 5.5 లక్షలకు చేరింది. వచ్చే నాలుగేళ్లలో ఈ సంఖ్య 10 లక్షలకు చేరుతుందని అంచనా.
- ఏఐ, మెషీన్ లెర్నింగ్, బ్లాక్‌చెయిన్, డేటా ఎనలిటిక్స్ రంగంలో కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుందని అంచనా.
- 2019 తొలి అర్ధభాగం నాటికి 38.5 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్పేస్ అందుబాటులో ఉండగా, వచ్చే ఐదేళ్లలో 50 లక్షల చదరపు అడుగులకు చేరుతుందని అంచనా.


## జంబ్లింగ్ లేకుండానే..

మొదటి పేజీ తరువాయి

విద్యార్థులు 3 లక్షలకు పైగా ఉంటున్నారు. వారికి ప్రతి ఏటా సొంత కాలేజీల్లోనే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కారణంగా కార్పొరేట్ కాలేజీలు ఎగ్జామినర్లను మేనేజ్ చేసి, తమ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో 30 మార్కులకు 30 మార్కులు వేయించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎప్పటి నుంచో ప్రాక్టికల్ పరీక్షల కేంద్రాల ఏర్పాటులోనూ జంబ్లింగ్ విధానం అమలు చేయాలన్న డిమాండ్ ఉంది. అయితే ప్రతి ఏటా బోర్డు అధికారులు మొదట్లో జంబ్లింగ్ అమలు చేస్తామని ప్రకటించడం, ఆ తరువాత ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీ యాజమాన్యాల ఒత్తిడితో జంబ్లింగ్ లేకుండానే ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించడం కొనసాగుతోంది. దీంతో కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు ఎగ్జామినర్లను మేనేజ్ చేసి తమ విద్యార్థులకు ఎక్కువ మార్కులను వేయించుకుంటున్నందున ప్రభుత్వ కాలేజీల విద్యార్థులకు నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వ కాలేజీల్లోని విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో 30కి 30 మార్కులను వేయడం లేదు. దీంతో వారు నష్టపోతున్నారు. అయితే ఈసారి ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ అమలుకు చర్యలు చేపడతామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇటీవల పేర్కొన్నారు. కానీ ప్రాక్టికల్ పరీక్షల ప్రారంభానికి సమయం తక్కువగా ఉన్నందున జంబ్లింగ్ సాధ్యం కాదన్న భావనకు బోర్డు వర్గాలు వచ్చాయి. పైగా బోర్డు కార్యదర్శిగా సయ్యద్ ఉమర్ జలీల్ కొత్తగా వచ్చినందునా, ఇప్పుడు ఆయన రాత పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంపైనే దృష్టి పెట్టారు. గతేడాది దొర్లిన పొరపాట్లు దొర్లకుండా హాల్‌టికెట్ల జనరేషన్ నుంచి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంపైనే ప్రత్యేక దృష్టి సారించారు.

## మొసలి దాడిలో వృద్ధుడు మృతి

**మాగనూర్:** మొసలి దాడిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండలం మందిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పశువుల కాపరి పెద్ద బుగ్గప్ప (60) బుధవారం కృష్ణానది మధ్యలో ఉన్న చిన్న గట్టుపై పశువులను మేపడానికి తీసుకెళ్లాడు. సాయంత్రం పశువులను ఇంటికి తోలుకొస్తుండగా.. నదిని దాటుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బుగ్గప్పపై మొసలి దాడి చేసి, నదిలోకి లాక్కెళ్లిందని ప్రత్యక్ష సాక్షి హన్మంతు తెలిపారు. వెంటనే ఆయన గ్రామస్తులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి దాదాపు రెండు గంటలు నదిలో గాలించగా.. బుగ్గప్ప మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


బుగ్గప్ప(ఫైల్)

# ఇంజనీరింగ్‌లో బాలురే ఎక్కువ!

- కన్వీనర్ కోటాలో కాలేజీల్లో చేరింది 70 శాతమే
- ల్యాటరల్ ఎంట్రీలోనూ బాలుర శాతమే అధికం
- ఎంబీఏలోనూ బాలురదే హవా
- ఇంజనీరింగ్‌లో చేరిన వారిలో 52.88 శాతం బీసీలే

**సాక్షి, హైదరాబాద్:** ఎప్పటిలాగే 2019–20 విద్యా సంవత్సరంలోనూ ఇంజనీరింగ్‌లో బాలురే అత్యధికంగా చేరారు. రాష్ట్రంలోని 186 ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 65,565 సీట్ల భర్తీకి చర్యలు చేపట్టగా అందులో 46,134 సీట్లు (70.4 శాతం) మాత్రమే భర్తీ అయ్యాయి. అందులో బాలురే అత్యధికంగా చేరినట్లు బుధవారం ప్రవేశాల కమిటీ లెక్కలు తేల్చింది. బీటెక్ ఇంజనీరింగ్‌లో బాలురు 26,716 మంది చేరగా, బాలికలు 19,418 మంది చేరారు. ఎంసెట్ బైపీసీ స్ట్రీమ్‌లో (ఫార్మ్–డి కలుపుకొని) 7,908 సీట్ల భర్తీకి చర్యలు చేపట్టగా 7,241 సీట్లు (91.6 శాతం) భర్తీ అయ్యాయి. అందులో 2,026 సీట్లలో బాలురు చేరగా, 5,215 మంది బాలికలు చేరారు. ఎంబీఏలో 22,429 సీట్ల భర్తీకి చర్యలు చేపట్టగా 19,277 సీట్లు (85.9 శాతం) భర్తీ అయ్యాయి. అందులో బాలురు 9,439 మంది చేరగా, బాలికలు 9,838 మంది చేరారు. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తయిన విద్యార్థులకు ల్యాటరల్ ఎంట్రీలో భాగంగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో 24,479 సీట్ల భర్తీకి చర్యలు చేపట్టగా, అందులో 17,803 సీట్లు (72.7 శాతం) భర్తీ అయ్యాయి. అందులో 12,270 మంది బాలురు చేరగా, 5,533 మంది బాలికలు చేరారు. ఇంజనీరింగ్‌లో చేరిన 46,134 మంది విద్యార్థుల్లో బీసీ విద్యార్థులే 24,396 (52.88 శాతం) మంది ఉండటం గమనార్హం. బీసీల్లోనూ ఎక్కువ మంది బీసీ–బీ, బీసీ–డీ కేటగిరీలకు చెందిన వారే ఉన్నారు. బీసీ–బీలో బాలురు 5,796 మంది ఉండగా, బాలికలు 4,544 మంది ఉన్నారు. బీసీ–డీలో బాలురు 4,534 మంది ఉండగా, బాలికలు 3,342 మంది ఉన్నట్లు లెక్కలు తేల్చింది.

**ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థులు**

| | |
|---|---|
| బీసీ | 24,396 |
| ఓసీ | 13,129 |
| ఎస్సీ | 5,647 |
| ఎస్టీ | 2,962 |
| మొత్తం | 46,134 |

# పౌరసత్వ బిల్లుకు కేబినెట్ ఓకే

- ఈ వారంలోనే పార్లమెంటుకు బిల్లు!
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విపక్షాలు


మీడియాతో మాట్లాడుతున్న జవదేకర్

**న్యూఢిల్లీ:** వివాదాస్పద పౌరసత్వ సవరణ ముసాయిదా బిల్లుకు బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ దేశాల్లో మతపరమైన వేధింపులు, వివక్షను ఎదుర్కొంటూ భారత్‌కు వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన ఈ బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. భారత్ లౌకికత్వానికి ఈ మతతత్వ బిల్లు వ్యతిరేకమని అవి వాదిస్తున్నాయి. ముఖ్యంగా ఈ వలసలు అధికంగా ఉన్న ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఈ ప్రతిపాదనపై ఆగ్రహంతో ఉన్నారు. మూడు ఇస్లామిక్ దేశాల నుంచి శరణార్థులుగా వచ్చిన వారిలో హిందువులే అత్యధికంగా ఉంటారు. ముస్లిమేతరులకు పౌరసత్వమిచ్చి వారికి ఎన్నార్సీ నుంచి రక్షణ కల్పించాలని బీజేపీ భావిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న అక్రమ వలసదారులను గుర్తించి, దేశం నుంచి పంపించేందుకు వీలుగా జాతీయ పౌరపట్టిక (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్‌షిప్–ఎన్నార్సీ)ను సిద్ధం చేయాలని కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. దేశ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పౌరసత్వ బిల్లు రూపకల్పన సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. ఈ బిల్లును నేడు కానీ, రేపు కానీ సభలో ప్రవేశపెట్టి, వచ్చే వారం సభ ఆమోదం పొందేలా చూడాలని కేంద్రం ఆలోచిస్తోంది.

**తీవ్ర వ్యతిరేకత**

కాంగ్రెస్, టీఎంసీ ఈ బిల్లున వ్యతిరేకిస్తున్నాయి. మత ప్రాతిపదికన పౌరసత్వం ఇవ్వడం భారత లౌకిక భావనకు వ్యతిరేకమని కాంగ్రెస్ నేత శశిథరూర్ విమర్శించారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ బిల్లుపై సుప్రీంకోర్టుకు వెళ్తామని కాంగ్రెస్ నేత, అస్సాం మాజీ సీఎం తరుణ్ గొగోయ్ తెలిపారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 12 మంది ఎంపీలు మోదీకి లేఖ రాశారు. లోక్‌సభలో బీజేపీకి ఉన్న మెజారిటీ దృష్ట్యా అక్కడ ఈ బిల్లు ఆమోదం పొందడం సమస్య కాబోదుగానీ, రాజ్యసభలో విపక్షం ఈ బిల్లును అడ్డుకునే అవకాశముంది. గత ప్రభుత్వం ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టింది. అప్పుడు లోక్‌సభలో గట్టెక్కింది. కానీ, ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర స్థాయిలో నిరసనలు చోటు చేసుకోవడంతో రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టలేదు. ఆ తరువాత ఆ ప్రభుత్వ పదవీకాలం ముగిసింది.

**కేబినెట్ నిర్ణయాల్లో మరికొన్ని..**

- వ్యక్తిగత డేటా ప్రొటెక్షన్ బిల్లుకు ఆమోదం. డేటా సేకరణ, నిల్వ, వినియోగం, సంబంధిత వ్యక్తుల అనుమతి, ఉల్లంఘనలకు జరిమానా, శిక్ష.. తదితరాలకు సంబంధించిన సమగ్ర విధి, విధానాలతో బిల్లును రూపొందించారు.
- కేంద్ర సంస్కృత యూనివర్సిటీల ఏర్పాటుకు ఉద్దేశించిన బిల్లుకు ఆమోదం. మూడు డీమ్డ్ సంస్కృత యూనివర్సిటీలను సెంట్రల్ యూనివర్సిటీలుగా మార్చేందుకు ఉద్దేశించిన ఈ బిల్లును త్వరలో పార్లమెంట్లో ప్రవేశపెట్టనున్నారు.
- ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో 3.7 ఎకరాల స్థలాన్ని ఐటీడీసీ(ఇండియన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్), ఐటీపీఓ(ఇండియన్ ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్)లకు రూ. 611 కోట్లకు 99 ఏళ్ల పాటు లీజుకు అప్పగించే ప్రతిపాదనకు ఆమోదం. ఈ స్థలంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ అండ్ కన్వెన్షన్ సెంటర్, ఫైవ్‌స్టార్ హోటల్‌ను నిర్మిస్తారు. 2021లోగా ఈ నిర్మాణం పూర్తవుతుందని అధికారులు తెలిపారు.
- జమ్మూకశ్మీర్లో ఆర్థికంగా వెనకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఉపసంహరించేందుకు ఆమోదం. ఇటీవలి రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఆ అంశం ఉండటంతో ఈ బిల్లును వెనక్కు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## లోక్‌సభ, అసెంబ్లీల్లో రిజర్వేషన్ల పొడిగింపునకు ఆమోదం

లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ సభ్యుల్లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు(ఎస్సీ, ఎస్టీ) రిజర్వేషన్లను పొడిగించే ప్రతిపాదనకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు జనవరి 25, 2020తో ముగియనుండగా, వాటిని జనవరి 25, 2030 వరకు పొడిగించేందుకు నిర్ణయించారు. అయితే, ఆంగ్లో ఇండియన్లకు రిజర్వేషన్లను పొడిగించే ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోలేదని సమాచారం. ప్రస్తుతానికి వారికి రిజర్వేషన్లను పొడిగించే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలుస్తోంది. ఈ విషయమై కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను మీడియా ప్రశ్నించగా, బిల్లును సభలో ప్రవేశపెట్టినప్పుడు అన్ని వివరాలు తెలుస్తాయన్నారు. ప్రస్తుతం పార్లమెంట్లో ఎస్సీ సభ్యులు 84 మంది, ఎస్టీ సభ్యులు 47 మంది ఉన్నారని జవదేకర్ వెల్లడించారు. రాష్ట్రాల శాసనసభల్లో 614 ఎస్సీ, 554 ఎస్టీ సభ్యులున్నారన్నారు.

## ఏమిటీ బిల్లు?

పౌరసత్వ చట్టం, 1955కి తాజాగా కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసింది. ఈ కొత్త బిల్లు ప్రకారం పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌లలో నివసిస్తూ మత పరమైన హింస, వేధింపుల్ని ఎదుర్కొంటున్న ఆరు వర్గాలకు భారత పౌరసత్వాన్ని కల్పించడానికి వీలుగా చట్టానికి సవరణలు చేస్తున్నారు. హిందువులు, క్రిస్టియన్లు, సిక్కులు, పార్సీలు, జైనులు, బుద్ధులకు ఈ కొత్త సవరణ చట్టం ప్రకారం మన దేశ పౌరసత్వం లభిస్తుంది. వీరంతా భారత్‌లో ఉంటూ ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా, ఆ పత్రాల గడువు తేదీ ముగిసిపోయినా పౌరసత్వానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఆరు వర్గాల్లో ముస్లింలు లేకపోవడం మైనారిటీల్లో అసంతృప్తి రాజేస్తోంది.

**ఈశాన్య రాష్ట్రాల్లో..**

బంగ్లాదేశ్ నుంచి భారీ సంఖ్యలో హిందువులు కొన్ని సంవత్సరాలుగా అక్రమంగా దేశంలోని ఈశాన్యరాష్ట్రాల్లో ప్రవేశించారు. ఇప్పుడు వారందరికీ ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా పౌరసత్వం వస్తుంది. ఇప్పటికే అసోం పౌర రిజిస్టర్ ద్వారా ఎందరో దేశ పౌరసత్వాన్ని కోల్పోయారు. దశాబ్దాల తరబడి ఈ రాష్ట్రాల్లో ఉంటున్న మైనారిటీల భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆందోళన నెలకొంది.

**పార్లమెంటులో బిల్లు గట్టెక్కుతుందా?**

లోక్‌సభలో ఈ బిల్లుని మొదట 2016లో ప్రవేశపెట్టారు. అధికార బీజేపీకి అసోంలో మిత్రపక్షమైన అసోం గణ పరిషత్(ఏజీపీ) అప్పట్లో దీనిని వ్యతిరేకించింది. కొన్ని సవరణలతో ఈ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టనున్నారు. లోక్‌సభలో ఎన్డీయే ప్రభుత్వానికి పూర్తి స్థాయి మెజారిటీ ఉన్నందున దీనిపై వ్యతిరేకత వచ్చినా ఆమోద ముద్ర పడుతుంది. ఇక రాజ్యసభలో మాత్రం జేడీ(యూ), అకాలీదళ్ వంటి పార్టీల మద్దతు లేకుండా బిల్లు గట్టెక్కలేదు. రాజ్యసభలో బిల్లును ఆమోదింపజేసుకునేందుకు హోంమంత్రి అమిత్ పలు పార్టీలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపారని తెలుస్తోంది.


దిబ్రూగఢ్‌లో విద్యార్థుల ఆందోళన

**బిల్లుకు అనుకూలం**

బీజేపీ, అకాలీదళ్, ఏఐఏడీఎంకే

**బిల్లుకి ప్రతికూలం**

కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, ఆర్జేడీ, వామపక్ష పార్టీలు, మరికొన్ని ప్రాంతీయ పార్టీలు

# సూడాన్‌లో భారీ అగ్నిప్రమాదం

**18 మంది భారతీయులు మృతి**


పరిశ్రమ వద్ద మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**ఖార్టూమ్:** ఎల్పీజీ ట్యాంకర్ పేలడంతో పరిశ్రమ నిండా మంటలు కమ్ముకొని 18 మంది భారతీయులను బతికుండగానే కాల్చేశాయి. సూడాన్ రాజధాని ఖార్టూమ్‌లోని సీలా సిరామిక్ పరిశ్రమలో మంగళవారం ఈ ఘోరం జరిగింది. ఈ ఘటనలో మొత్తం 23 మంది మృతి చెందగా, వారిలో 18 మంది భారతీయులు ఉన్నారు. 130 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సూడాన్‌లోని భారత ఎంబసీ అధికారులు అక్కడికి చేరుకొని వివరాలను సేకరించారు. ఆ పరిశ్రమలో మొత్తం 68 మంది భారతీయులు పనిచేస్తున్నట్లు ఢిల్లీలోని అధికారులకు బుధవారం సమాచారం అందించారు. ఈ విషయం తెలిసిన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రమాదం బారిన పడిన భారతీయుల వివరాలను వెల్లడించారు. అందులో 7 మంది కాలిన గాయాలతో ఆస్పత్రిపాలు కాగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపింది. మొత్తం 34 మంది భారతీయులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారని వెల్లడించింది. ఆ దేశంలోని భారత ఎంబసీ 24 గంటల హెల్ప్‌లైన్ +249–921917471ను ఏర్పాటు చేసింది. సిరామిక్ పరిశ్రమలోని ఎల్పీజీ ట్యాంకర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీనికి తోడు ప్రమాదం జరిగిన చోట భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు ఉండడంతో ప్రమాద స్థాయి పెరిగింది. దీంతో పరిశ్రమ మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది.

# చిదంబరానికి బెయిల్

- సాక్ష్యాలు తారుమారు చేస్తారనడానికి ఆధారాల్లేవన్న సుప్రీం
- 106 రోజుల జైలు జీవితం నుంచి విముక్తి


తీహార్ జైలు బయట చిదంబరం అభివాదం

**న్యూఢిల్లీ:** ఐఎన్‌ఎక్స్ మీడియా అవినీతి కుంభకోణం, మనీ ల్యాండరింగ్ కేసుల్లో కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరానికి ఎట్టకేలకు ఊరట లభించింది. 106 రోజుల జైలు జీవితం తర్వాత ఆయనకు బుధవారం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. సుప్రీం ఉత్తర్వులు అందిన తర్వాత తీహార్ జైలు గేట్ నంబర్ 3 నుంచి రాత్రి 8.10 గంటలకు చిదంబరం బయటకి వచ్చారు. కుమారుడు కార్తితో పాటుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వందలాది మంది కార్యకర్తలు జైలు వెలుపల చిదంబరానికి ఘనంగా స్వాగతం పలికారు. జైలు బయట చిదంబరం స్పందన కోసం వేచి చూస్తున్న మీడియా ప్రతినిధులు ఆయనను చుట్టుముట్టి ప్రశ్నల వర్షం కురిపించారు. ''106 రోజుల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చి స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. ఇన్ని రోజుల పాటు కస్టడీలోకి తీసుకొని విచారించినా తనపై ఒక్క అభియోగం కూడా నమోదు కాలేదని చెప్పారు. అంతకుముందు సుప్రీంకోర్టు చిదంబరానికి బెయిల్ ఇస్తే ఆయన సాక్ష్యాలు తారుమారు చేస్తారన్న ఈడీ వాదనల్ని తోసిపుచ్చింది. 'చిదంబరం ఇప్పుడు ప్రభుత్వ ప్రతినిధి కాదు, ఆయనకు రాజకీయ అధికారాలు లేవు. సాక్ష్యాధారాలను నాశనం చేసే అవకాశమే లేదు' అని జస్టిస్ ఆర్.భానుమతి ధర్మాసనం పేర్కొంది. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో సీబీఐ ఆగస్టు 21న చిదంబరాన్ని కస్టడీలోకి తీసుకుంది. ఆ తర్వాత తీహార్‌జైల్లోనే ఈడీ కస్టడీలోకి తీసుకొని విచారణ చేపట్టింది.

**ఇంటర్వ్యూలు వద్దు:** బెయిల్‌పై విడుదలయ్యాక ఈ కేసుకు సంబంధించి చిదంబరం మీడియా ఇంటర్వ్యూలు ఇవ్వకూడదని, బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని కోర్టు ఆంక్షలు విధించింది. ఈడీ ఎప్పుడు అడిగినా చిదంబరం అందుబాటులో ఉండి విచారణకు సహకరించాలని, ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని ఆదేశాలిచ్చింది.

**ఎప్పటికైనా సత్యమే గెలుస్తుంది: కాంగ్రెస్**

చిదంబరానికి బెయిల్ మంజూరు చేయడంపై కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని వ్యాఖ్యానించింది. పగ, ప్రతీకారాల కారణంగా చిదంబరం వంద రోజులకుపైగా జైలులో మగ్గిపోయారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిష్పాక్షికంగా జరిగే విచారణలో చిదంబరం నిర్దోషిత్వం రుజువు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, చిదంబరం 'బెయిల్ క్లబ్'లో చేరారంటూ బీజేపీ ఎద్దేవా చేసింది. ఎందరో కాంగ్రెస్ నేతలు బెయిల్‌పై బయట తిరుగుతున్నారని ఆ క్లబ్‌లో ఇప్పుడు చిదంబరం చేరారంటూ హేళన చేసింది.

## నైజీరియా తీరంలో భారతీయుల కిడ్నాప్

**న్యూఢిల్లీ:** నైజీరియా తీరంలో హాంకాంగ్ జెండాతో వెళ్తున్న ఒక నౌకపై మంగళవారం సముద్ర దొంగలు దాడి చేశారని ఏఆర్‌ఎక్స్ మారిటైమ్ అనే సంస్థ తెలిపింది. నౌకలోని 19 మంది సిబ్బందిని బందీలుగా తీసుకెళ్లారని, వారిలో 18 మంది భారతీయులని తెలిపింది. సమాచారం తెలియగానే నైజీరియాలోని భారతీయ దౌత్యాధికారులు నైజీరియా ప్రభుత్వాన్ని సంప్రదించి, భారతీయులు విడుదలయ్యేందుకు సహకరించాలని కోరారు.

## అధ్యక్ష రేసు నుంచి తప్పకున్న కమలాహ్యారిస్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష పదవి రేసు నుంచి భారతీయ సంతతి పార్లమెంటు సభ్యురాలు కమలా హ్యారిస్ తప్పుకున్నారు. 2020లో జరగబోయే ఎన్నికల ప్రచారానికి తగినన్ని నిధులు లేకపోవడం ఇందుకు కారణమని తెలిపారు. కాలిఫోర్నియా నుంచి పార్లమెంటుకు ప్రాతినిథ్యం వహిస్తున్న కమలా మంగళవారం ఓ కార్యకర్తకు ఫోన్ చేసిన సందర్భంలో ఈ విషయం తెలిసింది. ఎన్నికల ప్రచారాన్ని ఈ రోజుతో ముగిస్తున్నానని, ఇందుకు చింతిస్తున్నానని 55 ఏళ్ల కమలా హ్యారిస్ మంగళవారం ఓ ట్వీట్ కూడా చేశారు. ఇంతకాలం తనకు సహకరించినందుకు కృతజ్ఞతలు అని ట్వీట్‌లో పేర్కొన్నారు.


## దేవెగౌడ మనవడిపై హత్యాయత్నం కేసు



**బెంగళూరు:** కర్ణాటకలో గురువారం 15 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికల నేపథ్యంలో జేడీఎస్‌కు షాక్ తగిలింది. నలుగురు బీజేపీ కార్యకర్తల మీద హత్యాయత్నం చేశారంటూ మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనవడు సూరజ్ రేవన్నపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. హసన్ జిల్లాలోని చన్నరాయపట్న పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. జేడీఎస్ నుంచి బీజేపీలోకి మారిన కార్యకర్తల ఇళ్లపై దాదాపు 150–200 మంది వచ్చి దాడి చేశారని, ఆస్తులను ధ్వంసం చేశారని బీజేపీ ఆరోపించింది. గాయపడిన తమ కార్యకర్తలను ఆస్పత్రికి తరలించామని చెప్పారు. సరైన సమయానికి పోలీసులు రాకపోయి ఉంటే పరిస్థితి మరింత చేజారేదని అన్నారు. దీంతో సూరజ్ సహా ఆరు మందిపై హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అయితే ఈ ఆరోపణలను జేడీఎస్ ఖండించింది.

## ఛత్తీస్‌లో దారుణం

**అయిదుగురు సహచరులను కాల్చి చంపి తానూ కాల్చుకున్న జవాన్**



**చర్ల/రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లా కదేనార్ క్యాంపులో దారుణం జరిగింది. కదేనార్ ఐటీబీపీ 45వ బెటాలియన్ క్యాంపులోని మసుదుల్ రహమాన్ అనే జవాన్ బుధవారం ఉదయం తన సర్వీస్ గన్‌తో అయిదుగురు సహచర జవాన్లను కాల్చి చంపి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రహమాన్‌ను అడ్డుకోబోయిన మరో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రత్యేక హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తరలించారు. జవాన్ కాల్పులకు దిగడానికి గల కారణాలు తెలియనప్పటికీ.. సెలవు మంజూరు చేయలేదని మనస్తాపం చెంది ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానిస్తున్నామని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించామని పేర్కొన్నారు.

## విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

**మీర్జాపూర్:** సీఆర్పీఎఫ్ జవాన్ సహా నలుగురు కలిసి 15 సంవత్సరాల వయసున్న పాఠశాల విద్యార్థినిని ఎత్తుకెళ్లి గ్యాంగ్‌రేప్ చేసిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ జిల్లాలో సోమవారం జరిగింది. నిందితుల్లో ఒకడైన జై ప్రకాశ్ సోదరి హాలియా గ్రామంలో ఉంటుందని, దీంతో తరచూ వచ్చేవాడని, ఈ నేపథ్యంలో ఈ విద్యార్థినితో పరిచయం ఏర్పడిందని తెలుస్తోంది. అయితే సోమవారం రాత్రి 10 గంటలకు విద్యార్థిని తల్లికి జై ప్రకాశ్ ఫోన్ చేసి ఇంటి బయటికి రావాలని కోరగా, వచ్చిన బాధితురాలిని బలవంతంగా పోలీస్ లోగో ఉన్న కారులో హాలియా అడవిలోకి తీసుకెళ్లి నలుగురు గ్యాంగ్‌రేప్ చేశారని బాధితురాలి తండ్రి పోలీసు ఫిర్యాదులో పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో సీఆర్పీఎఫ్ జవాను మహేంద్ర యాదవ్, గణేశ్ ప్రసాద్ బింద్, లవకుశ్ పాల్, మాజీ జైలర్ కుమారుడు జై ప్రకాశ్ మౌర్యలు ఉన్నారు. బాధితురాలితో సహా నిందితులను వైద్య పరీక్షల కోసం పంపినట్లు మీర్జాపూర్ ఎస్పీ ధరమ్‌వీర్ సింగ్ తెలిపారు.

# ఆన్‌లైన్‌లో మందుల విక్రయంపై నిషేధం

- ఇ–ఫార్మసీ కంపెనీలకు ఎదురుదెబ్బ
- ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు అమల్లోకి తీసుకురావాలన్న డీసీజీఐ



**న్యూఢిల్లీ:** ఆన్‌లైన్‌లో ఇకపై మందుల విక్రయాన్ని నిలిపివేయాలని సెంట్రల్ డ్రగ్స్ రెగ్యులేటర్ సంస్థ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఇ–ఫార్మసీ సంస్థలన్నీ తక్షణమే ఇంటర్నెట్‌లో మందుల విక్రయాన్ని నిలిపివేయాలని కోరినట్టు ఆరోగ్య శాఖకు చెందిన ఒక అధికారి బుధవారం చెప్పారు. ఇ–ఫార్మసీ సంస్థల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా నిబంధనల్ని రూపొందించే పనిలో ఉంది. కేంద్ర నిబంధనలు అమల్లోకి వచ్చినంత వరకు ఆన్‌లైన్‌లో ఔషధాల అమ్మకాలను నిలిపివేయాలంటూ డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) వి.జి.సోమాని ఇటీవలే ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ కోర్టు తీర్పు అమలయ్యేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలంటూ డీసీజీఐ అన్ని రాష్ట్రాలు, యూటీలకు ఆదేశించారు.

**ఎలా జరిగిందంటే..**

చట్టవిరుద్ధంగా, అనుమతుల్లేకుండా ఆన్‌లైన్‌లో యథేచ్ఛగా కొనసాగుతున్న మందుల విక్రయానికి అడ్డుకట్ట వెయ్యాలని జహీర్ అహ్మద్ అనే వ్యక్తి ఢిల్లీ హైకోర్టులో గత ఏడాది పిల్ వేశారు. ఇష్టారాజ్యంగా ఆన్‌లైన్‌లో మందులు కొనుగోలు చేసి వాడడం వల్ల రాజ్యాంగంలో ఆర్టికల్ 21 ప్రకారం ప్రజలు జీవించే హక్కుని కోల్పోతారని, వారి ఆరోగ్యమే ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పిల్‌ను విచారించిన హైకోర్టు 2018 డిసెంబర్‌లో ఆన్‌లైన్‌లో మందుల అమ్మకం నిలిపివేయాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో జహీర్ మళ్లీ కోర్టుకెళ్లారు. దీనిపై హైకోర్టు కేంద్రానికి, ఇ–ఫార్మసీ కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులకు గత సెప్టెంబర్‌లో స్పందించిన ఇ–ఫార్మసీ కంపెనీలు ఆన్‌లైన్ విక్రయాలకు ఎలాంటి అనుమతులు, ప్రిస్క్రిప్షన్లు అవసరం లేదని కోర్టుకు చెప్పారు. స్విగ్గీలో ఆహార పదార్థాలు ఎలా ఇంటికి అందిస్తున్నారో తాము కూడా మందుల్ని డోర్ డెలివరీ చేస్తున్నట్టు వింత వాదన వినిపించారు.

**ఆ కంపెనీలు 8 లక్షలు!**

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 50 కంపెనీలు ఆన్‌లైన్‌లో మందులు విక్రయిస్తున్నాయి. వీటికి ఎలాంటి నియమ నిబంధనలు లేవు. దేశవ్యాప్తంగా హోల్‌సేల్, రిటైల్ ఫార్మసీ కంపెనీలు 8 లక్షల వరకు ఉన్నట్టు ఒక అంచనా. ఆన్‌లైన్ అమ్మకాలతో తమ వ్యాపారాలకు దెబ్బ పడుతోందని ఫార్మసీ కంపెనీలు ఇప్పటికే గగ్గోలు పెడుతున్నాయి. ఇ–ఫార్మసీ కంపెనీలు ఇస్తున్న ఆఫర్లతో తాము వ్యాపారాలు మూసుకోవాల్సిన పరిస్థితులు న్నాయని అంటున్నాయి. స్విగ్గీలో ఆహార పదార్థాల సరఫరా, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల డోర్ డెలివరీ ఒకటి కాలేదని కేంద్రం స్పష్టం చేసింది.


**FORM A**

**PUBLIC ANNOUNCEMENT**

(Under Regulation 6 of the Insolvency and Bankruptcy Board of India (Insolvency Resolution Process for Corporate Persons) Regulations, 2016)

**FOR THE ATTENTION OF THE CREDITORS OF DEWAN HOUSING FINANCE CORPORATION LIMITED**

| RELEVANT PARTICULARS | | |
|---|---|---|
| 1. | Name of corporate debtor[1] | Dewan Housing Finance Corporation Limited **(DHFL)** |
| 2. | Date of incorporation of corporate debtor[1] | April 11, 1984 |
| 3. | Authority under which corporate debtor[1] is incorporated / registered | Registrar of Companies |
| 4. | Corporate Identity No. / Limited Liability Identification No. of corporate debtor[1] | CIN: L65910MH1984PLC032639 |
| 5. | Address of the registered office and principal office (if any) of corporate debtor[1] | **Registered Office:** Warden House, 2nd Floor, PM Road, Fort, Mumbai 400001 **Principal Office:** Ground & 6th Floor, HDIL Towers, Anant Kanekar Marg, Station Road, Bandra (East), Mumbai 400051 |
| 6. | Insolvency commencement date in respect of corporate debtor[1] | December 3, 2019 (vide order no. C.P. (IB) – 4258/MB/2019 dated December 3, 2019 passed by Hon' ble National Company Law Tribunal, Mumbai Bench) |
| 7. | Estimated date of closure of insolvency resolution process | 180 days from the insolvency commencement date which is May 31, 2020 |
| 8. | Name of the insolvency professional acting as interim resolution professional[2] | Shri R. Subramaniakumar |
| 9. | Address and e-mail of the interim resolution professional[2] | Address: 6th Floor, HDIL Towers, Anant Kanekar Marg, Station Road, Bandra (East), Mumbai 400051 E-mail id: dhfladministrator@dhfl.com |
| 10. | Address and e-mail to be used for correspondence with the interim resolution professional[2] | Address: 6th Floor, HDIL Towers, Anant Kanekar Marg, Station Road, Bandra (East), Mumbai 400051 E-mail id: dhfladministrator@dhfl.com |
| 11. | Last date for submission of claims | December 17, 2019 (i.e. 14 days from the date of appointment of the Administrator as intimated by the order of the Hon'ble NCLT) |
| 12. | Classes of creditors, if any, under clause (b) of sub-section (6A) of section 21, ascertained by the interim resolution professional[2] | Public Depositors |
| 13. | Names of Insolvency Professionals identified to act as Authorised Representative of creditors in a class (Three names for each class) | 1. Charu Sandeep Desai (IBBI/IPA-001/IP- 00434/2017-18/10757) 2. Deepak Kumar (IBBI/IPA-001/IP-P-01605/2018-2019/12431) 3. Pravin Navandar (IBBI/IPA-001/IP-P00008/2016-17/10027) |
| 14. | (a) Relevant Forms and (b) Details of Authorized Representatives are available at: | Web link: https://www.dhfl.com/information-regarding-nclt **OR** https://www.ibbi.gov.in/home/downloads 6th Floor, HDIL Towers, Anant Kanekar Marg, Station Road, Bandra (East), Mumbai 400051 **OR** https://www.dhfl.com/information-regarding-nclt |

Notice is hereby given that the National Company Law Tribunal has ordered the commencement of a corporate insolvency resolution process of DHFL on December 3, 2019.

The creditors of DHFL, are hereby called upon to submit their claims with proof on or before December 17, 2019 to the administrator at the address mentioned against entry No. 10.

The financial creditors shall submit their claims with proof by electronic means only. All other creditors may submit the claims with proof in person, by post or by electronic means.

A financial creditor belonging to a class, as listed against the entry No. 12, shall indicate its choice of authorised representative from among the three insolvency professionals listed against entry No.13 to act as authorised representative of the class of Public Depositors in Form CA.

Submission of false or misleading proofs of claim shall attract penalties.

Name and Signature of Administrator: Shri R. Subramaniakumar

Date and Place : December 4, 2019 at Mumbai

Notes :
1. Corporate Debtor refers to a Financial Service Provider as per the Insolvency and Bankruptcy (Insolvency and Liquidation Proceedings of Financial Service Provider and Application to Adjudicating Authority) Rules, 2019
2. Interim Resolution Professional shall mean an Administrator appointed by Hon'ble National Company Law Tribunal vide its order no. C.P. (IB) – 4258/MB/2019 dated December 3, 2019 pursuant to the provisions of the Insolvency and Bankruptcy (Insolvency and Liquidation Proceedings of Financial Service Provider and Application to Adjudicating Authority) Rules, 2019

సాక్షి
గురువారం, డిసెంబర్, 5

# ఎస్పీజీ చట్టానికి ప్రక్షాళన

దేశంలో ప్రముఖుల భద్రత కోసం ఉద్దేశించిన ప్రత్యేక భద్రతా దళం(ఎస్పీజీ) చట్టం సవరణకు పార్లమెంటు ఆమోదం లభించింది. తాజా సవరణ చట్టంగా మారాక ఇక ప్రధాని, ఆయన కుటుంబానికి చెందిన వారికి తప్ప మరెవరికీ ఎస్పీజీ రక్షణ ఉండదు. వారికి సైతం పదవినుంచి దిగిపోయాక ఇది అయిదేళ్లపాటు మాత్రమే ఉంటుంది. వాస్తవానికి ఈ బిల్లు ఆమోదానికి చాలా ముందే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఉన్న ఎస్పీజీ భద్రతను తొలగించారు. ఇటీవల సోనియాగాంధీ, ఆమె సంతానం రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలకు సైతం తొలగించారు. వీరికి ఇకపై సీఆర్పీఎఫ్ బృందంతో కూడిన జడ్ ప్లస్ భద్రత ఉంటుంది. సహజంగానే కాంగ్రెస్‌కు ఇది మింగుడుపడటం లేదు. ఎస్పీజీ బిల్లుపై చర్చ పూర్తయి ఓటింగ్ జరిగినప్పుడు ఆ పార్టీ వాకౌట్ చేసింది. మన దేశంలో ప్రముఖులకు సంబంధించిన భద్రత కోసం చాలా కేటగిరీలున్నాయి. ఎస్పీజీతోపాటు ఎన్ఎస్‌జీ, జడ్ ప్లస్, జడ్, వై, ఎక్స్...ఇలా వేర్వేరు కేటగిరీలను ఏర్పాటుచేశారు. ప్రాణావసరం అనుకున్నది కాస్తా ప్రచార ఆర్భాటంగా మిగలడం, అధికార దర్పాన్ని ప్రదర్శించడానికి సాధనంగా మారడం మిగిలినవాటికన్నా ఎస్పీజీ విషయంలో అధికంగా కనబడుతుంది. రాజ్యాంగపరంగా అత్యున్నత పదవుల్లో ఉండేవారి ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా చూడటం అవసరమే. ఉగ్రవాదుల బెడద పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో దీన్నెవరూ తప్పుబట్టరు. అయితే రాను రాను భద్రత ఎవరికి అవసరం... ఏ స్థాయిలో, ఎంతకాలం అవసరం అనే విచక్షణ పోయింది. ఎస్పీజీ చట్టానికి సవరణలు చేసుకుంటూ పోయినకొద్దీ ఆ రక్షణ పొందేవారి జాబితా చాంతాడంత పెరిగింది. జాబితాలోనివారికి ఉండే వెసులుబాట్లు అన్నీ ఇన్నీ కాదు. వీరు పర్యటనకెళ్లినప్పుడల్లా బుల్లెట్ ప్రూఫ్ కార్లు వారికన్నా ముందే విమానంలో గమ్యం చేరతాయి. విమానాశ్రయాల్లో తనిఖీల బెడద ఉండదు. నేరుగా విమానం వరకూ దర్జాగా కారులో వెళ్లొచ్చు. సాధారణ పౌరులు వారు వృద్ధులైనా, యువకులైనా గంటలతరబడి క్యూలో నిలబడి అన్ని లాంఛనాలూ పూర్తిచేయాల్సి ఉండగా ఎస్పీజీ రక్షణ ఉన్నవారికి ఇవేమీ వర్తించవు. ఎటు కదిలినా వీరి వాహనానికి ముందూ వెనకా 15 బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు పరుగులు పెడుతుంటాయి. ఈ వాహనశ్రేణి కోసం ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిపేయడం సర్వసాధారణం.

స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో పాలకుల ప్రాణరక్షణకు ప్రత్యేక భద్రత అవసరమని పెద్దగా అనుకోలేదు. వారు ప్రజల మధ్యకు వెళ్లినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా చూడటానికి నామమాత్రంగా పోలీసు రక్షణ ఉండేది. ప్రధాని మొదలుకొని మంత్రుల వరకూ ఎవరు కదిలినా ఆర్భాటం ఉండేది కాదు. 1984లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తన నివాసంలోనే సెక్యూరిటీ గార్డుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయాక ఈ పరిస్థితి మారింది. 1981కి ముందు ప్రధాని భద్రతను ఢిల్లీ పోలీస్ విభాగంలోని డీసీపీ స్థాయి అధికారి నేతృత్వంలోని బృందం పర్యవేక్షించేది. ఆ తర్వాతకాలంలో అందుకోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేశారు. ఇందిర హత్యానంతరం 1985లో బీర్బల్‌నాథ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎస్పీజీ ఉనికిలోకొచ్చింది. అయితే మరో మూడేళ్ల తర్వాతగానీ దీనికి చట్ట ప్రతిపత్తి రాలేదు. రాజీవ్‌గాంధీ హయాంలో దానికి సంబంధించిన బిల్లు ప్రతిపాదించారు. అయితే పదవి నుంచి తప్పుకున్నాక కూడా రక్షణ అవసరమని అప్పట్లో అనుకోలేదు. బహుశా ఆ ఏర్పాటువుంటే ఉగ్రవాదుల కుట్రకు రాజీవ్ బలయ్యేవారు కాదు. ఆ తర్వాత 1991లో మాజీ ప్రధానులకు కూడా ఎస్పీజీ రక్షణ ఉండాలంటూ సవరణ చేశారు. అలా వరసగా 1994, 1999, 2003 సంవత్సరాల్లో మరికొన్ని సవరణలు వచ్చి చేరాయి. ఫలితంగా ప్రధాని, మాజీ ప్రధాని, వారి కుటుంబసభ్యులు సైతం ఎస్పీజీ ఛత్రఛాయలోకొచ్చారు. ప్రధాని పదవి నుంచి వైదొలగిన పదేళ్ల వరకూ ఈ రక్షణ కొనసాగే ఏర్పాటు చేశారు.


ప్రముఖులకు కల్పించే భద్రత ఈమధ్య కాలంలో ఎబ్బెట్టుగా మారింది. పదకొండేళ్లపాటు ఈ ఎస్పీజీ రక్షణ వలయంలో ఉన్న మాజీ ప్రధాని చంద్రశేఖర్ కుమారుడు నీరజ్ శేఖర్ రాజ్యసభలో చర్చ సందర్భంగా మాట్లాడిన మాటలే దీనికి రుజువు. తనకంటూ ఏ పదవీ, హోదా లేకపోయినా ఎస్పీజీ రక్షణంతా చూసి జనం తన ఆటోగ్రాఫ్ కోసం ఎగబడేవారని ఆయన వ్యాఖ్యానించారు. నిజానికి తనెవరో దేశంలో ఎవరికీ తెలియదని, కానీ ఈ భద్రత, దాంతోపాటుండే హడావుడి వగైరాలు చూసి ఏదో పెద్ద పదవి వెలగబెడుతున్నానని అందరూ అనుకునేవారని నీరజ్ చెప్పుకొచ్చారు. ఇవన్నీ చూశాకే సాధారణ పౌరుల్లో వీఐపీ సంస్కృతిపై ఏవగింపు ఏర్పడింది. ఇంత భద్రత పొందుతున్న వీఐపీలు పాటించవలసిన నిబంధనల్ని మాత్రం మరిచిపోతారు. ఎస్పీజీ రక్షణలో ఉండే ప్రముఖులు ఎటు వెళ్లదల్చుకున్నా చాలా ముందుగా ఎక్కడికెళ్తున్నారో, తిరిగి ఎప్పుడొస్తారో భద్రతా వ్యవహారాలు చూసే ఇన్‌చార్జికి తెలపాలి. అలాగే వారికోసం వచ్చేవారి సమస్త వివరాలనూ ఎస్పీజీ ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తుంది. కానీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో వెల్లడించిన వివరాల ప్రకారం 2015 మొదలుకొని ఇప్పటివరకూ రాహుల్‌గాంధీ దేశంలో వివిధ ప్రాంతాలకెళ్లినప్పుడు 1,892 సందర్భాల్లో, విదేశాలకెళ్లినప్పుడు 247 సందర్భాల్లో ఎస్పీజీకి వర్తమానం ఇవ్వలేదు. సోనియాగాంధీ సైతం ఢిల్లీలో 50సార్లు, దేశంలో వివిధ ప్రాంతాలకెళ్లినప్పుడు 13సార్లు, విదేశాలకెళ్లినప్పుడు 29సార్లు తెలియజేయలేదు. ప్రియాంకగాంధీ తీరు కూడా భిన్నంగా లేదు. ఆమె ఢిల్లీలో 339 సందర్భాల్లో, దేశంలో వేర్వేరు ప్రాంతాలకెళ్లినప్పుడు 64సార్లు, విదేశాలకెళ్లినప్పుడు 94సార్లు వర్తమానం ఇవ్వలేదు. భద్రత లాంఛనంగా మారడం సరికాదు. పదవులు విడనాడాక నాయకులే ఎవరికి వారు స్వచ్ఛందంగా భద్రత స్థాయిని తగ్గించుకుంటే హుందాగా ఉంటుంది. ఎందుకంటే దీని పేరు చెప్పి ఖజానాపై ఏటా వందలకోట్ల రూపాయల భారం పడుతోంది. పైగా ఈ ఆర్భాటం సామాన్యులకు సమస్యగా మారుతోంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి శు.నవమి రా.3.01 వరకు తదుపరి, దశమి, నక్షత్రం పూర్వాభాద్ర రా.7.50 వరకు తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం... లేదు, దుర్ముహూర్తం ఉ.10.01 నుంచి 10.44 వరకు, తదుపరి ప.2.25 నుంచి 3.09 వరకు అమృతఘడియలు... ఉ.10.57 నుంచి 11.24 వరకు.

**సూర్యోదయం :** 6.19
**సూర్యాస్తమయం:** 5.20
**రాహుకాలం :** ప.1.30 నుంచి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుంచి 7.30 వరకు

# కుల నిర్మూలనతోనే భవిష్యత్తు



మల్లెపల్లి లక్ష్మయ్య

మనం పరిశుభ్రమైన దుస్తులు ధరించినా, మన మనస్సు, శీలం నిందించడానికి వీలులేనిదైనా మనల్ని అంటరానివారుగా చూస్తూనే ఉన్నారు. కాబట్టి మనం సమసమాజమనే సిద్ధాంతాన్ని ప్రబోధిస్తోన్న బౌద్ధమతంలో చేరాలి. అది మాత్రమే మనుషుల మధ్య విభేదాలను తొలగిస్తుంది అని బీఆర్ అంబేడ్కర్ తన తుది ఉపన్యాసంలో అన్నారు. అంటరానితనం ఏర్పడడానికి నీచమైన వృత్తులు, గోమాంస భక్షణ, మురికిగా ఉండడం లాంటి కారణాలు సహేతుకంగా లేవనీ, బౌద్ధాన్ని పాటిస్తున్న తెగలను హిందూ మతం వెలివేసి, నీచమైన వృత్తులను అంటగట్టిందని వివరించారు. చివరకు 1956 అక్టోబర్, 14న 5లక్షల మంది సమక్షంలో బౌద్ధం స్వీకరించి సామాజిక విప్లవానికి పునాది వేశారు. కుల నిర్మూలన కోసం అంబేడ్కర్ చేసిన పోరాటం రేపటి భవిష్యత్ భారతావనికి సుస్పష్టమైన మార్గదర్శక వెలుగురేఖగా నిలుస్తుంది.

''మనం పదిహేను వందల సంవత్సరాల నుంచి గ్రామ పొలిమేరలకావల నివసిస్తూ, హిందువులు మనసు మారి మనకు సమానత్వం కల్పిస్తారని ఎదురు చూస్తున్నాం. కానీ ఏ ఒక్కరూ కూడా అంటరానితనం సమసిపోయే విధంగా మనస్ఫూర్తిగా ప్రయత్నించలేదు. కొందరూ అరకొరగా కార్యక్రమాలు నిర్వహించారు. కానీ ఫలితం లేకుండా పోయింది. అంతేకాక మతం పేరుతో మనం అణగతొక్కబడి శతాబ్దాల తరబడి అంతులేని హింసకూ, అత్యాచారాలకూ గురయ్యాం'' అంటూ బాబా సాహెబ్ అంబేడ్కర్ బౌద్ధ క్షేత్రమైన సారనాథ్‌లోని మహాబోధి సంస్థ ఏర్పాటు చేసిన సభలో ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 25, 1956న అంబేడ్కర్ చేసిన ఉపన్యాసం ఆయన జీవితంలో చివరి ఉపన్యాసం. అంబేడ్కర్ తన చిట్టచివరి ఉపన్యాసంలో తన జీవితానుభవపు సారాన్ని తన ఆవేదనాశ్రువులుగా దేశప్రజల ముందుంచారు. ముఖ్యంగా అంటరాని కులాలకూ సమానత్వ కాంక్షాపరులకూ ఆయన చివరి వ్యాఖ్యోపానంగా ఈ ఉపన్యాసం ఉంటుంది.

''మనం మురికిగా ఉన్నామని, నీచమైన పనులు చేసి జీవిస్తున్నామని అందుకే దూరముంచామని వందల ఏళ్ళ నుంచి ప్రచారం చేస్తూ వస్తున్నారు. కానీ వాస్తవంలో, ఈ రోజు మనం మురికిగా లేం. అందరిలానే పరిశుభ్రంగా ఉన్నాం. ఒక మనిషి ఇతను అంటరానివాడు అని ఇప్పుడు మనల్ని మన వస్త్రధారణను బట్టి నిర్ధారించలేని విధంగా ఉన్నాం. అయినప్పటికీ మన కులం తెలిస్తే, మనం పరిశుభ్రమైన దుస్తులు ధరించినా, మర్యాదగల వ్యాపారం చేసినా, మన మనస్సు, శీలం నిందించడానికి వీలులేనిదైనా మనల్ని అంటరానివారుగా చూస్తూనే ఉన్నారు. కాబట్టి మనం హిందూమతాన్ని విడిచిపెట్టి సమసమాజమనే సిద్ధాంతాన్ని ప్రబోధించిన, ప్రబోధిస్తోన్న బౌద్ధమతంలో చేరాలి. అది మాత్రమే మనుషుల మధ్య విభేదాలను తొలగిస్తుంది.'' అంటూ అంబేడ్కర్ తన చివరి ఉపన్యాసంలో ప్రబోధించారు. అంతే కాదు, అంబేడ్కర్ ఇటువంటి నిర్ణయానికి రావడానికి ఆయన సాగించిన సత్యశోధన, ఉద్యమకార్యాచరణ, శాసన నిర్మాణాలు కారణమయ్యాయి. అమెరికాలోని కొలంబియా వర్సిటీలో ఉన్నత చదువులకు వెళ్ళిన అంబేడ్కర్ 1916, మే, 9వ తేదీన ఆంత్రోపాలజీ సెమినార్‌లో ''భారతదేశంలో కులాలు''అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. అందులో కులాల పుట్టుకకు సంబంధించిన చారిత్రక పరిస్థితులను వివరించారు. వివాహ వ్యవస్థను ఒక సమూహానికే పరిమితం చేసి, ఒక సమూహాన్ని మరో సమూహంతో కలవకుండా చేసి, తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి చేసిన ప్రయత్నం కుల వ్యవస్థ ఏర్పాటుకు కారణమయ్యిందన్న విషయాన్ని అంబేడ్కర్ తన పత్రంలో వివరించారు.

ఆ తర్వాత అంబేడ్కర్ రాజకీయ అంశాలపైన దృష్టి కేంద్రీకరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటు కావాలని, అందులో అంటరానికులాలతో సహా అందరికీ భాగస్వామ్యం ఉండాలని 1919లో మొదటిసారిగా సౌత్‌బరో కమిటీ ఎదుట ప్రతిపాదించారు. అట్లా సైమన్ కమిషన్, రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లలో తన వాదనను వినిపించారు. 1946లో తన ప్రతిపాదనగా నూతన రాజ్యాంగంలో చేర్చడానికి వీలుగా 'స్టేట్స్, మైనారిటీస్' అనే డాక్యుమెంటును రూపొందించారు. అయితే కులం పోకుండా ఈ దేశంలో సమానత్వం రాదనే విషయాన్ని అంబేడ్కర్ బలంగా విశ్వసించారు. రాజకీయ హక్కుల కోసం తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే, కుల నిర్మూలనకు, అంటరానితనం రూపుమాపడానికి శక్తివంచన లేకుండా కృషిచేశారు.



కొత్త కోణం

రేపు బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి

అప్పటికీ గాంధీలాంటి సంస్కర్తల మాటలు ఆచరణలో ఎట్లా విఫలమవుతున్నాయో చూపడానికి మహద్ చెరువు సత్యాగ్రహం, కాలారామ్ దేవాలయ ప్రవేశ ఉద్యమాన్ని కొనసాగించారు. మహద్ చెరువులోని నీటిని కులమతాలకు అతీతంగా అందరూ వినియోగించుకోవాలని, ఆనాటి ప్రభుత్వం అనుమతితో చెరువులోకి అడుగుపెడితే, అస్పృశ్యులపై దాడి చేశారు. మహద్ చెరువు పోరాటం మార్చి 20, 1927లో జరిగింది. తర్వాత మూడేళ్ళకు 1930 మార్చి2న నాసిక్‌లోని కాలారామ్ దేవాలయంలోకి అంటరాని కులాల ప్రవేశానికి అంబేడ్కర్ ఉద్యమించారు. అది కూడా విఫలమైంది. అక్కడ కూడా హిందువులు అంబేడ్కర్‌తో సహా అంటరాని కులాలను దేవాలయంలోకి రానివ్వలేదు. అప్పుడు అంబేడ్కర్ హిందూమతం, దాని స్వభావం గురించి తీవ్రంగా ఆలోచించడం మొదలు పెట్టారు. సరిగ్గా 1930–32 సంవత్సరాల్లో జరిగిన మూడు రౌండ్ టేబుల్ సమావేశాల అనంతరం అంటరాని కులాలకు రాజకీయ హక్కుగా ప్రత్యేక ఓటింగ్ విధానాన్ని అంగీకరిస్తూ బ్రిటిష్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అప్పటివరకు అంటరాని కులాలను ఉద్ధరించేది తానేనని ప్రకటించుకున్న గాంధీ బ్రిటిష్ ప్రభుత్వ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ, ఆమరణ నిరాహారదీక్షకు పూనుకున్నారు. అప్పుడు తప్పని పరిస్థితుల్లో ప్రత్యేక ఓటింగ్ విధానాన్ని రద్దు చేసుకొని, గాంధీ ప్రతిపాదించిన పూనా ఒడంబడికను అయిష్టంగానే అంబేడ్కర్ ఒప్పుకోవాల్సి వచ్చింది. ఈ విషయం కూడా అంబేడ్కర్‌ను బాగా కలచివేసింది.

ఆ నేపథ్యంలోనే మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో యెవోల అనే పట్టణంలో అక్టోబర్ 12, 1935న జరిగిన అంటరాని కులాల సభలో అంబేడ్కర్ ఒక కీలకమైన ప్రకటన చేశారు. 'దురదృష్ట వశాత్తూ నేను హిందువుగా జన్మించాను. కానీ నేను హిందువుగా మరణించను' అని. ఈ ప్రకటన యావత్ దేశాన్ని అతలాకుతలం చేసింది. సమాజంలో సమాన గౌరవం, సమానహక్కుల కోసం జరిపిన పోరాటం ఏ విధంగా నిరర్థకంగా మారిందో చెపుతూ అంబేడ్కర్ ఆందోళన వెలిబుచ్చారు. ఈ ప్రకటనను ఆ సభకు హాజరైన వేలాదిమంది స్వాగతించారు. కానీ, అదే స్థాయిలో అగ్రవర్ణాల నుంచి వ్యతిరేకతను కూడా తీసుకొచ్చింది. గాంధీ ఒక వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ 'అంబేడ్కర్ ప్రకటన ఆందోళన కలిగిస్తున్నది. ఆయన తన ప్రకటనను వెనక్కి తీసుకోవాలి. ఆ నిర్ణయం ఫలితం ఇవ్వదు' అని తెలిపారు. దానికి అంబేడ్కర్ ఘాటైన సమాధానమే చెప్పారు. 'నేను హిందూ మతాన్ని వదిలిపెట్టాలని నిర్ణయించుకున్నాను. అంటరానికులాల వారు తామెలా వెళ్ళాలనుకుంటున్నారో వెళ్ళనివ్వండి. ఇది గాంధీకి నా సలహా' అంటూ గాంధీ అభిప్రాయాన్ని తోసిపుచ్చారు.

అదే సమయంలో అంబేడ్కర్ కుల నిర్మూలనకు సంబంధించిన తన సత్యశోధనను ఆపలేదు. అందులో భాగంగానే 1936లో లాహోర్‌లోని జాట్‌పాల్‌తోడక్ మండల్ సంస్థ ఆహ్వానం మేరకు కుల నిర్మూలనపై ప్రసంగించడానికి అంబేడ్కర్ అంగీకరించారు. కానీ ఆ సభ జరగలేదు. అయితే ఆ సభ కోసం అంబేడ్కర్ రూపొందించిన డాక్యుమెంట్ ఇప్పటికీ ఒక చర్చకు ప్రాతిపదికగా నిలుస్తున్నది. కుల నిర్మూలన పుస్తకంలో కులంపై ఎంతో వివరమైన విషయాలను ప్రస్తావిస్తూనే, కొన్ని ప్రతిపాదనలు కూడా చేశారు. తన మొట్టమొదటి పరిశోధనాపత్రం ''కులాల పుట్టుక''లో పేర్కొన్న వివాహ వ్యవస్థ కులం బలపడడానికి కారణమైందని వివరిస్తూ కులాంతర వివాహాలు, వర్ణాంతర భోజనాలు జరగాలని ప్రతిపాదించారు. పైగా, కులాన్ని సమర్థిస్తున్న ధర్మశాస్త్రాలను రద్దుచేయాలని కోరారు. వీటితో పాటు, హిందూ మతంలో అందరికీ సమాన హక్కులు ఉండే విధంగా అర్చక వ్యవస్థను ఒక కులానికి పరిమితం చేయరాదని కూడా అంబేడ్కర్ కరాకండీగా చెప్పారు. తన పరిశోధనలను కొనసాగిస్తూనే అంటరానితనం ఆచరించడానికి గల కారణాలను కనుగొన్నారు. 'అంటరానివారెవరు' అంటూ చేసిన తన శోధనలో ఆయనకు తను ఎటు వెళ్లాలో తెలిసింది. అంటరానితనం ఏర్పడడానికి నీచమైన వృత్తులు, ఆవు మాంసభక్షణ, మురికిగా ఉండడం లాంటి కారణాలు సహేతుకంగా లేవనీ, బౌద్ధాన్ని అవలంబిస్తూ హిందూమతంలోనికి తిరిగిరాని తెగలను హిందూ మతం వెలివేసిందని, నీచమైన వృత్తులను అంటగట్టిందని వివరించారు. ఆ విధంగా మళ్ళీ అంటరానివారి సొంత మతమైన బౌద్ధంలోకి వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. అందుకే 1944 నుంచి బౌద్ధంపై అంబేడ్కర్ అధ్యయనం సాగించారు. చివరకు 1956 అక్టోబర్, 14న ఐదు లక్షల మంది సమక్షంలో బౌద్ధం స్వీకరించి గొప్ప సామాజిక విప్లవానికి పునాదివేశారు. అంబేడ్కర్ బౌద్ధంలోకి వెళ్ళాలనే నిర్ణయానికి కారణం ఛాందస హిందూ వాదమే కానీ అంబేడ్కర్ స్వతహాగా కారణం కాదని అంబేడ్కర్ సామాజిక ప్రయాణం మనకు స్పష్టంగా వివరిస్తుంది. అందుకే కుల నిర్మూలన కోసం అంబేడ్కర్ చేసిన పోరాటం రేపటి భవిష్యత్ భారతావనికి సుస్పష్టమైన మార్గదర్శక వెలుగురేఖగా నిలుస్తుంది.


వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు | మొబైల్ : 81063 22077

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



### సంబంధం



"ఉత్తరప్రదేశ్ రైతులకు పది వేల కోట్ల రూపాయలను బకాయిపడ్డ మూడు పంచదార మిల్లులు ప్రముఖ పారిశ్రామికవేత్త రాహుల్ బజాజ్‌కి చెందినవని భారతీయ జనతా పార్టీ ఎంపీ ఆరోపించారు. అయితే బజాజ్ షుగర్ మిల్స్‌తో రాహుల్ బజాజ్‌కు సంబంధం లేదు. నిజానిజాలు తేల్చే వెబ్‌సైట్‌ను నడిపేటప్పుడు ఫొటోలను వాడేప్పుడు ఎవరెవరు ఏమిటో తెలుసుకోవాలి. లేకపోతే, సచిన్ 194 పరుగుల దగ్గర తన ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడానికి కూడా రాహుల్ బజాజే కారణమంటారు"

– రాహుల్ రాజ్, విద్యార్థి

### వలసలు



"మన దేశం నుంచి చాలా మంది గల్ఫ్ లాంటి ముస్లిం దేశాలకు మాత్రమే కాకుండా, యూరప్, ఉత్తర అమెరికాలోని క్రైస్తవ దేశాలకు కూడా వలస వెళుతున్నారు. అలాంటప్పుడు హిందూ వలసదారులను వారు అనుమతించకుండా, వారికి పౌరసత్వం ఇవ్వడానికి నిరాకరిస్తే భారత్‌కు ఎలా ఉంటుంది"

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

### పౌరసత్వం



"పౌరసత్వ సవరణ బిల్లు భారతీయత అనే ప్రాథమిక భావనకే వ్యతిరేకమైనది. ఈ బిల్లు ప్రకారం ముస్లింలను మాత్రమే అడ్డుకుని మిగిలిన మతాల వారిని దేశంలోకి అనుమతిస్తామని చెప్పడం ఆందోళన కలిగిస్తోంది. వేధింపులే కొలమానమయితే మతాన్ని ప్రమాణంగా తీసుకోకుండా అందరికీ పౌరసత్వాన్ని ఇవ్వాల్సి ఉంటుంది"

– రాహుల్ కన్వల్, జర్నలిస్ట్

### చట్టం



"బిహార్‌లో ఎటువంటి చట్టాలు అమలు కావడం లేదు. అదుపు లేకుండా సాగుతున్న నేరాలు, పాశవికమైన సామూహిక అత్యాచారాలు, బాలికల హత్య, వ్యాపారవేత్తల హత్యా ఉదంతాలు పట్టపగలే జరుగుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కనీసం నోరు మెదపడం లేదు. ఈ అరాచకాల గురించి ముఖ్యమంత్రిని ఎందుకు ప్రశ్నించకూడదు?"

– తేజస్వీ యాదవ్, ఆర్జేడీ నేత

### కేసులు



"దేశంలో అంతర్యుద్ధం రెచ్చగొట్టడానికి చేసిన కుట్రలో భాగమే 'బీమా కోరేగావ్'. ఊహించినట్టుగానే శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీ ప్రభుత్వం అందరిపైనా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ కేసును ఎన్ఐఏ వంటి కేంద్ర సంస్థకు అప్పగించాలని హోంమంత్రి అమిత్ షాను కోరుతున్నా"

– అభిషేక్, అసిస్టెంట్ ప్రొఫెసర్

### 120



"కశ్మీర్‌లో ఇంటర్నెట్ సర్వీసులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసి ఇప్పటికి సరిగ్గా నాలుగు నెలలు. నాలుగు నెలల సుదీర్ఘకాలం.. అంటే, ఏడాదిలో నాలుగో వంతు.. 120 రోజులు, ఇప్పటికి అక్కడ ఇంకా అదే పరిస్థితి కొనసాగుతోంది"

– షెహ్లా రషీద్, కార్యకర్త

## ఇన్‌బాక్స్

### కోతల నుంచి నేలను కాపాడుదాం

మానవ వికాసానికి ఆరోగ్యవంతమైన నేలలు అత్యంత ప్రధానమైనవి. మనం తినే ఆహారంలో 95% వరకు నేలనుండే ఉత్పత్తి అవుతున్నది. పైగా మనం తాగేనీటిలో 99.9 శాతం మేర నేలపై పొరలో వడపోత జరిగి, వర్షపునీరు మనం తాగడానికి అనువుగా మారుతున్నది. వాతావరణంలోని కర్బనాలను నేల వివిధ రకాలుగా శోషించి, భూమిలో స్థిరీకరించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని, వాతావరణ మార్పులను తగ్గించడానికి కారణమవుతున్నది. పంట మొక్కలకు, అటవీ వృక్షాలకు తగినంత నీటిని, పోషకాలను అందించి ఆహారం, వస్త్రాలు, కలప, ఔషధాల ఉత్పత్తికి నేల దోహదపడుతున్నది. అంతటి విలువైన సహజ వనరు అయిన నేలను గౌరవ భావంతో నిర్వహించి నేల ఆరోగ్యాన్ని సంరక్షిస్తూనే ఆహార ధాన్యాలను, ఇతరమైన ఆహారాన్ని పండించుకోవాలి.


నేలను విచక్షణారహితంగా ఉపయోగించి నేల ఆరోగ్యాన్ని క్షీణపరిచే సాగు పద్ధతులు మన దేశంలోనే కాక ఇతర ప్రపంచ దేశాలలో కూడా జరుగుతున్నట్లు వెల్లడయింది. పోడు పద్ధతి వ్యవసాయం, అధికంగా నేలను దుక్కిచేయటం, అధిక సాంద్ర పంటల సరళి, విచక్షణా రహితంగా అధిక మోతాదులో వాడే రసాయన ఎరువులు, పురుగుమందులు, కలుపు నాశినిలు, అశాస్త్రీయ నీటి యాజమాన్యం వంటి సాగు పద్ధతులవల్ల పంట నేలలు కాలుష్యం బారినపడి సారం తగ్గి తీవ్రమైన నేల కోతకు గురవడం ద్వారా అత్యంత విలువైన నేల పై పొర, నీరు తీవ్ర గాలి ద్వారా కొట్టుకుపోతున్నది. డెహ్రాడూన్‌లోని కేంద్రీయ నేల మరియు నీటి సంరక్షణ సంస్థ వారి అధ్యయనం ప్రకారం మన దేశంలో ఇప్పటికే 82.6 మిలియన్ హెక్టార్ల భూమి పై పొర కోతకు గురైనట్లు వెల్లడయింది. సాలీనా 5,334 టన్నుల సారవంతమైన నేల పై పొర మట్టి నేల కోతద్వారా కొట్టుకుపోతున్నట్లు నిరూపితమైంది. దాంతో పాటు నేల నుంచి ఏటా 8.4 మిలియన్ టన్నుల పరిమాణంలో వివిధ పోషకాలు కూడా కొట్టుకుపోతున్నట్లు తెలియవచ్చింది. వీటివల్ల పంట భూముల ఉత్పాదకత సామర్థ్యం కంటే 50% వరకు తగ్గుతుందని అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇదే రీతిలో నేల కోత జరిగితే ఇప్పటికే 33% ఉన్న నేల కోతకు గురైన భూముల విస్తీర్ణం, 2050 సంవత్సరానికి 90% భూములకు విస్తరిస్తుందని ఎఫ్ఏఓ సంస్థ అంచనా వేసి ఐక్యరాజ్యసమితిని మేల్కొలిపింది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి 2019 సంవత్సరం ప్రపంచ నేలల దినోత్సవంపై దృష్టి పెట్టి నేల కోతను అరికట్టి భూమి మీద జీవరాశిని కాపాడుదాం అనే విషయానికి ప్రాచుర్యం కల్పించాలని నిర్ణయించింది.

(నేడు ప్రపంచ నేలల దినోత్సవం)

డా॥ పి. గురుమూర్తి, వ్యవసాయ కళాశాల, నైర, ఆముదాలవలస, శ్రీకాకుళం

# జీరో ఎఫ్ఐఆర్ ఎప్పుడు, ఎలా?

సందర్భం



మంగారి రాజేందర్

'దిశ' సంఘటన తరువాత 'జీరో' ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) గురించిన చర్చ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా జరుగుతోంది. తమకు అధికార పరిధి లేదన్న కారణంగా పోలీసులు ఎఫ్ఐఆర్‌ని తీసుకోలేదని ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో జీరో ఎఫ్ఐఆర్ చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది. నేర సమాచారం అందిన వెంటనే చట్టప్రకారం కేసు నమోదు చేయాలని రెండు తెలుగు రాష్ట్రాల డీజీపీలు పోలీసులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు యంత్రాంగం ఈ విషయం గురించి సర్క్యులర్‌ని కూడా జారీ చేసింది. తమకు కేసుని దర్యాప్తు చేసే అధికార పరిధి లేకున్నా ఎఫ్ఐఆర్‌ని విడుదల చేయాలన్నది 'జీరో ఎఫ్ఐఆర్' సారాంశం. నేర తీవ్రత ఎక్కువగా ఉండి, వారెంట్ అవసరం లేకుండానే అరెస్టు చేయగలిగే కేసుల్లో (కాగ్నిజబుల్) నేర సమాచారం అందుకున్న తరువాత పోలీసులు తమ అధికార పరిధితో నిమిత్తం లేకుండా ప్రథమ సమాచార నివేదికను విడుదల చేయాలని, ఆ విధంగా చేయకపోతే వాళ్లపై భారతీయ శిక్షాస్మృతి లోని సె.166ఏ ప్రకారం చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సెప్టెంబర్ 19, 2019 రోజున కర్ణాటక పోలీసులని ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది.

కాగ్నిజబుల్ నేర సమాచారం అందినప్పుడు పోలీసులు (155లోని) తమ అధికార పరిధితో నిమిత్తం లేకుండా కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. పోలీసులు తమ కోర్టు అధికార పరిధిలోని కేసులనే దర్యాప్తు చేయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సె.156(1) చెబుతుంది. అందుకని తమ అధికార పరిధిలేని కేసులో పోలీసులు ఎఫ్ఐఆర్ విడుదల చేసిన తరువాత, మొత్తం కేసు డైరీని తదుపరి దర్యాప్తు నిమిత్తం సంబంధిత పోలీసులకి పంపించాల్సి ఉంటుంది.

### జీరో ఎఫ్ఐఆర్ భావన

డిసెంబర్ 2012 సంవత్సరంలో ఢిల్లీలో నిర్భయ సంఘటన తరువాత ఈ జీరో ఎఫ్ఐఆర్ అన్న పదబంధం తెరమీదికి వచ్చింది. ఆ సంఘటన జరిగిన తరువాత నియమించిన జస్టిస్ వర్మ కమిటీ తన నివేదికలో ఈ భావనని ప్రతిపాదించింది. కేసుని దర్యాప్తు చేసే అధికార పరిధి లేని పోలీసు అధికారి కాగ్నిజబుల్ నేర సమాచారం అందుకుని ప్రథమ సమాచార నివేదికను విడుదల చేయడాన్ని ఇప్పుడు కొత్తగా జీరో ఎఫ్ఐఆర్ అని అంటున్నారు. నేరం ఎక్కడ జరిగినా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ప్రథమ సమాచారాన్ని ఇవ్వవచ్చు. బాధితుల సౌకర్యం కోసం ఈ భావనని తీసుకొని వచ్చారు. ఇది చట్టంలో ఉన్న విషయమే. లైంగిక నేరాలకు సంబంధించిన సమాచారం అందుకుని పోలీసులు కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ విడుదల చేయకపోతే వాళ్లు భారతీయ శిక్షాస్మృతిలోని సె.166ఏ ప్రకారం నేరం చేసినట్లు అవుతుంది. అది కాగ్నిజబుల్ నేరం.





మహిళల మీద నేరాలు జరిగినప్పుడు వాళ్లు తమకు దగ్గరలో ఉన్న స్టేషన్లో ప్రథమ సమాచారం ఇచ్చే వీలు చిక్కుతుంది. అదే విధంగా హత్య, ఆక్సిడెంట్ లాంటి నేరాలు జరిగినప్పుడు జీరో ఎఫ్ఐఆర్ విడుదల చేయడంవల్ల సాక్షులను కాపాడటానికి వీలుపడుతుంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సె.156(1) ప్రకారం తన అధికార పరిధిలోని కేసులనే దర్యాప్తు చేసే అధికారం పోలీసులకి ఉంటుంది. అదే నిబంధనలోని సబ్ సెక్షన్ (2) ప్రకారం–పోలీసులు దర్యాప్తు చేయడానికి అధికార పరిధి లేదన్న కారణంగా, ప్రశ్నించే అవకాశం లేదు. సె.156(3) ప్రకారం నేరాన్ని సె.190 ప్రకారం గుర్తించే అధికారం ఉన్న మేజిస్ట్రేట్ దర్యాప్తుని ఆదేశించవచ్చు.

దర్యాప్తు తరువాత తనకి అధికార పరిధి లేదన్న అభిప్రాయానికి పోలీసు అధికారి వచ్చినప్పుడు కేసు డైరీని సంబంధిత పోలీసులకి పంపించవచ్చు. అంతేకానీ ఎఫ్ఐఆర్‌ని నమోదు చేయడానికి నిరాకరించకూడదు. దిశ కేసులో పోలీసులు అధికార పరిధి లేదన్న కారణంగా ఎఫ్ఐఆర్‌ని విడుదల చేయకపోవడంతో వాళ్లని సస్పెండ్ చేశారని పత్రికల్లో చూశాం. ఒకవేళ ఆ ఆరోపణ నిజమైతే వాళ్లు శాఖాపరమైన చర్యలకే కాదు.. భారతీయ శిక్షాస్మృతిలోని సె.166ఏ ప్రకారం కూడా శిక్షార్హులే. జీరో ఎఫ్ఐఆర్‌వల్ల ఉపయోగాలతో బాటూ నష్టాలూ ఉన్నాయి. కొంతమంది ఈ భావనని దుర్వినియోగం చేయడంవల్ల బాధితులకి నష్టం కలుగుతుంది. కొంతమంది దురుద్దేశంతో తమ ప్రయోజనాలకి అనుగుణంగా కేసు విషయాలను ప్రథమ సమాచార నివేదికలో పొందుపరిచి, తమకు అనుకూలంగా ఉన్న పోలీసులతో కుమ్మక్కై బాధితులకి నష్టం కలుగజేసే అవకాశం ఉంది. అయితే ఈ పరిస్థితిని పై అధికారులు సరిచేసే అవకాశం ఉంది. కోర్టులు కూడా సరిచేయవచ్చు. జీరో ఎఫ్ఐఆర్ భావనని తీసుకొని తమకు అనుకూలంగా పోలీసు స్టేషన్లలో కేసులని నమోదు చేయించుకొని దుర్వినియోగంచేసే అవకాశం ఉంది. హత్య, అత్యాచారం లాంటి కేసుల విష యంలో పోలీసులు జాగ్రత్తగా ఉండాలి. మిస్సింగ్ కేసులని కూడా జాగ్రత్తగా చూడాల్సి ఉంటుంది. జీరో ఎఫ్ఐఆర్ చట్టబద్ధం. 1976లోనే ఈ విషయాన్ని సుప్రీంకోర్టు జీరో ఎఫ్ఐఆర్ అని చెప్పకుండా అధికార పరిధితో నిమిత్తం లేకుండా విడుదల చేయాలని చెప్పింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సె.154 ఇదే విష యాన్ని చెబుతుంది. ఇన్ని సంవత్సరాలు గడిచినా పోలీసులు ఈ విషయాన్ని గుర్తించకపోవడం బాధని కలుగజేస్తుంది. తెలిసి చేస్తున్నారా, తెలియక చేస్తున్నారా వాళ్లకే తెలియాలి. కనీసం నిర్భయ ఘటన తరువాతైనా ఈ విషయాన్ని పట్టించుకోక పోవడం శోచనీయం. దిశ సంఘటన తరువాత అలాంటి సంఘటనలు మళ్లీ మళ్లీ జరుగవని ఆశిద్దాం.

వ్యాసకర్త గతంలో జిల్లా సెషన్స్ జడ్జీగా, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యునిగా పనిచేశారు
మొబైల్ : 94404 83001

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 5-12-2019



కూతురి ఫొటోతో ప్రసాద్

**నిర్భయకు ముందు .. తర్వాతా ఎలాంటి మార్పూ రాలేదు అమ్మాయిల గౌరవమర్యాదలకు సంబంధించి! నిర్భయ తాలూకు ప్రకంపనలు పార్లమెంట్ ఆవరణను తాకినా ఇంటా, బయటా ఎక్కడా మహిళలకు భద్రత లేదు! ముంబైలో తెలుగు అమ్మాయి ఎస్తర్ అనూహ్య, హాజీపూర్‌లో అక్కాచెల్లెళ్లు, వరంగల్‌లో తొమ్మిదినెలల పాప, నిన్నటికి నిన్న మానస, టేకుల లక్ష్మి, దిశ.. పసిపిల్ల దశ నుంచే రక్షణ కరువు! తన బిడ్డను పోగొట్టుకున్న బాధ తెలిశాక ఇంకే బిడ్డా ఇలాంటి ఘోరానికి బలికావద్దు.. మరే తల్లి, తండ్రికీ ఈ వేదన మిగలకూడదు అనుకున్నాడు ఎస్తర్ అనూహ్య తండ్రి.. ఎస్.జి.ఎస్ ప్రసాద్. దిశ సంఘటన నేపథ్యంలో తాము మింగిన విషాదాన్ని గుర్తు చేసుకుంటూ.. సమాజానికి ఈ విశ్రాంత అధ్యాపకుడు చేస్తున్న విన్నపం ఆయన మాటల్లోనే...**

# ఈ దిశగా పోలీసింగ్...

''దిశ ఇన్సిడెంట్ గురించి కంప్లయింట్ ఇవ్వడానికి ఆ అమ్మాయి తల్లిదండ్రులు స్టేషన్‌కు వెళ్లడం, పోలీసుల ప్రవర్తన అన్నీ మా అమ్మాయి ఇన్సిడెంట్‌నే గుర్తుచేశాయి. 2014లో మాదీ ఇలాంటి విషాదమే. మా అమ్మాయి ముంబైలో టీసీఎస్‌లో వర్క్ చేసేది. సెలవుమీద డిసెంబర్లో మచిలీపట్టణం వచ్చి.. జనవరి 4న (2014) మళ్లీ ముంబైకి బయలుదేరింది. అయిదో తారీఖు ఉదయం కల్లా చేరుకోవాలి. ఏడుగంటలకు తన సెల్‌కి కాల్ చేశా. రింగ్ అవుతోంది కాని రిప్లయ్ లేదు. అమ్మాయి రూమ్మేట్‌కీ ఫోన్ చేశా. ఇంకా చేరుకోలేదని చెప్పింది. మనసు కీడు శంకించి వెంటనే ముంబై వెళ్లాం. రైల్వే పోలీసులు.. ట్రాక్‌కి అవతల ఉన్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లమన్నారు. వెళ్లి కంప్లయింట్ ఇచ్చాం. 'మిస్సింగ్ కేస్'గా నమోదు చేసుకొని.. ''కనపడితే ఇన్‌ఫామ్ చేస్తాం'' అని చాలా నింపాదిగా చెప్పారు. పోలీసుల నుంచి దిశ పేరెంట్స్ ఎదుర్కొన్న ప్రశ్నలనే నాడు మేమూ ఎదుర్కొన్నాం. ''ఏ ఫ్రెండ్‌తోనో వెళ్లుంటుంది'' అని, ''కంగారు పడకండి.. రెండు రోజుల్లో అమ్మాయి నుంచి మీకు ఫోన్ వస్తుంది పెళ్లి చేసుకున్నట్టుగా..'' అంటూ కామెంట్స్ చేశారు. ''మా అమ్మాయితో మేం చాలా ఫ్రెండ్లీగా ఉంటామండీ.. అలాంటిదేదైనా ఉంటే మాతో చెప్పేంత చనువు తనకు ఉంది'' అని చెప్పినా వాళ్ల తీరు మారలేదు. మా టెన్షన్, భయాన్ని అర్థంచేసుకోలేదు, పట్టించుకోలేదు. టీసీఎస్‌లోని హయ్యరాఫీషియల్స్ ఇన్‌వాల్వ్ అయితేనే రెస్పాన్స్ వచ్చింది. అప్పటికీ మా బంధువులు, స్నేహితులు అందరూ రంగంలోకి దిగి మా అమ్మాయి సెల్‌ఫోన్ సిగ్నల్స్‌ను ట్రేస్ చేశారు. ఇలా అన్ని వైపుల నుంచి అన్నిరకాల సమాచారం తీసుకొని పోలీసులకు అందిస్తే అప్పుడు దాన్ని పట్టుకొని వాళ్లు ముందుకెళ్లారు. పదో రోజుకి మా అమ్మాయి స్కెలిటన్‌గా దొరికింది! అప్పటికే మీడియా ప్రచారం, పొలిటికల్ ప్రెజర్ పెరిగి ఉండడం వల్ల ట్రయలప్పుడు మాత్రం చురుగ్గా కదిలారు. సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ తప్ప ఏమీ లేదు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు అయింది. యేడాది లోగా నేరస్తుడికి శిక్ష పడింది. ఇంకా అమలు కాలేదు.

### సున్నితంగా ఆలోచించరు ఎందుకు?

పోలీసులు ఇంట్రెస్ట్ పెడితే తప్పకుండా చేయగలరు. అమ్మాయి కనపడట్లేదు అని తల్లిదండ్రులు కంప్లయింట్ ఇస్తే ఈ స్టేషన్ కాదు ఇంకో స్టేషన్ అని తప్పించుకోవడం ఎందుకు? ఇన్సిడెంట్ ఎక్కడ జరిగినా.. జ్యూరిస్ డిక్షన్‌తో సంబంధం లేకుండా ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా రిపోర్ట్ తీసుకోవాలి అని స్పష్టంగా ఉంది కదా! సుప్రీం కోర్టే ఆర్డర్ ఇచ్చింతర్వాత కూడా ఈ కాలయాపన ఎందుకు? ఆడపిల్ల కనిపించకుండా పోయింది అనేది చాలా సీరియస్, సెన్సిటివ్ విషయం. ''మీ అమ్మాయికి బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడా?, లవ్ మ్యాటరా?, రెండ్రోజులాగి తనే వస్తుందిలెండి, పెళ్లిచేసుకొని మీకు ఫోన్ చేస్తుంది..'' లాంటి ప్రశ్నలు అడగొచ్చా? బాయ్‌ఫ్రెండే ఉన్నాడనుకోండి, పెళ్లిచేసుకోవడానికే వెళ్లిందనుకోండి.. పోలీసులు ముందు ప్రమాదాన్నయితే శంకించి జాడ తీయాలి కదా! సున్నితంగా ఆలోచించరెందుకు? ఫ్రెండ్లీ పోలీసే కాదు.. బాధ్యతగల పోలీసులూ కావాలి. ఏమైంది ఈ రోజు? మరో తల్లికి, తండ్రికి శోకం తప్ప ఏం మిగిలిందీ? నా బిడ్డ పోయినప్పుడు అనుకున్నాను.. ఇంకే పేరెంట్స్‌కీ ఇలాంటి అనుభవం ఎదురుకావొద్దు. మరే తల్లిదండ్రులకూ మా బాధ రాకూడదు అని. ఇప్పుడు దిశ వాళ్ల అమ్మానాన్నా అదే అనుకుంటున్నారు. నాడు నిర్భయ తల్లిదండ్రులూ అదే కోరుకున్నారు. కాని ఆగలేదు. దిశను తిరిగి తేలేం. ఆ అమ్మాయి తల్లిదండ్రుల బాధనూ తీర్చలేం. నిబ్బరంగా ఉండండి అని చెప్పడం తప్ప ఏం చేయగలుగుతున్నాం?

### కోపంగా, ఆవేశంగా కాదు...

మాకు జరిగిన దారుణం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకముందే ఇలాంటివెన్నో వింటున్నాం. అమ్మాయిలు బాగా చదివి, జీవితంలో చక్కగా స్థిరపడాలని కోరుకోవడం తప్పు కాదుకదా! ఆడపిల్లలు మగపిల్లలతో పోటీపడి ముందుండాలనుకోవడమూ పొరపాటు కావొద్దు కదా! ఇవన్నీ చూస్తుంటే ఆడపిల్లలను మళ్లీ గడపకే పరిమితం చేస్తారేమోననే దిగులు. ఓ బిడ్డను పోగొట్టుకున్న తండ్రిగా ఈ సమాజానికి నాదొక్కటే విన్నపం.. ఆడపిల్లల్ని బతకనిద్దాం. మనం కాన్‌సంట్రేట్ చేయాల్సింది ఆడపిల్లల మీద కాదు. మగపిల్లల మీద, వాళ్ల పెంపకం, ప్రవర్తన మీద. మగపిల్లాడు ఏం చేసినా చెల్లుతుంది అనే భావన పెంచొద్దు. అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ సమానమే. ఇద్దరికీ ఒకే రెస్పెక్ట్ ఉండాలని తెలియచేయాలి. బాధను అనుభవించిన వాళ్లు చెబితే అర్థం అవుతుందని, అర్థం చేసుకుంటారని ముందుకొచ్చాను. ఒక అమ్మాయిని కోల్పోవడం ఆ కుటుంబానికే కాదు సమాజానికీ లోటే. ఒక అబ్బాయి నేరస్తుడవుతే ఇంటికే కాదు సమాజానికీ ప్రమాదమే! ఇలాంటి సంఘటనలు జరగగానే కోపం,ఆవేశం రావడం సహజమే. ఆ భావోద్వేగంలో నేరస్తులను పట్టుకొని నడిరోడ్డుమీద కొట్టాలి, చంపాలి అంటారు. నా బిడ్డ పోయినప్పుడు నాకూ అలాగే అనిపించింది. కాని ఇలాంటి ఆటవిక న్యాయం మరెన్నో ఘోరాలకు కారణమవుతుంది. మనకు చట్టాలున్నాయి. ఇలాంటి దారుణాలు మళ్లీ జరక్కుండా చూసే తీర్పులు కావాలి. అలాంటి చట్టాలు రావాలి. సత్వరంగా న్యాయం అందేలా ఉండాలి'' అంటున్నారు మచిలీపట్టణంలోని నోబుల్ కాలేజ్ పొలిటికల్ సైన్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా రిటైరైన ఎస్.జి.ఎస్.ప్రసాద్.

– ఫొటోలు: **జె. అజీజ్, సాక్షి, మచిలీపట్నం**

### ఏం జరిగింది?




స్టేషన్‌లోని ఎస్తర్ సీసీ ఫుటేజ్ దృశ్యం

**2014, జనవరి అయిదో తారీఖు తెల్లవారు జామున ముంబై, కుర్లాలోని లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో దిగిన ఎస్తర్ అనూహ్య ఒక టూ వీలర్ ట్యాక్సీలో తన రూమ్‌కి బయలుదేరింది. పదో రోజున ముంబై శివార్లలో అస్థిపంజరమై కనిపించింది. డ్రాప్ చేస్తానని చెప్పిన ఆ టూ వీలర్ రైడర్ చంద్రభాన్ సానప్ ఆమె మీద లైంగిక దాడి, హత్య చేశాడని రుజువైంది. అతనికి మరణ శిక్ష ఖరారైంది.**

సీజనల్ టిప్స్

# చర్మం పొడిబారుతుంటే...

**స్వెటర్ వేసుకునో, వేడి వేడిగా కప్పు టీ తాగో చలిని ఇట్టే తరిమేయచ్చు. కానీ, పొడిబారే చర్మాన్ని అశ్రద్ధ చేస్తే మాత్రం దురద, ముడతలు పడటం వంటి సమస్యలు దీర్ఘకాలం బాధిస్తాయి. ఎండాకాలం కన్నా చలికాలం వేధించే చర్మ సమస్యలే అధికం. అందుకు కోల్డ్ క్రీములు, మాయిశ్చరైజర్లు ఉపయోగించినా రోజువారీ ఇంట్లో కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి.**



**గ్లిజరిన్ - పెట్రోలియమ్ జెల్లీ**

దూది ఉండను తీసుకొని గ్లిజర్‌లో అద్ది, పొడిబారిన చర్మంపై మృదువుగా రాయాలి. చర్మంలోకి ఇంకి పొడిబారడం సమస్య తగ్గుతుంది. వారానికి నాలుగైదు సార్లు రాయచు. అలాగే, పెట్రోలియమ్‌జెల్లీలో మాయిశ్చరైజర్ లక్షణాలు అధికం. పొడి చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. రాత్రి పడుకునేముందు పెట్రోలియమ్ జెల్లీ రాసుకుంటే చర్మం పొడిబారడం సమస్య దరిచేరదు.

**పొద్దుతిరుగుడు నూనె**

చర్మం పొడిబారితే త్వరగా ముడతలు పడుతుంది. ఈ సమస్యకు సత్వర పరిష్కారం చూపుతుంది పొద్దుతిరుగుడు నూనె. కొద్దిగా ఈ నూనెతో చేతిలో వేసుకొని, ముఖానికి, కాళ్లకు, చేతులకు పట్టించి, మృదువుగా మర్దన చేసి వదిలేయాలి. రోజుకు ఒకసారైనా ఇలా చేస్తే చర్మం పొడిబారే సమస్య ఉండదు.

**తేనె-బొప్పాయి**

బొప్పాయిలో చర్మం ముడతలు పడటానికి నివారించే యాంటీ ఏజింగ్ ఏజెంట్స్ అధికం. తేనెలో చర్మాన్ని మృదువుగా మార్చే సుగుణాలు ఉన్నాయి. బొప్పాయి గుజ్జులో తేనె కలిసి ముఖానికి, మెడకు, చేతులకు రాసి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.

**కొబ్బరినూనె**

చర్మానికి అద్భుతమైన మాయిశ్చరైజర్ అంటే అది కొబ్బరి నూనె. కొద్దిగా అరచేతిలో కొబ్బరి నూనె వేసుకొని రెండు చేతులకూ రాసి పొడిబారిన చర్మం మీదుగా రాయాలి. త్వరగా రిలీఫ్ లభిస్తుంది. చర్మం పొడిబారడం సమస్యా తగ్గుతుంది.



**పాలు - బాదం**

బాదంపప్పు, పాలలో చర్మానికి మాయిశ్చరైజర్‌నిచ్చే సుగుణాలు ఉన్నాయి. పొడిబారి కందిపోయిన చర్మానికి ఇవి ఉపశమనంతో పాటు సమస్యను తగ్గిస్తాయి. టీ స్పూన్ బాదం పొడి, రెండు టేబుల్ స్పూన్ల పాలు కలిపి మిశ్రమం తయారుచేసుకొని కందిపోయిన చర్మం మీదుగా రాయాలి. పది నిమిషాల తర్వాత చల్లని నీటితో కడగాలి. వారానికి రెండుసార్లు ఈ విధంగా చేస్తే చర్మానికి తగిన మాయిశ్చరైజర్ లభిస్తుంది.

**తేనె - నిమ్మరసం**

నిమ్మలో యాంటీయాక్సిడెంట్లు, తేనెలో మాయిశ్చరైజింగ్ ఏజెంట్స్ ఉంటాయి. ఈ రెంటినీ కలిపి వాడితే చలికాలం వేధించే చర్మ సమస్యలు దరిచేరవు.

చెట్టు నీడ

# దేవుని ఎంపిక



ఇశ్రాయేలుగా దేవుడు మార్చిన యాకోబుకు పన్నెండు మంది కుమారులు. రూబేను, సుమెయోను, లేవీ, యూదా, దాను, నఫ్తాలి, గాదు, ఆషేరు, ఇశ్శాఖారు, జెబూలూను, యోసేపు, బెన్యామీను అనే ఆ పన్నెండు మందినీ ఇశ్రాయేలీయుల పన్నెండు గోత్రాలకు పెద్దలుగా దేవుడు దీవించాడు. వీరిలో యూదా గోత్రానికి చెందిన దావీదును దేవుడు ఇశ్రాయేలీయుల రెండవ చక్రవర్తిగా హెచ్చించాడు. దావీదు వారసులైన రాజుల కాలంలో ఇశ్రాయేలు రాజ్యం యెరూషలేము రాజధానిగా యూదా, బెన్యామీను గోత్రాలవారితో యూదా దక్షిణ రాజ్యంగా, మిగిలిన పది గోత్రాల వారితో షోమ్రోను రాజధానిగా ఇశ్రాయేలు ఉత్తర రాజ్యంగా విడిపోయాయి. వాళ్లంతా సమైక్యంగా, దేవునికి విధేయులుగా ఉన్నంత వరకూ బాగానే ఉంది. కానీ రెండు రాజ్యాలుగా విడిపోయి బలహీనపడ్డ కారణంగా పొరుగున ఉన్న శత్రు దేశాలకు లోకువయ్యారు. ఆ కారణంగా క్రీస్తుకు పూర్వం 586లో బబులోనీయులు వారిని చెరపట్టి బానిసలను చేసుకున్నారు. ఒక గొప్ప జనాంగంగా తీర్చిదిద్దడానికి దేవుడు ఎన్నుకున్న ఇశ్రాయేలు అనే యాకోబు వంశం అవిధేయత, అనైక్యత వల్ల ఇలా చిన్నాభిన్నమయ్యింది. కాని ఈ లోకానికి తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తును రక్షకుడుగా పంపడానికి ఏర్పర్చుకున్న యూదా రాజవంశానికి చెందిన యోసేపును, లేవీ వంశీయురాలు.. అంటే యాజక సంతతికి చెందిన మరియను యేసుప్రభువుకు తల్లిదండ్రులుగా దేవుడు ఎంపిక చేసుకున్నాడు. అందుకే దైవరాజ్యానికి రాజుగా, ప్రజలందరికీ ప్రధానయాజకత్వం వహించే యాజకుడుగా దేవుడు యేసును ప్రతిష్ఠించగా.. యోసేపు, మరియల కుమారుడుగా ఆయన దావీదు పట్టణమైన బేత్లెహేములో పరిశుద్ధాత్మశక్తి ద్వారా నరరూపధారి అయ్యాడు. ఇదే శుభ క్రిస్మస్ ద్వారా ఈ లోకంలో జరిగిన నవ శకారంభం.

ఈ లోకానికి తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తును రక్షకుడుగా పంపడానికి ఏర్పర్చుకున్న యూదా రాజవంశానికి చెందిన యోసేపును, లేవీ వంశీయురాలు.. అంటే యాజక సంతతికి చెందిన మరియను యేసుప్రభువుకు తల్లిదండ్రులుగా దేవుడు ఎంపిక చేసుకున్నాడు.

– డా. సుభక్త



బాలిక నుదుటిపై ముద్దుపెడుతున్న యువరాజు

# రాజుగారు ఇంటికొచ్చారు

చిన్నారులు మనసు చిన్నబుచ్చుకుంటే పెద్దవాళ్ల ప్రాణం ఉసూరుమంటుంది. చిన్నబుచ్చింది తామే అని తెలిస్తే వెళ్లి ఊరడించేవరకు ఊరుకోరు. షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ పెద్ద మనిషి మనిషి మాత్రమే కాదు, అబుదాబికి యువరాజు కూడా! అంతటి మనిషి తనకు తెలియకుండానే ఓ బాలిక మనసు నొప్పించారు. ఓ విందు కార్యక్రమానికి ఆయన హాజరు అవుతున్నారని తెలిసి ఆయనకు స్వాగతం పలికేందుకు కొందరు చిన్నారులను ఎంపిక చేశారు నిర్వాహకులు. ఆ పిల్లలందర్నీ పలకరిస్తూ ముందుకు వెళుతున్న యువరాజు వారిలోని ఒక చిన్నారి చాచిన స్నేహ హస్తాన్ని గమనించకుండానే అక్కడి నుంచి నిష్క్రమించారు. తర్వాత ఆ వీడియో వైరల్ అయి యువరాజు వరకు వచ్చింది. వెంటనే ఆయన ఆ బాలిక ఇంటిని వెతుక్కుంటూ వెళ్లి ఆప్యాయంగా కరచాలనం చేశారు. అంతేకాదు. బాలిక నుదుటిపై ముద్దు కూడా పెట్టారు. ఇక చూడండి.. ఆ పాప ఆనందం, ఆ ఇంటి ఆనందం.

తాగాల్సిందే!

# కుదరకపోయినా ఓ కప్పు

మంచి కాఫీ కావాలంటే మద్రాసు కాఫీ హౌసుకి వెళ్లాల్సిందే అంటారు కాఫీ ప్రియులు. మరీ అంత దూరమైతే అక్కర్లేదు. విశాఖపట్టణం దగ్గరలో ఉన్న అరకులోనే మంచి కాఫీ చాలా సంవత్సరాలుగా దొరుకుతోంది. కిందటి ఏడాది ఈ అరకు కాఫీకి పారిస్‌లో 'ప్రిక్స్ ఎపిక్యూర్స్' అవార్డు కూడా వచ్చింది! ఆ అవార్డును అందుకున్నది కాఫీ గింజల్ని పండించిన అరకు గిరిజన మహిళలు కావడం విశేషం.



అరకులో కాఫీ పండిస్తున్న గిరిజ మహిళలు

ఇంకొక విశేషం ఏంటంటే.. పారిస్‌లో ఇప్పుడు 'అరకు' అనే పేరున్న కాఫీ స్టాల్ ముందర జనం ఆగిపోతున్నారు. అరకు కాఫీ ఘనతను కేవలం కొన్ని కాఫీ గింజలు ప్రపంచానికి చాటుతున్నాయి. అరకు ప్రాంతంలో ఉండే గిరిజనులు పండించిన నాణ్యమైన కాఫీ గింజలు అవి! అరకు లోయలో గిరిజన మహిళల చేతి మీద సుమారు ఒకటిన్నర లక్షల ఎకరాల్లో కాఫీ గింజలు పండుతున్నాయి. అయితే ఈ గింజలకు అంతర్జాతీయంగా మార్కెట్ ఉన్నా, ఈ గిరిజనులు మాత్రం ఆర్థికంగా నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ''మేం చాలా కష్టపడి పనిచేస్తున్నాం. ప్రతి ఒక్కరం పది బస్తాల గింజలు పండించుకుంటాం. వాటి నుంచి ఒక్కొక్కరం కనీసం సీజన్‌కి రెండు లక్షల రూపాయలు సంపాదించుకుంటేనే గిట్టుబాటు అవుతుంది. కానీ మాకు ఎనభై నుంచి తొంభై వేల రూపాయలు మాత్రమే వస్తోంది. ఖర్చులన్నీ పోగా, తిండి తినటానికి సరిపడేంత డబ్బు మాత్రమే మిగులుతోంది. మా ఆర్థికస్థితిలో ఎటువంటి ఎదుగుదల లేదు. దానితో మాలో చాలామందికి కాఫీ పండించాలనే ఆసక్తి సన్నగిల్లిపోతోంది'' అంటున్నారు అరకు గిరిజన మహిళలు. చరిత్రలోకి వెళ్తే.. 1898లో తూర్పుగోదావరి తీర ప్రాంతంలో ఒక బ్రిటిష్ అధికారి ఉండేవారు. ఆయన అక్కడి వాతావరణం చూసి, అది కాఫీ పంటకు అనుకూలంగా ఉంటుందని కాఫీ పంట వేశారు. 1950లలో ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ కాఫీ పంటను సాగు చేయడం మొదలైంది. అలా క్రమేపీ అరకు కాఫీ రుచికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. 'అరకు కాఫీ' అన్న పేరూ వచ్చింది. 1980 నాటికి రాష్ట్ర ప్రభుత్వం గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ ప్రారంభించి, కాఫీ పంటను ప్రోత్సహించింది. ఒకానొక సమయంలో వరి పంట కంటే కాఫీ పంట మీద లాభాలు వచ్చాయి. దాంతో చాలామంది రైతులు కాఫీ పండించడం మొదలుపెట్టారు. రెండేళ్ల క్రితం పారిస్‌లో అరకు కాఫీ స్టోర్ తెరుచుకుంది. ఈ స్టోర్ కారణంగానే కిందటి ఏడాది అరకు గిరిజన మహిళలకు అవార్డు వచ్చింది. ఇంత కమ్మని కాఫీని పండిస్తున్న ఈ గిరిజన మహిళలకు మాత్రం శ్రమకు తగ్గ ఫలితం లభించడం లేదు!




పారిస్‌లో 'అరకు కాఫీ'



సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
గురువారం ॥ 5-12-2019

# నాన్నా... ఈ సినిమా మీ కోసమే

- వెంకటేష్



● వివేక్ కూచిభొట్ల, కేయస్ రవీంద్ర, నాగచైతన్య, రాశీఖన్నా, వెంకటేశ్, సురేశ్‌బాబు, టీజీ విశ్వప్రసాద్

''వెంకీమామ' పక్కా తెలుగు చిత్రం. వల్గారిటీ తప్ప సినిమాలో అన్ని అంశాలు ఉన్నాయి'' అన్నారు డి. సురేష్ బాబు. వెంకటేష్, నాగచైతన్య హీరోలుగా కేఎస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెంకీమామ'. పాయల్‌రాజ్‌పుత్, రాశీఖన్నా కథానాయికలుగా నటించారు. డి. సురేష్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ–నిర్మాత. ఈ సినిమా ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేక రుల సమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ– ''నా కెరీర్‌లో ఎన్నో సినిమాలు చేశాను. కానీ 'వెంకీమామ' ప్రత్యేకమైనది. రానా, నాగచైతన్యలతో కలిసి పని చేయాలనుకుంటాను. ఆ కల నేరవేరిందని చెప్పొచ్చు. నాన్నగారు (డి.రామానా యుడు) మా అందరితో సినిమా చేయాలనుకునేవారు. నాన్న గారు ఉండి ఉంటే ఈ సినిమా చూసి ఎంజాయ్ చేసేవారు. 'నాన్నా.. ఈ సినిమా మీ కోసమే'. ఇందులో నాగచైతన్య ఆల్ రౌండర్ పెర్ఫార్మెన్స్ చేశాడు. మామా అల్లుళ్ల కథను చాలా సెన్సిబుల్‌గా తెరకెక్కించాడు బాబీ. తమన్ మంచి సంగీతం ఇచ్చాడు'' అన్నారు. ''నేను ఎన్ని సినిమాలు చేసినా 'మనం, వెంకీమామ' నాకు మంచి జ్ఞాపకాలుగా గుర్తుండిపోతాయి. కాస్త ఆలస్యమైనా సురేష్ ప్రొడక్షన్స్‌లో సినిమా చేయాలనే నా ఆశ నేరవేరింది. 'ప్రేమమ్' సినిమాలో ఓ చిన్న సన్నివేశంలో మామయ్య వెంకటేష్‌గారితో కలిసి నటించినప్పుడే చాలా ఎగ్జైట్ అయ్యాను. ఇప్పుడు 'వెంకీమామ'లో మామయ్యతో కలిసి చేయడం చాలా సంతోషంగా ఉంది. రాశీతో కలిసి ఇంకా సినిమాలు చేయాలని ఉంది'' అన్నారు నాగచైతన్య. ''వెంకీమామ' సినిమా షూటింగ్ టైమ్‌లో నా మామయ్య సురేంద్ర నాకు గుర్తుకు వచ్చారు. అలా ఈ చిత్రం చూసిన ప్రతి ఒక్కరికీ వాళ్ల జీవితాల్లోని వారి మామయ్యలు గుర్తుకు వస్తారు. బాబీ సినిమాను బాగా తీశాడు. నాకు సినిమా అంటే చాలా భయం. ఈ సినిమా ఫస్ట్ కాపీ చూశాను. నాకంటూ ఓ అభిప్రాయం ఉన్నప్పటికీ ఇతరుల అభిప్రాయల కోసం కంగారుగా ఎదురుచూస్తుంటాను. ఈ సినిమాను తొలిసారి తమన్ చూశాడు. చాలా ఎమోషనల్‌గా ఉందన్నాడు. వెంకటేశ్, నాగచైతన్యలు కూడా చూసి బాగుందన్నారు. మా డిస్ట్రిబ్యూటర్స్ కూడా సినిమా నచ్చిందన్నారు. చివర్లో వచ్చి సినిమాలో చాలా కీలకమైన పాత్ర చేసిన ప్రకాశ్‌రాజ్‌గారికి థ్యాంక్స్'' అన్నారు డి. సురేష్‌బాబు. ''సురేష్‌బాబుగారికి కథ చెప్పబోతున్నాను అన్నప్పుడు కొందరు భయపెట్టారు. ఆయన బుక్ లాంటి వారు అన్నారు. నేను కథ చెప్పిన తర్వాత 'సూపర్బ్ సూపర్బ్' అన్నారు. ఈ సినిమా చూసే ప్పుడు ప్రతి ఇంట్లో ఉన్న మేనమామకి తన అల్లుడు, అల్లుడికి తన మామ గుర్తుకు వస్తారు. వెంకటేష్‌గారికి కథ చెప్పినప్పు డు.. చైతూ పాత్రను ఇంకొంచెం బాగా చేయమన్నారు. అప్పుడు నాకు మరింత తెలిసింది.. నిజమైన మామాఅల్లుళ్ల బంధం గురించి. ఇద్దరూ బాగా నటించారు'' అన్నారు బాబీ. ''భావోద్వేగ సన్నివేశాల్లో వెంకటేష్‌గారు మాస్టర్. ఇక ఈ సినిమాలో నాగచైతన్య కూడా ఎమోషనల్ సీన్స్‌లో బాగా నటించారు'' అన్నారు వివేక్ కూచిభొట్ల. ''ఎమోషన్స్‌తో కూడిన ఎంటర్‌టైనింగ్ చిత్రం ఇది'' అన్నారు టీజీ విశ్వ ప్రసాద్. ''వెంకటేష్‌గారితో నాకు కొన్ని కాంబినేషన్ సీన్స్ ఉన్నాయి. ఆయనతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. చైతూ మంచి కో–స్టార్'' అన్నారు రాశీఖన్నా.

# మీనా..విలనా



● మీనా

రజనీకాంత్, మీనా అనగానే ఠక్కున గుర్తొచ్చే జ్ఞాపకం 'థిల్లానా థిల్లానా.. నా కసి కళ్ల కూనా' పాటే. ముత్తు సినిమాలోని ఈ పాట అంత పాపులర్. 'వీరా, యజ మాన్, ముత్తు' సినిమాల్లో రజనీకాంత్ సరసన కథా నాయికగా నటించారు మీనా. ఇప్పుడు మరోసారి కలసి నటించబోతున్నారని తెలిసింది. అయితే ఈసారి జంటగా కాదని సమాచారం. శివ దర్శక త్వంలో రజనీకాంత్ ఓ ఫ్యామిలీ డ్రామా చిత్రం చేయ నున్న విషయం తెలిసిందే. సన్ పిక్చర్స్ ఈ సినిమా నిర్మించనుంది. ఇందులో మీనా కీలక పాత్రలో కని పిస్తారని తెలిసింది. విలన్ పాత్రలో అని కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. రజనీకాంత్ సరసన ఖుష్బూ, ఆయన కుమార్తెగా కీర్తీ సురేశ్ నటిస్తారన్నది మరో వార్త. ఈ నెల రెండోవారంలో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. ఇదిలా ఉంటే 'ఎంగేయో కేట్ట కురళ్' సినిమాలో రజనీ కుమార్తెగా నటించారు మీనా. అలాగే రజనీ హీరోగా నటించిన 'అన్బుళ్ల రజనీకాం త్'లో బాలనటిగా నటించారు మీనా. అలా బాలనటిగా ఒక హీరో సినిమాలో నటించి, ఆ తర్వాత అతని సరసనే హీరో యిన్‌గా నటించడం అంటే విశే షమే. ఇప్పుడు అదే హీరోకి విలన్‌గా అంటే ఇంకా విశేషం.

# రొమాంటిక్‌కి గెస్ట్



● రామ్

రామ్ ఇప్పటివరకు అతిథి పాత్రల్లో కనిపించ లేదు. వచ్చే ఏడాది 'రొమాంటిక్' సినిమాలో గెస్ట్ రోల్‌లో కనిపించనున్నారు. పూరి జగ న్నాథ్ తనయుడు ఆకాశ్ పూరి హీరోగా తెరకెక్కుతున్న చిత్రం ఇది. పూరి జగన్నాథ్ అందించిన కథతో నూతన దర్శకుడు అనిల్ పాదూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను పూరి, చార్మి నిర్మిస్తున్నారు. రొమాంటిక్ లవ్ స్టోరీగా ఈ సినిమా తెరకెక్కు తోంది. కేతికా శర్మ కథానాయిక. ఇందులో మందిరా బేదీ, దివ్య దర్శినీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రమ్యకృష్ణ అతిథి పాత్రలో నటిస్తున్నారు. ఇప్పుడు రామ్ గెస్ట్‌గా నటించారనే వార్త బయటికొచ్చింది. సిని మాలో ఓ సర్‌ప్రైజ్‌గా రామ్ పాత్ర ఉంటుందని సమాచారం. ఈ పాత్రకు సంబంధించిన షూటింగ్ కూడా పూర్తి చేశారట రామ్. వచ్చే ఏడాది రిలీజ్ కానున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం గోవాలో జరుగుతోంది.

# త్వరలో బ్యూటిఫుల్

నైనా, సూరి జంటగా నటించిన చిత్రం 'బ్యూటిఫుల్'. ట్రిబ్యూట్ టూ రంగీలా అనేది చిత్రానికి ఉపశీర్షిక. అగస్త్య మంజు ఈ చిత్రానికి రచన, ఫొటోగ్రఫీతో పాటు దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని టైగర్ కంపెనీ ప్రొడక్షన్స్ పతాకంపై రామ్ గోపాల్ వర్మ రూపొందించగా టి.అం జయ్య సమర్పించారు. టి.నరేశ్ కుమార్, టి.శ్రీధర్ నిర్మాతలు. రొమాంటిక్ ప్రేమక థగా తెరకెక్కిన ఈ చిత్రం సెన్సార్ కార్య క్రమాలు పూర్తయ్యాయి. ఎటువంటి కట్స్ లేకుండా సెన్సార్ వారు 'ఎ' సర్టిఫికెట్



● నైనా

ఇచ్చారు. త్వరలో సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం. వైవిధ్యమైన ప్రేమకథా చిత్రమిది. హీరో హీరోయిన్లు బాగా నటించారు'' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి పాటలు: సిరాశ్రీ.

# ఇదే ప్రశ్న చిరంజీవిని అడగగలరా అన్నారు

- అల్లు అరవింద్



● అల్లు అరవింద్, మమ్ముట్టి

''పవన్ కల్యాణ్‌తో తీయబోయే సిని మాలో విలన్ పాత్ర చేయగలరా? అని పదేళ్ల క్రితం మమ్ముట్టిని అడిగితే, ఇదే ప్రశ్న చిరంజీవిని అడగగలరా అన్నాడు. మమ్ముట్టి వ్యక్తిత్వానికి అది నిదర్శనం'' అన్నారు అల్లు అరవింద్. మమ్ముట్టి లీడ్ రోల్‌లో పద్మకుమార్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మామాంగం'. ఈ సినిమా తెలుగు, మలయాళ, తమిళ్, హిందీ భాషల్లో ఈ నెల 12న విడుదలవుతోంది. తెలుగులో విడుదల చేస్తున్న అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''కేరళలోని చావెరుక్కల్ యుద్ధ వీరులకు గొప్ప చరిత్ర ఉంది. కలరీ యుద్ధ విద్యలో ఆరితేరిన వారి కథతో మమ్ముట్టి ఈ సినిమా చేయడం అభినందనీయం'' అన్నారు. ''మామాంగం' కేరళకు సంబంధించిన కథే కాదు. ప్రతి భారతీ యుడు దీని గురించి తెలుసుకోవాలి. ప్రతి 12 ఏళ్లకు జరిగే మామాంగం అనే ఉత్సవం నేపథ్యంలో ఉత్కంఠభరి తంగా ఉంటుంది'' అన్నారు మమ్ముట్టి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మహి.వి రాఘవ్ పాల్గొన్నారు.

# కథే హీరో అని నమ్ముతా



● ఉదయ్ శంకర్

''కథే హీరో అని నమ్మే వ్యక్తిని నేను. స్టోరీ బాగుంటేనే హీరోకి, సినిమాకు పేరు వస్తుంది. అందుకే నేను స్టోరీనే హీరోగా భావిస్తాను. ముందు కథ. తర్వాతే హీరో'' అన్నారు ఉదయ్ శంకర్. నిర్మల్‌కుమార్ దర్శకత్వంలో ఉదయ్ శంకర్, ఐశ్వర్యా రాజేష్ జంటగా జి. శ్రీరామ్‌రాజు, భరత్‌రామ్ నిర్మించిన 'మిస్ మ్యాచ్' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ – ''ఇంటర్ చదువుతు న్నప్పటి నుంచే సినిమాలంటే ఆసక్తి. కానీ, చదువు పూర్తి చేసి, బెంగళూరులో డెంటిస్ట్‌గా చేస్తున్నప్పుడు 'సినిమాల్లోకి వెళ్లడానికి ఇదే కరెక్ట్ టైమ్' అనుకుని, వచ్చాను. ఈ హీరో కొత్తగా ప్రయత్నిం చాడు అనుకోవాలనే మొదటి సినిమాగా 'ఆటగదరా శివ' చేశాను. నా రెండో మూవీకి కథలు అనుకుంటున్న సమయంలో భూపతిరాజాగారు 'మిస్ మ్యాచ్' స్టోరీ లైన్ చెప్పారు. హీరో హీరోయిన్ల క్యారెక్టర్లే సినిమాలో 'మిస్ మ్యాచ్'. హీరో ఓ ఐటీ ఉద్యోగి. హీరో యిన్ రెజ్లర్. వీరిద్దరూ ప్రేమలో పడితే ఆ పరిస్థితులు ఎలా ఉంటాయి? కుటుంబ సమస్యలను ఎలా పరిష్కరించారు? అన్నదే కథ '' అన్నారు.

# భావోద్వేగాల క్షీరసాగరమథనం



● ప్రదీప్ రుద్ర

'ఝులక్, గ్రీన్ సిగ్నల్, ప్రేమికుడు, సోడా గోలిసోడా' చిత్రాల ఫేమ్ మానస్ నాగుల పల్లి, నటుడు బ్రహ్మాజీ తనయుడు సంజయ్ కుమార్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం 'క్షీరసాగర మథనం'. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అనిల్ పంగులూరి ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయవుతున్నారు. శ్రీ వెంకటేశ పిక్చర్స్‌తో కలిసి ఆర్ట్ అండ్ హార్ట్ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. అక్షిత సొనవనే హీరోయిన్‌గా, ప్రదీప్ రుద్ర ప్రతినాయకుడుగా నటించారు. హీరో సందీప్ కిషన్ ఇటీవల టైటిల్‌ని విడుదల చేయగా, తాజాగా హీరో అడివి శేష్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''పలు రకాల భావోద్వే గాలతో మనసుల్ని రంజింపచేసే చిత్రమిది. మంచి సినిమా చూశామనే సంతృప్తిని ప్రేక్షకులకు మిగిల్చేలా ఉంటుందనే నమ్మకం మాకుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ అరసడ, కెమెరా: సంతోష్ షనమోని, సహనిర్మాత: మురళీకృష్ణ దబ్బుగుడి.













epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం
5-12-2019



మనిషి అన్ని దశల్లోనూ యౌవనం అత్యంత కీలకం. అందరూ కోరుకునే దశ అది. ఎప్పటికీ నిలుపుకోవాలనే స్థితి అది. యౌవనాన్ని సూచించే తక్షణ అంశాలు ప్రధానంగా రెండు. మొదటిది తెల్లబడే జుట్టు. రెండోది వదులై పోతూ ముడుతలు పడే చర్మం. అందునా ఇలాంటి చలికాలంలో చర్మం ముడుతలు రావడం... అవి మరింత ప్రస్ఫుటంగా కనిపించడం ఎక్కువ. జుట్టుకు రంగేస్తే అది నల్లబడుతుంది. కానీ చర్మానికి పడే ముడతలను అరికట్టడం ఎలా? చర్మం బిగుతుగా, నిగారింపుతో దీర్ఘకాలం ఉండేలా చేయగలిగితే... మన దేహం మీద యౌవనాన్ని చాలాకాలంపాటు నిలుపుకోవచ్చు. చర్మంపై ముడుతలు నివారించుకొని, చాలాకాలం పాటు యౌవనంగా ఉండటానికి ఏం చేయాలో తెలుసుకుందాం.

# ఎప్పుడూ యంగ్ గా

**కా**లం గడుస్తున్నకొద్దీ చర్మం మీద పడే ప్రభావాలకు గల కారణాలు రెండు రకాలుగా ఉంటాయి. అవి... దేహం లోపల అంతర్గతంగా వచ్చే మార్పులకు గల కారణాలు(ఇంట్రిన్సిక్). రెండోది బాహ్య కారణాలు(ఎక్స్‌ట్రిన్సిక్).

**అంతర్గత కారణాలు (ఇంట్రిన్సిక్):** కాలం గడుస్తున్న కొద్దీ చర్మంలో వచ్చే మార్పులకు ప్రధాన కారణం జన్యువుల్లో ఉంటుంది. కొందరు... తమ ముఫ్ఫై, నలభైల్లో ఉన్నా వాళ్ల వయసు చాలా తక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంటారు. తమలోని అంతర్గత కారణాలతో జరిగే వయసు మార్పులను 'స్వాభావిక వయసు మార్పులు' (నేచురల్ ఏజింగ్) అంటారు. ఈ మార్పు 20లలోనే మొదలవుతుంది. మన చర్మం బిగుతుగా ఉండటానికి అందులో ఉండే కొలాజెన్ అనే పదార్థమే కారణం. చర్మ కణాలను ఈ కొలాజెన్ గట్టిగా పట్టి ఉంచి, బిగుతుగా కనిపించేలా చేస్తుంది. వయసు పెరుగుతున్న కొద్దీ మనలో కొలాజెన్ ఉత్పత్తి తగ్గుతూ ఉంటుంది. దాంతో చర్మంలో ఉండే ఎలాస్టిసిటీ తగ్గి చర్మం వదులైపోతూ ఉంటుంది. అలాగే వయసు పెరుగుతున్న కొద్దీ మృతకణాలు కూడా పెరుగుతుంటాయి.

**వయసు పెరగడం వల్ల చర్మంలో వచ్చే స్వాభావిక మార్పులివి...**

- తొలుత చాలా సూక్ష్మమైన ముడుతలు స్కార్స్ మాత్రమే వస్తుంటాయి. (సాధారణంగా నుదుటి మీద ప్రస్ఫుటంగా కనిపిస్తాయి).
- చర్మం క్రమంగా పారదర్శకమవుతూ ఉంటుంది. (పెద్ద వయసు వారికి చర్మం బాగా పారదర్శకమైపోయి లోపలి రక్తనాళాలు స్పష్టంగా కనిపించడం గమనించవచ్చు).
- దేహంలోని ఇతర ప్రదేశాల్లో ఉండే చర్మం కంటే... అరచేతుల వెనక భాగంలోనూ, మెడ దగ్గర చర్మం తొలుత వదులవుతూ ఉంటుంది. అందుకే మెడ దగ్గర గీతల వద్ద చర్మం వదులవుతూ కనిపిస్తుంటుంది.
- చర్మం కింద ఉండే కొవ్వు క్రమంగా తగ్గిపోతుండటంతో చెంపల భాగంలో క్రమంగా గుంట పడుతుంటుంది. ఇక కంటి చుట్టుపక్కల ఉన్న చర్మం కింది కొవ్వు కూడా తగ్గుతూంటుంది.
- మెడ దగ్గర, కంటి కింద ఉన్న చర్మం వదులు కావడం వల్ల భూమ్యాకర్షణ శక్తి కారణంగా అక్కడి చర్మం వేలాడుతున్నట్లు కనిపించడం క్రమంగా మొదలవుతుంది.
- కాలక్రమంలో ఎముక కాస్తంత కురచగా మారడంతో ఎముక చుట్టూ ఉండే చర్మం వదులవుతుంది. అందుకే వయసు పెరిగినవారిలో చేతుల చుట్టూ ఉండే చర్మం వేలాడుతున్నట్లుగా కనిపిస్తుంటుంది.
- గ్రంథుల సంఖ్య తగ్గడం వల్ల పొడిగా ఉండే చర్మం వారికి దురద ఎక్కువగా ఉంటుంది.
- స్వేదగ్రంథుల సంఖ్య తగ్గడంతో చెమట తగ్గి శరీరాన్ని చల్లబరిచే గుణం క్రమంగా తగ్గుతుంది.
- శరీరంపై ఉండే వెంట్రుకలు క్రమంగా తెల్లబడతాయి. హార్మోనల్ మార్పుల వల్ల తలపై (మాడు భాగంలో) వెంట్రుకలు కూడా క్రమంగా పలచబడతాయి. ఈ మార్పు స్త్రీ, పురుషులిద్దరిలోనూ చోటుచేసుకుంటుంది.
- ఈస్ట్రోజన్ హార్మోన్ తగ్గుదల వంటి మార్పుల కారణంగా మహిళల్లో అవాంఛిత రోమాలు ఎక్కువవుతాయి. అందుకే వయసు పెరిగిన మహిళల్లో ముఖం మీద, చుబుకం కింద వెంట్రుకలు పెరిగి కనిపిస్తాయి.
- గోళ్ల చివర అర్ధచంద్రాకారంలో ఉండే తెల్లటి భాగం క్రమంగా మాయమైపోతూ ఉంటుంది.

**సూర్యరశ్మి వల్ల కలిగే ఏజింగ్ ప్రక్రియ నివారణకు...**

- వీలైనంతవరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఎండలోకి వెళ్లకుండా జాగ్రత్త పడాలి.
- సూర్యరశ్మిలోకి వెళ్లినప్పుడు కిరణాలు చర్మాన్ని నేరుగా తాకకుండా, చర్మాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు (లాంగ్ స్లీవ్ అంటే పొడవు చేతుల చొక్కాల వంటివి) ధరించాలి. మహిళలైతే స్కార్ఫ్ కట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.
- రోజూ బయటికి వచ్చే ముందర సన్‌స్క్రీన్ రాసుకోవాలి. ఎస్పీఎఫ్ (సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్) 30 కంటే ఎక్కువ ఉండే సన్‌స్క్రీన్‌ను ఆరుబయటికి రావడానికి 20 నిమిషాల ముందర చర్మంపై రాసుకోవాలి. ఇలా బయటికి వచ్చాక కూడా ప్రతి మూడు గంటలకు ఒకమారు సన్‌స్క్రీన్‌ను రాసుకుంటూండాలి. స్విమ్మింగ్‌కు వెళ్తున్నప్పుడు లేదా చాలా ఎక్కువగా చెమట పడుతున్నప్పుడు.. తడికి తట్టుకోగల (వాటర్ రెసిస్టెంట్) సన్‌స్క్రీన్‌ను వాడాలి.



**బయటి కారణాలు (ఎక్స్‌ట్రిన్సిక్ ఏజింగ్):** వయసు పైబడినట్లుగా కనిపించడానికి అనేక బయటి కారణాలు దోహదం చేస్తాయి. వాటిలో ముఖ్యమైనవి ఇవి...

**సూర్యుడికి ఎక్స్‌పోజ్ కావడం :** సూర్యరశ్మికి ఎక్స్‌పోజ్ కావడం వల్ల వయసు పైబడినట్లుగా మారడాన్ని 'ఫొటో ఏజింగ్' అంటారు. సూర్యుడి కిరణాల్లోని హానికారక రేడియేషన్‌కు ఎక్స్‌పోజ్ కావడం వల్ల చర్మం కమిలినట్లుగా మారడం, ఫ్రెకిల్స్ (చిన్న చుక్కల్లా కనిపించే గోధుమ రంగు మచ్చలు), ఏజ్ స్పాట్స్, చర్మంపై సన్నటి ముడుతలు కనిపిస్తాయి.



**చికిత్స :** సూర్యరశ్మికి గురై నష్టపోయిన చర్మానికి లేజర్ టోనింగ్, మైక్రో డర్మా అబ్రేషన్, డర్మా రోలర్, కెమికల్ పీలింగ్, లేజర్ రీ–సర్ఫేసింగ్ వంటి చికిత్స ప్రక్రియలు అందుబాటులో ఉన్నాయి. ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా, మీసోథెరపీ, ఫైన్ థ్రెడ్ లిఫ్టింగ్ ప్రక్రియల వంటివి అత్యాధునికమైనవి. ఇక ఇలాంటి చికిత్స కోసం చాలా సమయం వెచ్చించలేనివారికి, త్వరితంగా చికిత్స అందించవచ్చు. అందుకు బొటాక్స్, ఫిల్లర్స్ అనే ప్రక్రియలు కూడా ఉన్నాయి. హైఫూ (హై ఇంటెన్సిటీ ఫోకస్ అల్ట్రాసౌండ్) టెక్నాలజీతో కూడా ఫేస్ లిఫ్ట్ చికిత్స చేయవచ్చు.

**భూమ్యాకర్షణ శక్తి (గ్రావిటీ)కి గురికావడం :** మనం ప్రతి నిత్యం భూమ్యాకర్షణ శక్తికి గురవుతూనే ఉంటాం. ఈ ప్రభావం వల్ల మన చర్మంలో కనిపించే మార్పులను 50 ఏళ్లకు పైబడిన వారిలో తేలిగ్గా, స్పష్టంగా చూడవచ్చు. వారిలో చర్మం భూమ్యాకర్షణ శక్తికి లోబడి కిందికి వేలాడుతున్నట్లు కనిపిస్తుంది.

**నివారణ:** క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పుష్టికరమైన సమతులాహారం తీసుకోవడం వల్ల ముఖంలోని చర్మం ఎలాస్టిసిటీని కోల్పోకుండా ఉంటుంది. ముఖంపై పడే సన్నటి ముడుతలు (రింకిల్స్)ను సరిచేయడానికి బొటాక్స్ చికిత్స, చెంపల వద్ద గుంటలు పడటాన్ని ఫిల్లర్స్ చికిత్సతో సరిచేయడానికి అవకాశం ఉంది. ఇప్పుడు శస్త్రచికిత్స అవసరం లేకుండానే ఫేస్‌లిఫ్ట్ ప్రక్రియను ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీలతో సాధించవచ్చు.

**నిద్రలో ముఖం పొజిషన్ వల్ల కనిపించే ఏజింగ్ :** మనం నిద్రపోతున్నప్పుడు తలగడపై ముఖాన్ని ఎప్పుడూ ఒక పక్కకు ఒరిగి ఉంచి, పడుకుంటుంటాం. ఇందువల్ల ముఖంపై పడే గీతలు పడతాయి. వీటిని 'స్లీప్‌లైన్స్' అంటారు. ఇవి ముఖం వాలి ఉన్న వైపునకు ఎక్కువగా ఉంటాయి. దాంతో ముఖంపై గీతలన్నీ ఒక సౌష్ఠవంతో (సిమెట్రికల్‌గా) ఉండవు. దీనివల్ల కూడా వయసు పైబడినట్లుగా కనిపిస్తుంటుంది.



దీన్ని నివారించడానికి ఎప్పుడూ ఒకే వైపు పడుకోకుండా జాగ్రత్త పడాలి.

**పొగతాగడం వల్ల :** ఈ దురలవాటుతో దేహంలోకి ప్రవేశించే విషపదార్థాల కారణంగా శరీరంలో ఎన్నో జీవరసాయన మార్పులు చోటు చేసుకుంటాయి. ఒక అధ్యయనం ప్రకారం రోజుకు 10 కంటే ఎక్కువ సిగరెట్లు తాగేవారిలో 10 ఏళ్ల తర్వాత ముఖం మీద రావాల్సిన ఏజింగ్ ముడుతలు పదేళ్ల కంటే ముందుగానే వస్తాయని తెలిసింది. పైగా సిగరెట్ల సంఖ్య పెరుగుతున్న కొద్దీ ఈ ముడుతల లోతు పెరుగుతూ పోతుంది.


**నివారణకు సంక్షిప్త సూచనలు :** మనం సమతుల ఆహారం తీసుకోవాలి. మనం తినే ఆహారంలో రంగురంగుల పండ్లు, కూరగాయలు ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. క్యారట్, బీట్‌రూట్, కలర్‌డ్ కాప్సికమ్, నిమ్మజాతి పండ్లు, స్ట్రాబెర్రీస్, బొప్పాయి పండ్లు, జామ, పుచ్చకాయల్లో ఏజింగ్‌ను తగ్గించే గుణం ఉంటుంది.

- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. దీనివల్ల చర్మం దీర్ఘకాలం బిగుతుగా ఉంటుంది.
- రోజుకు రెండుసార్లు ముఖం కడుక్కోవాలి.
- మరీ ఎక్కువ వేడినీటితోగానీ, మరీ చల్లగా ఉండే నీళ్లతో గానీ ముఖం కడుక్కోవడం, స్నానం చేయడాన్ని నివారించాలి. స్నానానికి, ముఖం కడుక్కోడానికి గోరువెచ్చని నీటిని లేదా చల్లటి నీటినే ఉపయోగించాలి.
- ప్రతిరోజూ మాయిశ్చరైజర్‌ను వాడాలి.
- ముఖానికి పూసుకునే ఓవర్ ద కౌంటర్ సౌందర్యసాధనాలను డాక్టర్ సలహాలతో మాత్రమే వాడాలి.



**డాక్టర్ స్వప్నప్రియ,**
డెర్మటాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్,
బంజారాహిల్స్, హైదరాబాద్

# నైట్‌షిఫ్టుల్లో పని చేస్తున్నారా?



**ఈ** రోజుల్లో రాత్రంతా డ్యూటీలు చేయాల్సిన ఉద్యోగాలు పెరిగాయి. దాంతో చాలా మంది ఉద్యోగులు రాత్రిపూట నుంచి వేకువజాము వరకు పని చేయాల్సివస్తోంది. మామూలుగా రోజూ రాత్రి నిద్రపోయే వారి ఆహారపు అలవాట్లతో పోలిస్తే... నైట్ షిఫ్టలలో పనిచేసేవారు తమ ఆహారపు అలవాట్లు మార్చుకోకపోతే వారికి కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయి. గ్యాస్ట్రోఇంటస్టినల్ సమస్యతో పాటు రక్తపోటు, గుండెసమస్యలు, యాంగ్జైటీ, ఒత్తిడి, నిద్రలేమి, డిప్రెషన్ వంటివి వచ్చేందుకు అవకాశాలు ఎక్కువ. ఇలాంటి వాళ్లలో బరువు పెరిగి ఊబకాయం వచ్చే అవకాశాలూ ఎక్కువే. ఎందుకంటే... సాధారణ వ్యక్తులు రాత్రి నిద్రపోవడం వల్ల, ఉదయం వరకు భోజనం తీసుకోరు. రాత్రి డ్యూటీలు చేసేవారికి మెలకువగా ఉన్న సమయంలో ఆకలేయడం వల్ల రాత్రివేళ్లలోనూ యథావిధిగా తింటుంటారు. సాధారణంగా ఆ తినేవన్నీ మామూలు భోజనంలా కాకుండా కొవ్వులు ఎక్కువగా ఉండే ఫాస్ట్‌ఫుడ్స్, జంక్‌ఫుడ్స్ వంటివే ఎక్కువ. అందుకే రాత్రివేళ పనిచేసే అసమతౌల్య ఆహారపు అలవాట్లు చోటుచేసుకోవడంతో పాటు... వారికి సాధారణంగా శారీరక శ్రమ చేయాల్సిన అవసరం కూడా బాగా తగ్గుతుంది. ఊబకాయంతో వచ్చే ఆరోగ్యపరమైన ముప్పులను తప్పించుకునేందుకు అనుసరించాల్సిన ఆహారపు అలవాట్లు...



- రాత్రుళ్లు పెద్ద పెద్ద పరిమాణాల్లో తక్కువ సార్లు కాకుండా... చిన్న చిన్న మోతాదుల్లో ఎక్కువసార్లు ఆహారం తీసుకోవాలి. దాంతో ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. దాంతో పైన చెప్పిన గ్యాస్ట్రో ఇంటస్టినల్ సమస్యలను నివారించవచ్చు.
- ఆహారంలో కార్బోహైడ్రేట్లు, కొవ్వులు ఎక్కువగా లేకుండా జాగ్రత్త తీసుకోవాలి. పీచు పదార్థాలు ఎక్కువగా ఉండాలి.
- ఆఫీసుల్లోని వెండింగ్ మెషిన్, కాఫెటేరియా వద్ద ఉన్న ఆహారపదార్థాలను సాధ్యమైనంత వరకు తీసుకోకండి. ఇంటిదగ్గర నుంచి తెచ్చుకున్న ఆహారాన్నే తీసుకోండి.
- ఒకవేళ కాఫెటేరియా ఫుడ్‌నే తీసుకోవాల్సి వస్తే.. పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాలు అంటే... సలాడ్స్, పళ్లు, మొలకెత్తిన గింజలు, పొట్టుతో ఉన్న పప్పుధాన్యాలు, గింజధాన్యాలు (ఉదాహరణకు... పొట్టుతోనే ఉన్న గోధుమలతో చేసిన రోటీలు, మొక్కజొన్నలతో చేసిన పదార్థాలు, బ్రౌన్‌బ్రెడ్ శాండ్‌విచ్‌లు) వంటివి తీసుకోండి. కొవ్వు ఎక్కువగా ఉండే పదార్థాలు, బాగా ఎక్కువగా వేయించిన వేపుళ్లు (ఫ్రెంచ్ ఫ్రైస్, సమోసాలు, చిప్స్ వంటివి) అవాయిడ్ చేయండి.
- రాత్రివేళల్లో తీపి పదార్థాలు, రిఫైన్డ్ ఫుడ్స్ (క్యాండీలు, చాక్లెట్‌లు, వైట్ బ్రెడ్స్, బన్స్, పాస్ట్రాస్, పిజ్జాలు, కూల్‌డ్రింక్స్) వంటి వాటిని సాధ్యమైనంత వరకు తీసుకోకండి.
- రాత్రివేళల్లో పనిచేసేవారు ఎక్కువగా నీళ్లు తాగుతూ ఉండాలి. పగటితో పోలిస్తే రాత్రి ఒకింత చల్లగా ఉంటుంది కాబట్టి నీళ్లు తాగడం తగ్గుతుంది. దాని వల్ల డీహైడ్రేషన్ ప్రమాదం పొంచి ఉంటుంది. కాబట్టి తరచూ నీళ్లు తాగటం మంచిది.
- రాత్రివేళల్లో పనిచేసేటప్పుడు కాఫీ, టీ లు తాగడం చాలా ఎక్కువవుతుంది. కానీ వాటిని వీలైనంతగా తగ్గించడం మంచిది.
- రాత్రివేళల్లో పనిచేసేవారు చాలావరకు తమ వ్యాయామాలను వదిలేస్తుంటారు. అయితే వర్క్‌షెడ్యూల్‌ను అనుసరించి రోజులో ఏదో ఒక నిర్ణీత సమయంలో ప్రతి రోజూ 45 – 60 నిమిషాల పాటు తప్పనిసరిగా వ్యాయామం చేయడం మంచిది. ఈ వ్యాయామం అన్నది మీరు పనికి వెళ్లే ముందర చేస్తే రాత్రంతా ఎక్కువ ఉత్సాహంగా ఉంటుంది. పైగా రాత్రి సమయంలో పని చేసేటప్పుడు తూగురావడం వంటివి జరగవు. ఇలా వ్యాయామం చేయడం వల్ల బరువు పెరిగే అవకాశం తక్కువ. బరువు నియంత్రణలో ఉంటుంది.
- వ్యాయామం కారణంగా ఆడ్ టైమింగ్ అయిన రాత్రి పనివేళల్లో పనిచేయడం వల్ల కలిగే ఒత్తిడిని నివారించడం సాధ్యమవుతుంది. అధిక రక్తపోటు (హైబీపీ), డిస్‌లిపిడేమియా (రక్తంలో కొలెస్ట్రాల్ పాళ్లు అసాధారణంగా పెరగడం) వంటి వాటిని కూడా నివారించవచ్చు.



**డా. సుధీంద్ర ఊటూరి**
లైఫ్‌స్టైల్ స్పెషలిస్ట్,
కిమ్స్ హాస్పిటల్స్,
సికింద్రాబాద్



# మల్టిపుల్ ప్రయోజనాల మల్టీ గ్రెయిన్ ఆటా

**సా**ధారణంగా ఏదో ఒక ధాన్యపు పిండిని వాడటం మామూలే. కానీ ఇటీవల చాలామంది మల్టి గ్రెయిన్ ఆటాలను వాడుతున్నారు. ఏదో ఒక ధాన్యంతో చేసిన పిండి కాకుండా... చాలా రకాల ధాన్యాలను కలిపి దంచిన పిండినే 'మల్టి గ్రెయిన్ ఆటా' అంటున్నాం. ఓట్స్, గోధుమపిండి, కుసుమలు, పొట్టు తీయని మరికొన్ని తృణధాన్యాలు కలిపి ఈ పిండిని తయారుచేసుకోవచ్చు. ఇందులో కనిష్ఠంగా 3 – 5 మొదలుకొని, గరిష్ఠంగా 12 వరకు ధాన్యాలు కలిపి తయారు చేసుకోవచ్చు.

**ప్రయోజనాలు...**

చాలాసందర్భాల్లో ఒక రకం పిండిలో ఉన్న పోషకాలు మరోరకం పిండిలో లోపించవచ్చు లేదా చాలా తక్కువగా ఉండవచ్చు. రకరకాల ధాన్యాలను తీసుకొని వాటిని కలిపి పిండిగా చేసుకోవడం వల్ల మల్టి గ్రెయిన్ అనే ఒకే పిండిలోనే చాలా రకాల పోషకాలు దొరుకుతాయి. ఈ పిండి వాడటం వల్ల దేహానికి అన్నిరకాల పోషకాలు అంది ఆరోగ్యం సమకూరుతుంది.

**ప్రయోజనాలు పొందాలంటే...**

దేహానికి అన్ని రకాల పోషకాలు అందేలా అన్ని ధాన్యాల సమష్టి ప్రయోజనాలు పొందాలంటే... కనీసం 10 రకాల ధాన్యాలను కలిపి మనమే స్వయంగా పిండిగా పట్టించుకోవడం మేలు.

**ఏయే పిండి ఎంతెంత?**

| | |
|---|---|
| పొట్టు తీయని గోధుమ పిండి... | 2 కిలోలు |
| పొట్టు తీయని సెనగ పప్పు ... | 100 గ్రాములు |
| పొట్టు తీయని మొక్కజొన్న/జొన్నలు | 100 గ్రాములు |
| పొట్టు తీయని సజ్జలు | 50 గ్రాములు |
| పొట్టు తీయని బార్లీ | 50 గ్రాములు |
| పొట్టు తీయని రాగులు | 50 గ్రాములు |
| పొట్టు తీయని సోయాబీన్ | 50 గ్రాములు |
| పొట్టు తీయని ఓట్స్ | 100 గ్రాములు |

**ఎలా తయారు చేసుకోవాలంటే...**

1 పైన పేర్కొన్న ధాన్యాలను విడివిడిగా వేయించుకోవాలి. (ఒక్క గోధుమలను మాత్రం వేయించకూడదు).

2 వేయించిన ధాన్యాలు చల్లబడే వరకు ఆరబెట్టాలి. ఆ తర్వాత గోధుమలతో కలపాలి.

3 అన్నింటినీ కలిపి మర ఆడించి, పిండి పట్టించుకోవాలి.

4 మర ఆడించిన పిండి వేడిగా ఉంటుంది. అది చల్లారేవరకు వేచి చూడాలి.

5 రెండుసార్లు జల్లెడ పట్టుకోవాలి.

6 జల్లెడ పట్టినప్పుడు జల్లెడలో మిగిలిన పదార్థాలను పారేయాలి.



7 జల్లెడ పట్టగా కింద మిగిలిన మెత్తటి పిండిని గాలి చొరని ఎయిర్‌టైట్ డబ్బాలో నిల్వ చేసుకుని అవసరమైనప్పుడు ఉపయోగించుకోవాలి.

**ఈ జాగ్రత్త పాటించండి:**

మార్కెట్‌లో లభ్యమయ్యే మల్టీ గ్రెయిన్ ఆటాలో వాణిజ్య ప్రయోజనాల కోసం చాలా మంది తేలిగ్గా లభ్యమయ్యే గోధుమ పిండినే ప్రధానంగానూ, ఎక్కువగానూ వాడి, మిగతా తృణధాన్యాలను తక్కువ మోతాదులో వాడుతుంటారు. దీని వల్ల మనం దాదాపు సాధారణ గోధుమ పిండిని వాడిన ప్రయోజనానికి మించి పెద్దగా ఉపయోగం పొందలేం. అందుకే మన మల్టి గ్రెయిన్ ఆటాను మనమే తయారుచేసుకునేలా మర పట్టించుకోవడం మంచిది.



**సుజాతా స్టీఫెన్**
చీఫ్ న్యూట్రిషనిస్ట్
యశోద హాస్పిటల్స్,
మలక్‌పేట, హైదరాబాద్

## హోమియో కౌన్సెలింగ్

# సోరియాసిస్ తగ్గి తీరుతుంది



**నా వయసు 42 ఏళ్లు. చర్మంపై ఎర్రటి తెల్లటి పొడలు కనిపిస్తున్నాయి. ఆ పొడల్లో దురదగా కూడా ఉంటోంది. తలలోంచి వెండి పొలుసుల్లా రాలిపోతున్నాయి. డాక్టర్‌కు చూపిస్తే సోరియాసిస్ అని మందులు ఇచ్చారు. కానీ మూడేళ్ల నుంచి వాడుతున్నా ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. నా సమస్య హోమియో వైద్యంతో తగ్గుతుందా?**

**– కె. సువర్ణకుమార్, చీరాల**

అన్ని ఇతర వ్యాధుల్లాగే సోరియాసిస్ కూడా సాధారణ వ్యాధే. కారణాన్ని తెలుసుకుని హోమియో వైద్యం అందిస్తే సోరియాసిస్‌ను సమూలంగా నయం చేయవచ్చు. సోరియాసిస్ అనేది దీర్ఘకాలిక చర్మవ్యాధి. ఈ వ్యాధి తగ్గినట్టే తగ్గి... మళ్లీ మళ్లీ వస్తుంటుంది. ఇతర చర్మవ్యాధులతో పోలిస్తే ఇది భిన్నమైనది. ఇందులో చర్మం మీద దురద, ఎర్రటి పొడలు రావడంతో పాటు, వెండి లాంటి తెల్లటి చేపపొలుసుల్లాంటివి కనిపిస్తాయి. ఈ పొలుసుల ఆధారంగానే సోరియాసిస్‌ను నిర్ధారణ చేస్తారు.

**ఎందుకు వస్తుందంటే :** మన చర్మంలో సహజంగా పాత కణాలు పోయి కొత్త కణాలు వస్తుంటాయి. ఇది సాధారణ కంటికి కనిపించని ప్రక్రియ. ఈ విధంగా పాతకణాలు పోయి కొత్త కణాలు రావడానికి 28 నుంచి 30 రోజులు పడుతుంది. కానీ సోరియాసిస్‌లో ఆటో ఇమ్యూనిటీ కారణంగా చర్మంలోని కొత్త కణాలు త్వరగా రావడం జరుగుతుంది. కొత్త కణాలు 3 నుంచి 6 రోజుల్లోనే వచ్చేసి, పాతకణాలను బయటకు నెట్టేసి చర్మం మీద పొలుసుల మాదిరిగా కనిపించేలా చేస్తాయి.

**లక్షణాలు :** చర్మంపై చిన్నగా లేక పెద్దగా ఎర్రటి పొడలు రావడం, వాటి మీద వెండి లాంటి తెల్లటి పొడలు రావడం జరుగుతుంది. ఈ పొడలు దురదగా ఉండి, గోకిన వెంటనే తెల్లటి పొలుసులు ఊడి బయటకు వస్తాయి. తలలో ఉండే సోరియాసిస్ పలుసులు పెద్దగా ఉండి పెచ్చుల మాదిరిగా కనిపిస్తూ, ఎంతకూ తగ్గకపోవడం జరుగుతుంది.

**హోమియో చికిత్స :** ముందుగా సోరియాసిస్ రావడానికి ముఖ్య కారణాలను తెలుసుకోవడం జరుగుతుంది. రోగి మానసిక ఒత్తిడి, ఆందోళన మొదలైన కారణాలను తెలుసుకుని, దానికి అనుగుణంగా మందులు ఇవ్వడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. దీర్ఘకాల సమస్య కాబట్టి వైద్యుల సూచన మేరకు ఓపికగా మందులు వాడాల్సి ఉంటుంది.



**డా॥ కె. రవికిరణ్,**
మాస్టర్స్ హోమియోపతి, హైదరాబాద్

# పైల్స్‌కు శాశ్వత పరిష్కారం ఉంటుందా?

**నా వయసు 55 ఏళ్లు. నాకు కొంతకాలం నుంచి మలద్వారం వద్ద బుడిపెలా ఏదో బయటకు వస్తోంది. మల విసర్జనలో రక్తం పడుతోంది. సూదితో గుచ్చినట్లుగా నొప్పి వస్తోంది. డాక్టర్‌ను కలిస్తే పైల్స్ అన్నారు. దీనికి హోమియోలో శాశ్వత పరిష్కారం ఉందా?**

**– ఆర్. కేశవరావు, సదాశివపేట**

అమితంగా ఇబ్బంది కలిగించే సమస్యల్లో మొలల సమస్య ఒకటి. ఈ సమస్యలో మలద్వారపు గోడల మార్పుల వల్ల ఆ చివరన ఉండే రక్తనాళాలు (సిరలు) ఉబ్బి అవి మొలలుగా ఏర్పడతాయి. ఇవి మలాశయం లోపల, వెలుపల చిన్న చిన్న బుడిపెల రూపంలో ఏర్పడి ఇబ్బంది పెడతాయి. వీటిలో తీవ్రతను బట్టి రకరకాల గ్రేడ్స్ ఉంటాయి.



**కారణాలు :** ● మలబద్ధకం ● మలవిసర్జన సమయంలో గట్టిగా ముక్కడం వల్ల అక్కడే ఉండే కండర బంధనం సాగిపోతుంది. తద్వారా మొలలు బయటకు పొడుచుకుని వస్తాయి ● సరైన వ్యాయామం, శారీరక శ్రమ లేకపోవడం ● స్థూలకాయం (ఒబేసిటీ) ● చాలాసేపు ఒకే చోట కూర్చొని పనిచేయడం ● మలబద్ధకం మాత్రమే గాక అతిగా విరేచనాలు కావడం ● పోషకాహారం తీసుకోకపోవడం ● నీరు తక్కువగా తాగడం ● ఎక్కువగా ప్రయాణాలు చేయడం ● అధిక వేడి ప్రదేశంలో పనిచేస్తుండటం ● మానసిక ఒత్తిడి.. వంటివి ఎక్కువగా ఉన్నప్పుడు ఇవి వచ్చే అవకాశాలు ఎక్కువ.

**లక్షణాలు :** నొప్పి, రక్తస్రావం, కొన్నిసార్లు దురద, ఏదో గుచ్చుతున్నట్లుగా నొప్పి ● మలవిసర్జన సమయంలో ఇబ్బంది కలగడం.

**నివారణ :** ● మలబద్ధకం లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ● సమయానికి భోజనం చేయడం ● ఆహారంలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం ● నీరు ఎక్కువ మోతాదులో తీసుకోవడం ● మసాలాలు, జంక్‌ఫుడ్, మాంసాహారం తక్కువగా తీసుకోవడం ● మెత్తటి పరుపు మీద కూర్చోవడం వంటివి పైల్స్ నివారణకు తోడ్పడే కొన్ని జాగ్రత్తలు.

హోమియోలో రోగి శారీరక, మానసిక లక్షణాలను బట్టి వ్యాధి నిరోధక శక్తి పెంచేలా మందులు ఇచ్చి వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు.




**డాక్టర్ ఎ.ఎం. రెడ్డి, సీఎండీ,**
పాజిటివ్ హోమియోపతి,
హైదరాబాద్

epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
గురువారం
5-12-2019

# 'కార్పొరేట్ లాయర్'... అదిరిపోయే ఆఫర్స్

బహుళ జాతి కంపెనీలు.. దేశ సరిహద్దులు దాటి కార్పొరేట్ కార్యకలాపాల విస్తరణ.. విభిన్న వ్యాపార లావాదేవీల నిర్వహణ... క్లిష్టమైన చట్టాలు! ఇలాంటి పరిస్థితుల్లో సంస్థలు తమ వ్యాపారాలు న్యాయ వివాదాల్లో చిక్కుకోకుండా చూసేందుకు కార్పొరేట్ లాయర్లను నియమించుకుంటున్నాయి. కార్పొరేట్ లా స్పెషలైజేషన్ పూర్తిచేసి.. నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులకు అవకాశాలు కల్పిస్తున్నాయి. పీజీ స్థాయిలో 'కార్పొరేట్ లా' స్పెషలైజేషన్ పూర్తిచేసిన అభ్యర్థులు.. కార్పొరేట్ సంస్థలకు హాట్‌కేక్‌లుగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో.. కార్పొరేట్ లా స్పెషలైజేషన్.. అందివస్తున్న అవకాశాలు.. కోర్సులు అందిస్తున్న ఇన్‌స్టిట్యూట్‌ల గురించి తెలుసుకుందాం...




## ఉద్యోగ సమాచారం

### ఎల్ఐసీ-35

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కి చెందిన హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్ఎఫ్ఎల్) దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 35 అసిస్టెంట్ మేనేజర్ (లీగల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ (లా-ఎల్ఎల్‌బీ) ఉత్తీర్ణత, కంప్యూటర్ స్కిల్స్ ఉండాలి.
- **వయసు:** 2019, జనవరి 1 నాటికి 23-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్ష తేదీ:** జనవరి 27, 2020.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 16, 2019.
- **వెబ్‌సైట్:** www.lichousing.com

### ఎన్ఐఈపీఎండీ-18

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(దివ్యాంగ్‌జన్)(ఎన్ఐఈపీఎండీ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, రీహాబిలిటేషన్ ఆఫీసర్, స్పెషల్ ఎడ్యుకేటర్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టును బట్టి ఇంటర్మీడియట్, సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, మాస్టర్స్ డిగ్రీ, ఎంబీబీఎస్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 23, 2019.
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

### ట్రిపుల్ఐటీ (లక్నో)లో పీహెచ్‌డీ ప్రవేశాలు

లక్నో (ఉత్తర్‌ప్రదేశ్)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్ఐటీ) 2020కి గాను వివిధ పీహెచ్‌డీ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ, గేట్, సీఎస్ఐఆర్-నెట్, యూజీసీ-నెట్ తదితర ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత.
- **విభాగాలు:** క్రిప్టోగ్రఫీ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ, హార్డ్‌వేర్ సెక్యూరిటీ, బిగ్‌డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్స్, ఇమేజ్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్ తదితర విభాగాలున్నాయి.
- **కోర్సు వ్యవధి:** 3-5 ఏళ్లు.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈ-మెయిల్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 31, 2019.
- **అభ్యర్థుల జాబితా వెల్లడి:** జనవరి 5, 2020.
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** 13 జనవరి, 2020.
- **వెబ్‌సైట్:** http://iiitl.ac.in

గత ఆర్థిక సంవత్సరం జాతీయ స్థాయిలో స్టాక్ మార్కెట్‌లో లిస్టెడ్ కంపెనీలు తమ మొత్తం వ్యయంలో 14శాతం మేర న్యాయపరమైన ఖర్చులకు వెచ్చించాయి. కార్పొరేట్ లాయర్ల సేవలు వినియోగించుకునేందుకు,వారిని శాశ్వత ప్రాతిపదికన తమ సంస్థల్లో నియమించుకునేందుకు భారీగానే వ్యయం చేశాయి. సంస్థల దైనందిన కార్యకలాపాల నిర్వహణలో కార్పొరేట్ లాయర్ల సేవలు కీలకంగా మారుతున్నాయి. దీంతో యువతకు కార్పొరేట్ లా స్పెషలైజేషన్ అవకాశాల వేదికగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు.

- » కార్పొరేట్ లా నిపుణులకు పెరుగుతున్న డిమాండ్
- » ఆకర్షణీయ వేతనాలతో అవకాశాలు
- » కార్పొరేట్ లా కోర్సులు అందిస్తున్న నేషనల్ లా యూనివర్సిటీలు

### ఎందుకింత ప్రాధాన్యం

సంస్థలు గతంలో తమ కార్యకలాపాలు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా చూసేందుకు తాత్కాలిక విధానంలో న్యాయ నిపుణుల సేవలను వినియోగించుకునేవి. కానీ.. ప్రస్తుతం పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. కార్పొరేట్ కంపెనీలు నిరంతరం మారుతున్న చట్టాలకు అనుగుణంగా వ్యవహరించాల్సి వస్తోంది. దాంతో శాశ్వత ప్రాతిపదికన న్యాయ నిపుణులను నియమించుకోవడం మేలని భావిస్తున్నాయి. కార్పొరేట్ లా స్పెషలైజేషన్ పూర్తిచేసిన వారిని నియమించుకుంటే.. ఎలాంటి వివాదాలకు తావులేకుండా కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందుకే పీజీ స్థాయిలో కార్పొరేట్ లా స్పెషలైజేషన్ పూర్తిచేసిన అభ్యర్థులకు కంపెనీలు ఎర్రతివాచీ పరుస్తున్నాయి. రూ.లక్షల వేతనంతో అవకాశాలు అందిస్తున్నాయి.

### లిటిగేషన్స్.. లిక్విడేషన్స్

సంస్థలు కార్పొరేట్ లాయర్లను నియమించుకునేందుకు ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, విదేశీ సంస్థలు మన దేశంలో శాఖలను ఏర్పాటు చేసి.. ఇక్కడి చట్టాలకు అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించాల్సి రావడం. రెండోది, మన దేశంలోని సంస్థలు ఇతర దేశాల్లో సంయుక్త భాగస్వామ్యంతో కార్యకలాపాలు నిర్వహిస్తూ.. సంబంధిత చట్టాలను అవగాహన చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తడం. వీటితోపాటు ఇటీవల కాలంలో లిటిగేషన్స్, లిక్విడేషన్స్ పెరగడం కూడా కార్పొరేట్ లాయర్లకు డిమాండ్ పెరగడానికి మరో ముఖ్య కారణంగా నిలుస్తోంది.

### విధులు

కార్పొరేట్ లాయర్లు.. కంపెనీ ప్రాస్పెక్టస్ రూపకల్పన, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌లో నమోదు మొదలు.. సీబీడీటీ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు, సెబీ తదితర నియంత్రణ సంస్థలను నిత్యం సంప్రదిస్తుండాలి. తాజా నిబంధనలు, చట్టాలకు అనుగుణంగా.. సంస్థ కార్యకలాపాలు సక్రమంగా, ఎలాంటి అడ్డంకులు లేకుండా సాగేలా సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంటోంది. ఇటీవల కాలంలో సైబర్ లా, ఇన్సూరెన్స్ లా, స్టార్టప్ లా, ఐపీఆర్, ట్యాక్సేషన్ లా, లేబర్ లా వంటి అంశాల్లోనూ కార్పొరేట్ లాయర్ల విధులు సమ్మిళితమై ఉంటున్నాయి. దీంతో ఏదైనా వివాదాలు తలెత్తినప్పుడు సంస్థ తరఫున వాదనలు వినిపించేందుకు ప్రభుత్వ నియంత్రణ విభాగాల ముందు కూడా హాజరవ్వాల్సి ఉంటోంది.

### జాబ్ ప్రొఫైల్స్




కార్పొరేట్ లా స్పెషలైజేషన్ పూర్తిచేసిన అభ్యర్థులకు కంపెనీల్లో పలు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. అవి...
» కంప్లయన్స్ ఆఫీసర్ » చీఫ్ లీగల్ ఆఫీసర్ » లీగల్ కౌన్సెల్ » లీగల్ అనలిస్ట్ » లీగల్ సర్వీసెస్ ఆఫీసర్ » లీగల్ మేనేజర్ » లీగల్ ఎగ్జిక్యూటివ్ » లీగల్ సర్వీసెస్ ఆఫీసర్. సంస్థలు ప్రారంభంలో ఫ్రెషర్స్‌ను ఎంట్రీ లెవల్‌లో లీగల్ సర్వీసెస్ ఆఫీసర్‌గా నియమించుకుంటున్నాయి. ఆ తర్వాత అనుభవం, పనితీరు ఆధారంగా లీగల్ డైరెక్టర్ లేదా చీఫ్ లీగల్ ఆఫీసర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

### అంతర్గత వివాదాలు

కార్పొరేట్ లాయర్లు సంస్థల్లో అంతర్గత అంశాల్లోనూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ప్రధానంగా ఆయా కంపెనీల్లో అంతర్గత వివాదాలు, సమస్యలకు న్యాయపరమైన పరిష్కారం చూపాల్సి ఉంటుంది. సంస్థల్లో కార్మికులు, యాజమాన్యానికి మధ్య వివాదాలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించడం.. ఉన్నత స్థాయిలో కార్యకలాపాల నిర్వహణ సాఫీగా సాగేలా చూసేందుకు సలహాలు ఇవ్వడం.. అదే విధంగా లీగల్ కౌన్సిల్‌గా కూడా వ్యవహరించాల్సి వస్తోంది.

### ఎల్‌పీవో... కేపీవో

కార్పొరేట్ లా స్పెషలైజేషన్ పూర్తిచేసిన అభ్యర్థులకు కేవలం కంపెనీల్లోని లీగల్ విభాగాల్లోనే కాకుండా.. ఇతర రంగాల్లోనూ అవకాశాలు లభిస్తున్నాయి. ప్రధానంగా లీగల్ ప్రాసెస్ ఔట్ సోర్సింగ్ (ఎల్‌పీఓ), నాలెడ్జ్ ప్రాసెస్ ఔట్ సోర్సింగ్(కేపీఓ)లో అవకాశాలు పెరుగుతున్నాయి. సంస్థలు, వ్యక్తులు తాము రూపొందించిన కొత్త ఉత్పత్తులకు సంబంధించి పేటెంట్ హక్కులు పొందడం కోసం ఎల్‌పీఓ, కేపీఓలను సంప్రదిస్తుండటమే ఇందుకు కారణంగా చెప్పొచ్చు. ఈ సంస్థలు కూడా కార్పొరేట్ లా స్పెషలైజేషన్ చేసిన వారికి ఆకర్షణీయ వేతనాలు అందిస్తున్నాయి.

### కార్పొరేట్ లా.. ముఖ్యాంశాలు

- పలు అంచనాల ప్రకారం-ప్రస్తుతం జాతీయ స్థాయిలో దాదాపు 30 వేలకు పైగా కార్పొరేట్ లా స్పెషలైజ్డ్ అభ్యర్థుల అవసరం ఉంది.
- ఎంట్రీ లెవల్‌లో సగటున నెలకు రూ.40 వేల నుంచి రూ.50వేల వేతనం లభించే అవకాశం.
- గత ఆర్థిక సంవత్సరం(2018-19) జాతీయ స్థాయిలోని సంస్థలు తమ ఖర్చుల్లో 14 శాతం న్యాయపరమైన అంశాలకే వెచ్చించినట్లు వెల్లడి.
- సంస్థల్లోనే అంతర్గతంగా కార్పొరేట్ లా డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేస్తున్న వైనం.
- నేషనల్ లా యూనివర్సిటీల్లో కార్పొరేట్ లా స్పెషలైజేషన్‌తో ఎంఏ-ఎల్ఎల్‌బీ కోర్సుల్లో చేరొచ్చు.

### క్యాంపస్ డ్రైవ్స్

కార్పొరేట్ లా అభ్యర్థుల కోసం సంస్థలు లా యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీలు ప్రధానంగా దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ లా యూనివర్సిటీల్లో క్యాంపస్ డ్రైవ్స్‌లో పాల్గొంటున్నాయి. పీజీ స్థాయిలో కార్పొరేట్ లా విద్యార్థులకు రూ.4 లక్షల నుంచి రూ.పది లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తోంది.

### ఈ నైపుణ్యాలు తప్పనిసరి

కార్పొరేట్ లాయర్‌గా కెరీర్ కోరుకునే అభ్యర్థులు ముందుగా కార్పొరేట్ లా స్పెషలైజేషన్ పూర్తి చేయాలి. అంతేకాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్; రీసెర్చ్ స్కిల్స్; నెగోషియేషన్ స్కిల్స్, అనలిటికల్ థింకింగ్, బిజినెస్ అవేర్‌నెస్ వంటి అంశాలపైనా అవగాహన పొందాలి. నిత్యం మారుతున్న చట్టాలను క్షుణ్నంగా అధ్యయనం చేసే అలవాటు ఉండాలి. అప్పుడే కెరీర్‌లో సుస్థిరంగా ముందుకు సాగేందుకు ఆస్కారం ఉంటుంది.

### కోర్సులు

కార్పొరేట్ లా స్పెషలైజేషన్ చదివేందుకు ప్రస్తుతం పలు మార్గాలు అందుబాటులోకి వస్తున్నాయి. ముఖ్యంగా నేషనల్ లా యూనివర్సిటీలు పీజీ స్థాయిలో ఎల్ఎల్ఎం కోర్సులో కార్పొరేట్ లా స్పెషలైజేషన్‌ను అందిస్తున్నాయి. బీఏ-ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు.నేషనల్ లా యూనివర్సిటీల్లో చేరాలంటే.. క్లాట్-పీజీ పేరుతో నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అదే విధంగా రాష్ట్రాల స్థాయిలోని యూనివర్సిటీల్లో కార్పొరేట్ లాలో చేరాలంటే... పీజీ-లాసెట్ వంటి పరీక్షల్లో ఉత్తీర్ణత తప్పనిసరి.

### కోర్సును అందిస్తున్న విద్యా సంస్థలు

- » నేషనల్ లా యూనివర్సిటీలు
- » యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ » ఎన్ఎల్‌యూ-ఢిల్లీ
- » జిందాల్ గ్లోబల్ లా స్కూల్
- » సింబయాసిస్ లా స్కూల్
- » అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ
- » ఐఐటీ-ఖరగ్‌పూర్ » ఉస్మానియా యూనివర్సిటీ
- » యూపీఈఎస్ కాలేజ్ ఆఫ్ లీగల్ స్టడీస్
- » యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ

### డిమాండ్ పెరుగుతోంది

కార్పొరేట్ లాయర్లకు డిమాండ్ పెరగడానికి ప్రస్తుతం అనేక అంశాలు దోహదం చేస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో కంపెనీల్లో విలీన ఒప్పందాలు, సంయుక్తంగా కార్యకలాపాల నిర్వహణ, టేకోవర్, లిక్విడేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలు పెరుగుతున్నాయి. కార్పొరేట్ చట్టాలు, ట్యాక్స్ చట్టాలపై పట్టు ఉంటే... కార్పొరేట్ లాయర్‌గా రాణించొచ్చు.

-ప్రొఫెసర్ రాజేశ్ కపూర్,
నల్సార్, హైదరాబాద్

# నేటి మేటి.. ఐవోటీ!!

**ఇది డిజిటల్ యుగం.** టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతోంది. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం మన దైనందిన జీవితాలను మరింత సౌకర్యవంతం చేస్తోంది. ఇప్పుడు కూర్చున్నచోటు నుంచి కదలకుండానే.. అన్నీ చక్కబెట్టొచ్చు. ఇంట్లో కూర్చొనే.. ఆఫీసులో ఏం జరుగుతుందో చూడొచ్చు. కాలు కదపకుండానే.. పొలంలోని మోటర్‌ను ఆన్/ఆఫ్ చేయొచ్చు. రిమోట్ లేకుండానే ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఆపరేట్ చేయొచ్చు. నేడు ఇలాంటి వింతలెన్నో సుసాధ్యం చేస్తోంది.. ఓ విప్లవాత్మక టెక్నాలజీ. అదే.. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ)!! స్మార్ట్ డివైసెస్, స్మార్ట్ హోమ్స్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ వేగంగా విస్తరిస్తుండటంతో.. ఐవోటీ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. అసలు ఐవోటీ అంటే ఏమిటి.. ఐవోటీ రంగంలో ఎలాంటి ఉద్యోగాలు లభిస్తాయి.. అవసరమైన కోర్సులు, స్కిల్స్ గురించి తెలుసుకుందాం..




2008లో ప్రపంచవ్యాప్తంగా 7 బిలియన్‌ల డివైస్‌లు ఇంటర్నెట్‌తో అనుసంధానం కాగా.. 2020 నాటి కల్లా ఈ సంఖ్య 50 బిలియన్‌లకు చేరుకుంటుందని తాజా అంచనా. వైఫై, 2జీ, 3జీ, ఎల్‌టీఈ తదితర నెట్‌వర్క్ టెక్నాలజీలతో ఉపకరణాలు ఇంటర్నెట్ ద్వారా సమాచారాన్ని పంచుకుంటున్నాయి. దీనివల్ల వ్యక్తులకు, సంస్థలకు అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. అందుకే సంస్థలు ఐవోటీపై బాగా దృష్టిపెట్టాయి. భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. మరోవైపు ప్రభుత్వాలు కూడా 'స్మార్ట్' బాట పడుతున్నాయి. స్మార్ట్ నగరాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించాయి. అందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నాయి. వైఫై సేవలు, కెమెరాల అనుసంధానం, స్మార్ట్ స్ట్రీట్ లైట్లు, వాస్తవిక ట్రాఫిక్‌ను తెలుసుకునేందుకు కనెక్టెడ్ మీటర్లు, నేర, పర్యావరణ సంబంధిత అంశాల్లో ఐవోటీ విరివిగా వినియోగంలోకి వస్తోంది.

### డేటా బదిలీ

హెల్త్‌కేర్, ఫైనాన్స్, రిటైల్, మ్యానుఫ్యాక్చరింగ్ మొదలైన అన్ని రంగాల్లో ఐవోటీ ప్రవేశిస్తోంది. పోటీ ప్రపంచంలో ముందు నిలిచేందుకు సంస్థలు ఐవోటీ సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాయి. ఉదాహరణకు సెన్సార్లు,యాంటినాలు, మైక్రో కంట్రోలర్లు మొదలైన వాటి నుంచి డేటాను సేకరించి.. ఐవోటీ హబ్ లేదా గేట్‌వే ద్వారా స్మార్ట్ మొబైల్, హ్యూమన్ మెషిన్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, ఈఆర్‌పీలకు డేటా బదిలీ అవుతుంది. సదరు డేటాను విశ్లేషించి వ్యాపార కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించేందుకు సంస్థలు తగిన చర్యలు తీసుకుంటాయి.

- » ఆటోమేషన్ యుగంలో విప్లవాత్మక టెక్నాలజీ ఐవోటీ
- » 2020 నాటికల్లా ఐవోటీతో 50 బిలియన్ల ఉపకరణాలు అనుసంధానం కానున్నట్లు అంచనా
- » ఐవోటీ నిపుణులకు ప్రారంభంలోనే రూ.4లక్షలకు పైగా వార్షిక వేతనం

### ఐవోటీతో ప్రయోజనాలు

- బిజినెస్ ప్రక్రియ మొత్తాన్ని కూర్చున్న చోటు నుంచే పర్యవేక్షించవచ్చు.
- వినియోగదారులకు సరికొత్త అనుభూతిని పంచే విధంగా చర్యలు చేపట్టవచ్చు.
- డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవచ్చు.
- ఉద్యోగుల పని ఉత్పాదకతను పెంపొందించవచ్చు.
- వ్యాపారవృద్ధి కోసం కచ్చితమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఐవోటీ దోహదపడుతుంది.
- ఆదాయాన్ని పెంచుకోవచ్చు.

### ఆకర్షణీయ వేతనాలు

ఐవోటీ టెక్నాలజీపై పనిచేస్తున్న ఉద్యోగులకు ఆకర్షణీయ వేతనాలు లభిస్తున్నాయి. సంస్థను బట్టి ఫ్రెషర్స్‌కు రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వార్షిక వేతనం అందుతోంది. అనుభవంతోపాటు మంచి నైపుణ్యాలున్న ఐవోటీ నిపుణులు రూ.15లక్షల వరకూ ఆర్జిస్తున్నారు. మన దేశంలో ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో ఎక్కువగా వేతనాలు లభిస్తున్నాయి. ఆ తర్వాత ముంబయి, బెంగుళూరులో వేతనాలు ఎక్కువగా లభిస్తున్నాయి.

- అప్లికేషన్ ప్రోగ్రామింగ్ విభాగానికి అధిక డిమాండ్ కనిపిస్తోంది. ఈ విభాగంలో పనిచేస్తున్న వారికి సగటున రూ.11 లక్షల ప్యాకేజీ అందుతుంది.
- ఇంజనీరింగ్ డిజైన్‌లో నెట్‌వర్కింగ్ నుంచి క్లౌడ్ డిజైనింగ్ వరకు పనిచేయాల్సి ఉంటుంది. వీరికి రూ.10.5 లక్షల సగటు వేతనం లభిస్తోంది.
- సిస్టమ్ ప్రోగ్రామింగ్‌లో నెట్‌వర్కింగ్, వెబ్ సెక్యూరిటీ, డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్స్, కోడింగ్, స్టాటిక్ అనాలసిస్ మొదలైన నైపుణ్యాలు ఉన్నవారికి గరిష్ఠంగా రూ.8 లక్షల ప్యాకేజీ లభిస్తుంది.
- ఎంబెడెడ్ టెక్నాలజీస్‌తో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌ను ఇంటిగ్రేట్ చేసి హోం డివైసెస్, సర్క్యూట్ డిజైన్, జీపీఎస్ డిజైన్ వంటి ఐవోటీ డివైస్‌ల రూపకల్పన చేయవచ్చు. వీరికి ఏడాదికి సగటున రూ.6.2 లక్షల వేతనం దక్కుతోంది.
- సిస్కో, అమెజాన్, విప్రో, ఎల్ అండ్ టీ, సాప్, బోష్, క్వాల్‌కాం, ఐబీఎం, జీఈ, అసెంచర్ కంపెనీలు ఐవోటీ నిపుణులను ఎక్కువ సంఖ్యలో నియమి ంచుకుంటున్నాయి.

### ఈ స్కిల్స్ ఉండాలి

ఐవోటీ రంగంలో ఉద్యోగావకాశాలు సొంతం చేసుకునేందుకు మెషిన్ లెర్నింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, నెట్‌వర్కింగ్, ప్రోగ్రామింగ్, అనలిటిక్స్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, యూఐ, యూఎక్స్ డిజైన్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎడ్జ్ కంప్యూటింగ్‌తోపాటు సాఫ్ట్‌స్కిల్స్ ఉండాలి. టెక్నాలజీ పరంగా మెషిన్ లెర్నింగ్‌కు సమీప భవిష్యత్తులో అత్యంత ప్రాధాన్యత లభించే అవకాశం కనిపిస్తోంది. ఎలక్ట్రానిక్ డివైస్‌ల డిజైనింగ్ కోసం ఆటోక్యాడ్ టెక్నాలజీ అవసరం ఎక్కువగా ఉంటుంది. ఉపకరణాల నిర్వహణకు సర్వర్ సైడ్ వెబ్ డవలప్‌మెంట్‌కు నోడ్ జేఎస్ లాంటి ఓపెన్ సోర్స్‌ను ఉపయోగిస్తారు. డేటా భద్రత కోసం సెక్యూరిటీ ఇంజనీరింగ్, సెక్యూరిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగాల్లో నిపుణుల అవసరం ఉంటుంది. బిగ్‌డేటా, జీపీఎస్ డెవలప్‌మెంట్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సర్క్యూట్ డిజైన్, మైక్రో కంట్రోలర్ ప్రోగ్రామర్ స్కిల్స్ ఉన్నవారికి ఐవోటీ ఉద్యోగాల వేదికగా మారుతుందని భావిస్తున్నారు.

### ఆన్‌లైన్ కోర్సులు

ఐవోటీకి సంబంధించిన సరికొత్త టెక్నాలజీపై కాలేజీల్లో ప్రస్తుతం ప్రత్యేక కోర్సులు అందుబాటులో లేవు. కానీ ఐవోటీ సాంకేతికతో సంబంధం ఉండే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోడింగ్ నైపుణ్యాలు, నెట్‌వర్కింగ్ పాఠాలు తరగతి గదిలో బోధిస్తున్నారు. ఇటీవల మూక్స్ కోర్సుల్లో(ఆన్‌లైన్‌లో వీడియోల ద్వారా బోధించే పద్ధతిని మూక్స్ అంటారు) చేరే అభ్యర్థుల సంఖ్య పెరుగుతోంది. మూక్స్ ద్వారా ప్రఖ్యాత యూనివర్సిటీల ప్రొఫెసర్లు చెప్పే పాఠాలు వినే అవకాశం లభిస్తోంది. తక్కువ ఖర్చుతో నాణ్యమైన బోధనకు మూక్స్ చక్కటి వేదికగా నిలుస్తోంది. ఐవోటీ సబ్జెక్టులను దాదాపు అన్ని యూనివర్సిటీలు కరిక్యులంలో భాగం చేస్తున్నాయి!!

### ఉద్యోగాలు ఇవే




ఐవోటీ సాంకేతికత కలిగిన ఉపకరణాలను రూపొందించేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ డెవలపర్లకు మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయి. హెల్త్‌కేర్, రిటైల్, ఉత్పత్తి, రవాణా, టెలీ కమ్యూనికేషన్ల రంగాల్లో ఐవోటీ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ప్రోగ్రామర్, యూఐ ఇంజనీర్, టెస్ట్ ఇంజనీర్స్, క్లౌడ్ ఇంజనీర్, నెట్‌వర్క్ ఇంజనీర్, ఎంబెడెడ్ ఇంజనీర్, డిజైనర్, డేటా విజువలైజేషన్ ఎక్స్‌పర్ట్, డేటా ఆర్కిటెక్ట్, డేటా సైంటిస్ట్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్స్, మెటీరియల్ స్పెషలిస్ట్, మొబైల్ యాప్ డెవలపర్స్, డేటా అనలిటిక్స్ స్పెషలిస్ట్ లాంటి జాబ్ ప్రొఫైల్స్ ఐవోటీ నిపుణులకు అందుబాటులో ఉన్నాయి. ఆయా జాబ్ ప్రొఫైల్‌కు సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటే.. ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవచ్చు.




## బాబ్ విల్లీస్ కన్నుమూత

ఇంగ్లండ్ క్రికెట్ దిగ్గజం, మాజీ ఫాస్ట్ బౌలర్ బాబ్ విల్లీస్ (70) బుధవారం కన్నుమూశారు. 90 టెస్టుల్లో 25.20 సగటుతో 325 వికెట్లు తీసిన విల్లీస్ 70వ దశకంలో ప్రపంచ అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకడిగా నిలిచారు. 64 వన్డేల్లో ఆయన 80 వికెట్లు పడగొట్టారు. 1981లో హెడింగ్లీలో జరిగిన యాషెస్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 43 పరుగులకే 8 వికెట్లు తీసిన బాబ్ సంచలన ప్రదర్శన ఆయనకు ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టింది. 18 టెస్టుల్లో ఆయన ఇంగ్లండ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు.





కోహ్లి

# పట్టుకోండి చూద్దాం...

- భారత జట్టు 'ఛేజ్ డ్రిల్'
- నెట్స్‌లో శ్రమించిన వెస్టిండీస్
- రేపు హైదరాబాద్‌లో తొలి టి20 మ్యాచ్

**సాక్షి, హైదరాబాద్:** భారత ఆటగాళ్లలో ఒక బృందం వరుసగా నిలబడింది... వాళ్లంతా తమ షార్ట్స్‌లో ఒక ఎరుపు రంగు కర్చీఫ్ పెట్టుకున్నారు... వారందరి వెనక మరో ఆటగాడు పసుపు రంగు కర్చీఫ్‌తో నిలబడి ఉన్నాడు. ట్రైనర్ విజిల్ వేయడమే తరువాయి...అంతా పరుగు మొదలు పెట్టేశారు. తమ ముందు నిలబడ్డ ఆటగాడిని అందుకోవడమే వెనక ఉన్నవారి పని అయితే అందకుండా ఎంత వేగంగా పరుగెత్తగలరో ముందున్న ఆటగాళ్ల సవాల్! ఇలా ఒకరి తర్వాత మరొకరు వంతులుగా ఈ ఛేదనలో పాల్గొన్నారు. ఒక సారి ముందు వరుసలో నిలబడిన ఆటగాళ్లు మరోసారి వెనకకు వెళ్లిపోయి తమ పరుగు సత్తాను పరీక్షించుకున్నారు. బుధవారం ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో కనిపించిన దృశ్యమిది. దీనికి టీమిండియా పెట్టుకున్న పేరు 'ఛేజ్ డ్రిల్'. గతంలో పలు సందర్భాల్లో విభిన్న తరహా విధానాలతో సాధన చేసిన కోహ్లి బృందంలో ఇప్పుడు ఈ పద్ధతి కొత్తగా వచ్చి చేరింది. భారత జట్టు స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ నిక్ వెబ్ ఆలోచన ఇది. దీని వల్ల ఆటగాళ్ల పరుగు వేగాన్ని పెంచవచ్చని అతను చెబుతున్నాడు. సహచరుల మధ్య పోటీ తత్వం పెంచడంతో పాటు ఒత్తిడిని తట్టుకునేందుకు కూడా ఇది ఒక సాధనంగా పనికొస్తుందని నిక్ అన్నాడు. రెగ్యులర్‌గా ఆడే ఫుట్‌బాల్‌తో పాటు 'ఛేజ్ డ్రిల్' తర్వాత మన ఆటగాళ్లు నెట్ ప్రాక్టీస్‌కు వెళ్లారు.

### విరాట్ 'స్విచ్ బ్యాటింగ్'

బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్‌కు విశ్రాంతి తీసుకున్న అనంతరం మళ్లీ భారత జట్టులో చేరిన కెప్టెన్ విరాట్ కోహ్లి తొలి రోజు ప్రాక్టీస్ సెషన్‌ను పూర్తిగా ఉపయోగించుకున్నాడు. సుదీర్ఘ సమయం పాటు అతను సాధన చేశాడు. నెట్స్‌లోనే ముందుకొచ్చి కొన్ని భారీ షాట్లు ఆడిన అతను స్విచ్ హిట్‌ను కూడా ప్రయత్నించాడు. ఆ తర్వాత పూర్తిగా స్టాన్స్ మార్చి ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ తరహాలో కొన్ని బంతులు ఎదుర్కొన్నాడు. రోహిత్ శర్మ కూడా ఎక్కువ సేపు ప్రాక్టీస్‌లో గడపగా...యువ ఆటగాడు శివమ్ దూబే చూడచక్కటి షాట్లు ఆడాడు. విరామం తర్వాత పునరాగమనం చేస్తున్న భువనేశ్వర్ కుమార్‌కు బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ పలు సూచనలివ్వడం కనిపించింది. వెస్టిండీస్ ఆటగాళ్లు కూడా తీవ్రంగా శ్రమించారు.

### తొలి టి20 మ్యాచ్...

క్రికెట్ అభిమానులు ఉప్పల్ స్టేడియంలో పెద్ద సంఖ్యలో ఐపీఎల్ మ్యాచ్‌లు చూశారు. కానీ ఈ మైదానంలో ఇప్పటి వరకు అంతర్జాతీయ టి20 మ్యాచ్ జరగలేదు. సరిగ్గా రెండేళ్ల క్రితం భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ జరగాల్సి ఉన్నా... అంతకు ముందునుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా టాస్ వేయాల్సిన అవసరం కూడా లేకుండానే ఆ మ్యాచ్ రద్దయింది. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియం ఇప్పటి వరకు 6 వన్డేలు, 5 టెస్టులకు ఆతిథ్యం ఇచ్చింది.



పొలార్డ్

## మళ్లీ నంబర్‌వన్‌గా కోహ్లి

**దుబాయ్:** భారత కెప్టెన్ విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్టు బ్యాట్స్‌మన్ ర్యాంకింగ్స్‌లో మరోసారి నంబర్‌వన్ స్థానానికి చేరుకున్నాడు. ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్ (923 రేటింగ్ పాయింట్లు)ను వెనక్కి నెట్టి కోహ్లి (928) అగ్రస్థానంలో నిలిచాడు. బంగ్లాదేశ్‌తో కోల్‌కతాలో జరిగిన టెస్టులో కోహ్లి సెంచరీతో కదం తొక్కగా... ఇప్పటి వరకు నంబర్‌వన్‌గా ఉన్న స్మిత్ అడిలైడ్‌తో పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో 36 పరుగులే చేసి పాయింట్లు కోల్పోయాడు. టాప్–10లో భారత్‌నుంచి చతేశ్వర్ పుజారా (4వ స్థానం), అజింక్య రహానే (6వ స్థానం)లో ఉన్నారు. పాక్‌పై అద్భుతమైన ట్రిపుల్ సెంచరీ సాధించిన డేవిడ్ వార్నర్ ఏకంగా 12 స్థానాలు మెరుగుపర్చుకొని 5వ స్థానానికి చేరుకోవడం విశేషం. మరో ఆసీస్ బ్యాట్స్‌మన్ మార్నస్ లబ్‌షేన్ ఎనిమిదో ర్యాంక్‌లో నిలిచాడు.

**ఐదో స్థానంలో బుమ్రా...**

బౌలర్ల జాబితాలో ఆస్ట్రేలియా పేసర్ ప్యాట్ కమిన్స్ (900) నంబర్‌వన్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టాప్–10 బౌలర్ల జాబితాలో భారత్‌నుంచి జస్‌ప్రీత్ బుమ్రా (5వ స్థానం), ఆర్. అశ్విన్ (9వ స్థానం), మొహమ్మద్ షమీ (10వ స్థానం) ఉన్నారు.

## విండీస్ బ్యాటింగ్ కోచ్‌గా మాంటీ

**సాక్షి, హైదరాబాద్:** భారత్‌తో జరిగే టి20, వన్డే సిరీస్‌లకు ముందు వెస్టిండీస్ జట్టు కొత్త బ్యాటింగ్ కోచ్‌ను నియమించింది. మాంటీ దేశాయ్‌ను రెండేళ్ల కాలానికి బ్యాటింగ్ కోచ్‌గా ఎంపిక చేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. పుష్కర కాలపు కెరీర్‌లో మాంటీ అఫ్గానిస్తాన్, నేపాల్ జాతీయ జట్లకు ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్, గుజరాత్ లయన్స్ జట్ల కోచింగ్ బృందాల్లో పని చేశారు. మాంటీ ఇప్పటికే హైదరాబాద్‌లో జట్టుతో చేరాడు.

## హైదరాబాద్ కెప్టెన్‌గా తన్మయ్ అగర్వాల్

**సాక్షి, హైదరాబాద్:** ప్రతిష్టాత్మక అఖిల భారత రంజీ ట్రోఫీలో పాల్గొనే హైదరాబాద్ జట్టును బుధవారం ప్రకటించారు. అంబటి రాయుడు ఈ సీజన్ రంజీ ట్రోఫీ నుంచి తప్పుకున్న నేపథ్యంలో జట్టు సారథ్యాన్ని తన్మయ్ అగర్వాల్‌కు అప్పగించారు. బావనక సందీప్ వైస్ కెప్టెన్‌గా ఎంపికవగా, ఎన్. అర్జున్ యాదవ్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. రంజీ ట్రోఫీలో భాగంగా ఈ నెల 9 నుంచి 12 వరకు సొంత గడ్డపై జరిగే తమ తొలి మ్యాచ్‌లో గుజరాత్‌తో హైదరాబాద్ జట్టు ఆడుతుంది.

**జట్టు వివరాలు**

తన్మయ్ అగర్వాల్, పి. అక్షత్ రెడ్డి, కె. రోహిత్ రాయుడు, బి. సందీప్, హిమాలయ్ అగర్వాల్, కొల్లా సుమంత్, మెహదీహసన్, సాకేత్ సాయిరామ్, ఎం. రవికిరణ్, మొహమ్మద్ సిరాజ్, సీవీ మిలింద్, తనయ్ త్యాగరాజన్, జీఏ శశిధర్ రెడ్డి, యుధ్‌వీర్ సింగ్, జె. మల్లికార్జున్.

## ఒడిశాపై బెంగళూరు గెలుపు

**పుణే:** ఇండియన్ సూపర్ లీగ్ సీజన్–6లో బెంగళూరు ఎఫ్‌సీ తన జోరు కొనసాగిస్తోంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 1–0తో ఒడిశా ఎఫ్‌సీపై విజయం సాధించింది. సీజన్‌లో మూడో విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఆట ఆరంభం నుంచే ఇరు జట్లు కూడా దూకుడైన ఆటతీరుకే ప్రాధాన్యం ఇచ్చాయి. అటాక్, కౌంటర్ అటాక్‌లతో ప్రత్యర్థి 'డి' బాక్సుల్లోకి చొచ్చుకొని వెళ్లాయి. అయితే గోల్ కీపర్లు అడ్డుగోడగా నిలవడంతో గోల్ చేయడంలో ఇరు జట్లు సఫలం కాలేదు. ఆట 37వ నిమిషంలో లభించిన కార్నర్ కిక్‌ను గోల్‌గా మలిచిన జునాన్ బెంగళూరుకు 1–0 ఆధిక్యాన్నిచ్చాడు. రెండో అర్ధభాగంలో గోల్ కోసం ఒడిశా చేసిన ప్రయత్నాలను బెంగళూరు గోల్ కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు అద్భుతంగా అడ్డుకున్నాడు. చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న బెంగళూరు విజయాన్ని ఖాయం చేసుకుంది. నేటి మ్యాచ్‌లో ముంబై సిటీ ఎఫ్‌సీతో కేరళ తలపడుతుంది.

## భారత యువ జట్టు శుభారంభం

- 2–0 గోల్స్‌తో న్యూజిలాండ్‌పై గెలుపు
- మూడు దేశాల హాకీ టోర్నీ

**కాన్‌బెర్రా:** భారత జూనియర్ మహిళల హాకీ జట్టు శుభారంభం చేసింది. ఇక్కడ జరుగుతున్న మూడు దేశాల హాకీ టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 2–0తో న్యూజిలాండ్ జూనియర్ మహిళల జట్టుపై విజయం సాధించింది. భారత్ తరఫున లాల్రిందికి (15వ నిమిషంలో), ప్రభ్లీన్ కౌర్ (60వ నిమిషంలో) చెరో గోల్ వేశారు. ఆరంభ మ్యాచ్‌లో 3–1తో ఆస్ట్రేలియాను ఓడించిన న్యూజిలాండ్ ఈ మ్యాచ్‌లో డీలా పడింది. దూకుడు కనబర్చిన భారత్ విజయాన్ని ఖాయం చేసుకుంది.




మలేసియాలో జరుగుతోన్న ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 40 ఏళ్ల మహిళల వయో విభాగం 1500మీ. పరుగులో సాధించిన స్వర్ణ పతకంతో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అథ్లెట్ బొల్లారెడ్డి దివ్యారెడ్డి

## బుమ్రా బేబీ బౌలర్: రజాక్

**కరాచీ:** భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అసాధారణ బౌలరని దిగ్గజాలు సైతం అంగీకరిస్తుంటే.. పాక్ మాజీ ఆటగాడు అబ్దుల్ రజాక్ మాత్రం తన అక్కసు వెళ్లగక్కాడు. తనైతే బుమ్రా బౌలింగ్‌ను సులువుగా బాదేవాడినని చెప్పుకొచ్చాడు. 40 ఏళ్ల ఈ మాజీ ఆల్‌రౌండర్ బుమ్రాను ఓ బేబీ బౌలర్ అంటూ తేలిగ్గా మాట్లాడాడు. 'నా కెరీర్‌లో మేటి బౌలర్లయిన మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా), వసీమ్ అక్రమ్ (పాక్ సహచరుడు)లనే ఎదుర్కొన్నాను. అలాంటి నాకు బుమ్రా ఓ బచ్చా బౌలర్. అతని బౌలింగ్‌పై నేను ఎదురు దాడికి దిగేవాణ్ని' అని రజాక్ చెప్పాడు. ఇలా తేలిగ్గా తీసిపారేసిన అతనే మళ్లీ వెంటనే కితాబివ్వడం కూడా మొదలుపెట్టాడు. 'బుమ్రా చక్కగా బౌలింగ్ చేస్తున్నాడు. ఎంతో పరిణతి సాధించాడు. వైవిధ్యమైన బౌలింగ్ యాక్షన్‌తో కచ్చితత్వంతో బంతుల్ని సంధిస్తున్నాడు. అదే బుమ్రా గొప్పతనం' అంటూ ప్రశంసించాడు. ఐసీసీ వన్డే ర్యాంకుల్లో అగ్రస్థానంలో ఉన్న బుమ్రా... టెస్టుల్లో ఐదో ర్యాంకులో కొనసాగుతున్నాడు.

## '400' బాదే అవకాశం మళ్లీ వస్తుంది: వార్నర్

**అడిలైడ్:** టెస్టు క్రికెట్‌లో విండీస్ బ్యాటింగ్ దిగ్గజం బ్రియాన్ లారా చేసిన 400 పరుగుల వ్యక్తిగత స్కోరును బద్దలు కొట్టే రోజు తనకు మళ్లీ వస్తుందని ఆసీస్ విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ అన్నాడు. పాక్‌తో జరిగిన రెండో టెస్టులో వార్నర్ 335 పరుగులతో అజేయంగా నిలవగా... ఆసీస్ కెప్టెన్ టిమ్ పైన్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయడంతో లారా రికార్డును చెరిపేసే అవకాశాన్ని కోల్పోయాడు. టెస్టు జరిగిన సమయంలో లారా వ్యాపార పనులమీద అడిలైడ్‌లోనే ఉన్నాడు. అప్పుడే విండీస్ లెజెండ్ స్పందిస్తూ వార్నర్ తన రికార్డును బద్దలు కొడతాడని ఆశించానన్నాడు. 300 చేసిన బ్యాట్స్‌మన్‌కు 400 చేయడమెలాగో తెలుసని ఉత్తేజపరుస్తూ వ్యాఖ్యానించాడు. ఆ సమయంలో లారాతో కలిసి దిగిన ఫొటోనూ తాజాగా వార్నర్ ఇన్‌స్ట్రాగామ్‌లో పోస్ట్ చేశాడు. 'దిగ్గజ బ్యాట్స్‌మెనే స్వయంగా నన్ను కలవడం గొప్ప విషయం. అతని రికార్డును అధిగమించే అవకాశం మళ్లీ ఓ రోజు వస్తుంది' అని ఆ ఫొటోకు వ్యాఖ్య జతచేశాడు. తమ వెస్టిండీస్ దిగ్గజం గ్యారీ సోబర్స్ చేసిన 365 పరుగుల అత్యధిక వ్యక్తిగత స్కోరును 36 ఏళ్ల తర్వాత లారా ఇంగ్లండ్ (1994)పై బద్దలు కొట్టాడు. ఈ స్కోరును మాథ్యూ హేడెన్ (381 – జింబాబ్వేపై) అధిగమించగా...కొద్ది రోజులకే 2004లో ఇంగ్లండ్‌పైనే 400 పరుగులతో లారా కొత్త రికార్డు నమోదు చేశాడు. ఇప్పటికీ ఈ రికార్డు పదిలంగానే ఉంది.



## పేస్‌కు కపిల్‌తోనే పునాది

**కోహ్లి నేతృత్వంలో మరో స్థాయికి: ఇయాన్ బిషప్**

**న్యూఢిల్లీ:** ఏ నోటా విన్నా భారత పేస్ దళం మాటే ఈ మధ్య ఎక్కువగా వినిపిస్తోంది. ప్రస్తుత ఫాస్ట్ బౌలింగ్ అద్భుతంగా ఉందంటూ మాజీలు, దిగ్గజాలు కితాబిస్తున్నారు. కానీ వెస్టిండీస్ మాజీ స్పీడ్‌స్టర్ ఇయాన్ బిషప్ మాత్రం లెజెండ్ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్‌తోనే భారత పేస్ బౌలింగ్‌కు పునాది పడిందని విశ్లేషించారు. అయితే కోహ్లి హయాంలో మరో స్థాయికి చేరిందని అంగీకరించారు. ఓ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'మీరు చూస్తున్న ఈ భారత సీమర్లు కొత్తగా ఇప్పుడే ఉద్భవించలేదు. గతంలోకి వెళితే అసలు సంగతి అర్థమవుతుంది. కపిల్‌తో మొదలైన పేస్ ప్రస్థానాన్ని ఆ తర్వాత శ్రీనాథ్, జహీర్ ఖాన్, మునాఫ్ పటేల్, శ్రీశాంత్‌లు కొనసాగించారు. అయితే ప్రస్తుతం మాత్రం భారత పేస్ దళం పుంజుకుంది. కెప్టెన్ కోహ్లి ఫాస్ట్‌బౌలర్లకు ఊతమిచ్చాడు. వారిలో నమ్మకాన్ని పెంచాడు. అలాగే ఈ తరంలో ప్రత్యేక ప్రతిభ ఉన్న పేసర్ బుమ్రా. ఇక్కడ ఈ తరమంటే మూడు ఫార్మాట్లు ఆడగలిగే నేర్పరితనం. మహ్మద్ షమీ, ఇషాంత్ శర్మలు కూడా భారత బౌలింగ్ విభాగాన్ని పటిష్టం చేశారు' అని అన్నారు. భారత ఫాస్ట్‌బౌలింగ్‌ను ఈ స్థాయికి తీసుకొచ్చిన ఘనత బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్‌కు దక్కుతుందని చెప్పారు. అయితే ఇప్పటి భారత బలగాన్ని అలనాటి వెస్టిండీస్ పేసర్లతో పోల్చడం తగదని చెప్పారు.



# భారత్ జోరు

**టెన్నిస్, ఖోఖో, టీటీలో స్వర్ణాలు**

**దక్షిణాసియా క్రీడలు**



పతకాలతో భారత పురుషుల మహిళల టెన్నిస్ జట్లు

**కఠ్మాండు:** భారత క్రీడాకారులు దక్షిణాసియా క్రీడల్లో 'పసిడి'పట్టు పట్టారు. బుధవారం జరిగిన పలు ఈవెంట్ల ఫైనల్లో భారత ఆటగాళ్లే విజేతలుగా నిలిచారు. టెన్నిస్, టేబుల్ టెన్నిస్, ఖోఖో పోటీల్లో భారత మహిళలు, పురుషులు బంగారు పతకాలు సాధించారు. టేబుల్ టెన్నిస్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లో భారత జోడీలే టైటిల్ పోరులో తలపడ్డాయి. దీంతో స్వర్ణాలతోపాటు రజతాలు లభించాయి. టేబుల్ టెన్నిస్ పురుషుల డబుల్స్ ఫైనల్లో హర్మీత్ దేశాయ్–ఆంథోని అమల్‌రాజ్ జోడీ 8–11, 11–7, 11–7, 11–5, 8–11, 12–10తో సానిల్ శెట్టి–సుధాన్షు గ్రోవర్ జంటపై గెలుపొందింది. మహిళల ఫైనల్లో ఆకుల శ్రీజ–మధురిక పాట్కర్ జంట 2–11, 11–8, 11–8, 11–6, 5–11, 11–5తో సుతీర్థ ముఖర్జీ–ఐహిక ముఖర్జీ జోడీపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో హర్మీత్–సుతీర్థ ద్వయం 11–6, 9–11, 11–6, 11–6, 11–8తో అమల్‌రాజ్–ఐహిక జంటపై గెలిచింది. ఖోఖో పురుషుల ఫైనల్లో భారత్ 16–9తో బంగ్లాదేశ్‌పై విజయం సాధించగా, మహిళల తుదిపోరులో 17–5తో ఆతిథ్య నేపాల్‌ను ఓడించింది. బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో పుల్లెల గాయత్రి, అష్మిత, పురుషుల సింగిల్స్‌లో సిరిల్ వర్మ, ఆర్యమన్ టాండన్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్స్‌లో భారత కోచ్ గోపీచంద్ తనయ గాయత్రి 21–15, 21–16తో మహూర్ షాజాద్ (పాక్)పై, అష్మిత 21–9, 21–7తో పాల్వాశ బషీర్ (పాక్)పై నెగ్గారు. పురుషుల క్వార్టర్స్‌లో సిరిల్ వర్మ 21–12, 21–17తో మురద్ అలీ (పాక్)పై, ఆర్యమన్ 21–17, 21–17తో రంతుష్క కరుణతిలకే (శ్రీలంక)పై విజయం సాధించారు. దక్షిణాసియా క్రీడల్లో నాలుగో రోజు బుధవారం భారత్ ఏకంగా 29 పతకాలు సాధించింది. ఇందులో 15 స్వర్ణాలున్నాయి. మొత్తంమీద భారత్ 71 పతకాలతో అగ్రస్థానంలో ఉంది. 32 పసిడి పతకాలతో పాటు 26 రజతాలు, 13 కాంస్యాలు గెలిచింది.

సాక్షి **బిజినెస్**
గురువారం
5-12-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 175 ▲ | 49 ▲ |
| 40,850 | 12,043 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం...
www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,564 | ▲ 44 |
| డోజోన్స్ | 27,675 | ▲ 172 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,188 | ▲ 30 |
| డాక్స్ | 13,141 | ▲ 151 |
| షాంఘై | 2,878 | ▼ 7 |
| నికాయ్ | 23,135 | ▼ 245 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 71.00 | 72.65 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.77 | 95.03 |
| యూరో | ఎస్‌బీఐ | 78.14 | 81.04 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.94 | 67.39 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 48.03 | 50.20 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.75 | 53.56 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.28 | 19.89 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 19.01 | 20.01 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.52 | 10.93 |

# సరిలేరు 'సుందర్'కెవ్వరు..!

- గూగుల్ చీఫ్ సుందర్ పిచాయ్‌కు ప్రమోషన్
- ఇకపై అల్ఫాబెట్ సీఈవోగా కూడా ఆయనే...
- కీలక హోదాల నుంచి తప్పుకున్న వ్యవస్థాపకులు




హోదాల బదలాయింపుతో అల్ఫాబెట్ సంస్థాగత స్వరూపంలో గానీ రోజువారీ కార్యకలాపాల్లో గానీ పెద్ద మార్పులేమీ ఉండబోవు. ఎప్పట్లాగే ఇకపైనా గూగుల్‌ని మరింత వృద్ధిలోకి తెచ్చేందుకు కృషి చేస్తా. కంప్యూటింగ్ హద్దులు చెరిపేసేందుకు, అందరికీ మరింత ఉపయోగకరంగా ఉండేలా గూగుల్‌ను తీర్చిదిద్దేందుకు చేస్తున్న ప్రయత్నాలు కొనసాగుతాయి. పెను సవాళ్లను టెక్నాలజీతో పరిష్కరించే దిశగా అల్ఫాబెట్ దీర్ఘకాలిక వ్యూహాల అమలు కూడా కొనసాగుతుంది.
– సుందర్ పిచాయ్

**వాషింగ్టన్:** టెక్నాలజీ ప్రపంచంలో మనోళ్ల హవా కొనసాగుతోంది. టెక్ దిగ్గజం గూగుల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ (సీఈఓ)గా ఉన్న సుందర్ పిచాయ్ (47)... తాజాగా దాని మాతృసంస్థ అల్ఫాబెట్‌కూ సీఈవోగా నియమితులయ్యారు. ఇప్పటిదాకా ఈ బాధ్యతల్లో ఉన్న గూగుల్ సహ వ్యవస్థాపకులు ల్యారీ పేజ్, సెర్గీ బ్రిన్ వాటి నుంచి తప్పుకున్నారు. తాజా పరిణామంతో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన కార్పొరేట్ దిగ్గజాల్లో ఒకరిగా సుందర్ పిచాయ్ నిలవనున్నారు. మరో టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌కు తెలుగువాడైన సత్య నాదెళ్ల సారథ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.

కొత్త మార్పులపై కంపెనీ ఉద్యోగులకు పేజ్, బ్రిన్ లేఖ రాశారు. అల్ఫాబెట్ ప్రస్తుతం గట్టిగా నిలదొక్కుకుందని, గూగుల్‌తో పాటు ఇతర అనుబంధ సంస్థలూ స్వతంత్రంగా రాణిస్తున్నాయని... మేనేజ్‌మెంట్ వ్యవస్థను సరళీకరించేందుకు ఇదే సరైన తరుణమని వారు పేర్కొన్నారు. 'కంపెనీని మరింత మెరుగ్గా నడిపించగలిగే మార్గాలున్నప్పుడు.. మేము మేనేజ్‌మెంట్ హోదాలకు అతుక్కుని ఉండదల్చుకోలేదు. అల్ఫాబెట్, గూగుల్ సంస్థలకిక ఇద్దరు సీఈవోలు, ఒక ప్రెసిడెంట్ అవసరం లేదు. ఇకపై రెండింటికీ సుందరే సీఈవోగా ఉంటారు. గూగుల్‌కు సారథ్యం వహించడంతో పాటు ఇతర అనుబంధ సంస్థల్లో అల్ఫాబెట్ పెట్టుబడులన్నింటినీ ఆయనే చూస్తారు' అని పేజ్, బ్రిన్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోనూ బోర్డు సభ్యులుగా, షేర్‌హోల్డర్లుగా, సహ–వ్యవస్థాపకులుగా గూగుల్, అల్ఫాబెట్ వృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. 'దాదాపు 15 సంవత్సరాలుగా.. అల్ఫాబెట్ ఏర్పాటులోనూ, గూగుల్ సీఈవోగా, అల్ఫాబెట్ డైరెక్టరుగా సుందర్ పిచాయ్ మాతో కలిసి నడిచారు. అల్ఫాబెట్ భవిష్యత్తుపైన, సవాళ్లను టెక్నాలజీ సాయంతో అధిగమించేలా చేయగలిగే సంస్థ సామర్థ్యంపైనా మాకున్నంత నమ్మకం ఆయనకూ ఉంది' అని పేజ్, బ్రిన్ తెలిపారు.

**సెర్చికి పర్యాయపదంగా గూగుల్...**

ఒకప్పటి దిగ్గజం యాహూను పక్కకు నెట్టేసి.. ఇంటర్నెట్‌లో సెర్చికి పర్యాయపదంగా మారిన గూగుల్‌ను సెర్గీ బ్రిన్, ల్యారీ పేజ్ 1998లో ఆరంభించారు. పేజ్ తొలి సీఈవో కాగా... తర్వాత 2001 నుంచి 2011 దాకా ఎరిక్ ష్మిట్ ఆ హోదాలో కొనసాగారు. తర్వాత పేజ్ మళ్లీ కొన్నాళ్ల పాటు సీఈవోగా వచ్చారు. 2015లో హోల్డింగ్ కంపెనీగా అల్ఫాబెట్‌ను ఏర్పాటు చేసినప్పట్నుంచీ బ్రిన్, పేజ్.. గూగుల్‌లో కీలక పాత్ర పోషించడాన్ని తగ్గించుకున్నారు.

## సింపుల్.. సుందర్

ఐఐటీలో చదివేటప్పుడు తనకు ఒక దశలో సీ గ్రేడ్ రావడం.. మళ్లీ మెరుగుపడటానికి తాను కిందా మీదా పడటం లాంటి ఆసక్తికరమైన విషయాలను కొన్నాళ్ల కిందట ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విద్యార్థులతో సమావేశమైన సందర్భంగా పిచాయ్ చెప్పారు. చిన్నప్పటి సాదా సీదా జీవితాన్ని ఒక పత్రిక ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'ఇప్పటితో పోలిస్తే అప్పట్లో మా జీవితం సింపుల్‌గా, హాయిగా ఉండేది. ఒక మోస్తరు అద్దింట్లో ఉంటూ లివింగ్ రూమ్‌లో హాయిగా కింద పడుకునేవాళ్లం. ఒకసారి తీవ్ర కరువొచ్చింది. అదెంత భయపెట్టిందంటే.. ఇప్పటికీ నేను పడుకునేటప్పుడు మంచం పక్కన మంచినీటి బాటిల్ పెట్టుకుంటాను. మేం ఫ్రిజ్ కొనుక్కోవడం అప్పట్లో మాకో గొప్ప విశేషం' అని ఆయన చెప్పుకొచ్చారు. గూగుల్‌లో టీమ్‌ను ముందుండి నడిపించగలిగే సత్తాతో టాప్ మేనేజ్‌మెంట్ దృష్టిలో పడ్డారు. మృదు భాషిగా, ఎవర్నీ నొప్పించకుండా సమస్యలను పరిష్కరించగలిగే వ్యక్తిగా సుందర్ గురించి ఆయన సన్నిహితులు చెబుతారు. విభిన్న ఉత్పత్తులపై, టెక్నాలజీపై పరిజ్ఞానంతో పాటు ఈ సామర్థ్యాలే ఆయన్ను గూగుల్‌లో కీలక వ్యక్తిగా నిలిపాయి.


భార్య అంజలితో సుందర్ పిచాయ్

## మదురై టు సిలికాన్ వ్యాలీ...

సుందర్ పిచాయ్ తమిళనాడులోని మదురైలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టారు. తండ్రి ఎలక్ట్రికల్ ఇంజనీరు కాగా తల్లి స్టెనోగ్రాఫర్. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మెటలర్జికల్ ఇంజనీరింగ్ చేస్తూ అక్కడే తన జీవిత భాగస్వామి అంజలిని కలిశారు. తరవాత అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ వర్సిటీలో ఎంఎస్ చేశారు. ఎంబీఏ అనంతరం 2004లో గూగుల్‌లో చేరారు. కీలకమైన క్రోమ్ బ్రౌజర్ ప్రాజెక్టును విజయవంతం చేశాక కంపెనీలో ఆయన వేగంగా ఎదిగారు. 2013లో ముఖ్యమైన ఆండ్రాయిడ్ డివిజన్ ఇన్‌చార్జిగా... తర్వాత రెండేళ్లకే 2015లో గూగుల్ సీఈవో అయ్యారు. దాంతోనే పలు అల్ఫాబెట్ ప్రాజెక్టులూ ఆయన పరిధిలోకి వచ్చాయి. ఇటీవల ఉద్యోగుల నిరసనల్లాంటి వాటితో పాటు పలు వివాదాలను సమర్థంగా ఎదుర్కొన్న తీరు.. అల్ఫాబెట్ సీఈవో పీఠానికి ఆయన్ను మరింత దగ్గర చేశాయి.

**అల్ఫాబెట్(గూగుల్) ప్రస్తుత మార్కెట్ విలువ : 89,300 కోట్ల డాలర్లు**

**ఆదాయం(2018) : 13,682 కోట్ల డాలర్లు**

**నికర లాభం : 3,074 కోట్ల డాలర్లు**

**సుందర్ పిచాయ్ 2018 సంపాదన (షేర్ల విలువతో కలిపి) : 47 కోట్ల డాలర్లు (సుమారు రూ.3,300 కోట్లు)**

## సీఎస్‌బీ బ్యాంక్ లిస్టింగ్.. భేష్

- 41 శాతం లాభంతో రూ.275 వద్ద లిస్టింగ్
- 54 శాతం లాభంతో రూ.300 వద్ద ముగింపు

**న్యూఢిల్లీ:** సీఎస్‌బీ బ్యాంక్ షేర్లు స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌లోనూ, ముగింపులోనూ మెరుపులు మెరిపించాయి. ఇష్యూ ధర రూ.195తో పోల్చితే లిస్టింగ్‌లో 41 శాతం లాభాన్ని, ముగింపులో 54 శాతం లాభాన్ని ఇన్వెస్టర్లకు పంచాయి. రూ.193–195 ప్రైస్‌బ్యాండ్‌తో వచ్చిన ఈ బ్యాంక్ ఐపీఓ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్) 87 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది.




బుధవారం సీఎస్‌బీ బ్యాంక్ షేర్లు బీఎస్ఈలో ఇష్యూ ధర, రూ.195తో పోల్చితే 41 శాతం లాభంతో రూ. 275 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో 57 శాతం లాభంతో రూ. 307 వద్ద గరిష్ట స్థాయిని తాకింది. చివరకు 54 శాతం లాభంతో రూ.300 వద్ద ముగిసింది. బీఎస్ఈలో 40.2 లక్షలు, ఎన్ఎస్ఈలో 3.7 కోట్ల షేర్లు ట్రేడయ్యాయి. కంపెనీ మార్కెట్ క్యాప్‌రూ.5,205 కోట్లకు చేరింది. ఈ ఐపీఓ ద్వారా ఈ బ్యాంక్ రూ.410 కోట్లు సమీకరించింది.

## జియో బాదుడు.. 39% పైనే

**ఐడియా, ఎయిర్‌టెల్ బాటలోనే...**

**న్యూఢిల్లీ:** ప్రముఖ టెలికం కంపెనీ రిలయన్స్ జియో... ఛార్జీలు పెంచుతూ కొత్త రేట్లను బుధవారం విడుదలచేసింది. డిసెంబర్ 6 నుంచి ధరలు పెరగనున్నట్లు కంపెనీ గతంలోనే ఒక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. కాగా, ప్రస్తుతం అమల్లో ఉన్న ట్యారిఫ్‌లతో పోల్చితే 39%కి పైగా పెంపును ప్రకటించింది. రోజుకు 1.5 జీబీ డేటాతో 84 రోజుల వ్యాలిడిటీ ఉన్న ప్యాకేజీ ధర ప్రస్తుతం రూ.399 ఉండగా.. దీని ధరను రూ. 555 చేసింది. రూ.153 ప్లాన్ ధర శుక్రవారం నుంచి రూ.199 కానుంది. రూ.349 ప్లాన్ రూ. 399గా మారనుంది. రూ.448 ప్లాన్ రూ.599 కానుండగా.. ప్రస్తుతం ఏడాదికి రూ.1,699గా ఉన్న ప్లాన్ రూ.2199కి చేరనుంది. ట్యారిఫ్ పెరిగినప్పటికీ.. పోటీ సంస్థలు ఇస్తోన్న ప్లాన్‌లతో పోలిస్తే మాత్రం తమ నూతన ట్యారిఫ్ 25 శాతం తక్కువగా ఉన్నట్లు కంపెనీ వివరించింది. రూ.199 ప్లాన్‌ను ఇతర సంస్థలు రూ. 249కి అందిస్తున్నాయని లెక్కలు వేసి చూపిస్తోంది.




## 'ఉజ్జీవన్' ఐపీఓ... అదుర్స్

- 166 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయిన ఇష్యూ
- ఈ ఏడాది ఇన్వెస్టర్ల నుంచి అత్యధిక స్పందన దీనికే...

**న్యూఢిల్లీ:** ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓ (ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్) అదరగొట్టింది. బుధవారం ముగిసిన ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.750 కోట్లు సమీకరించనున్నది. ఐపీఓలో భాగంగా 12.39 కోట్ల షేర్లు ఆఫర్ చేస్తుండగా, 2,053 కోట్ల షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు కేటాయించిన వాటా 114 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల వాటా 486 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 50 రెట్లు చొప్పున ఓవర్ సబ్‌స్క్రైబయ్యాయి. మొత్తం మీద ఈ ఇష్యూ 166 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది. ఈ ఏడాదిలో ఇన్వెస్టర్ల నుంచి అత్యధిక స్పందన వచ్చిన ఇష్యూ ఇదే. ఈ ఐపీఓకు ప్రైస్‌బ్యాండ్‌గా రూ.36–37ను కంపెనీ నిర్ణయించింది. ఈ నెల 12న ఈ షేర్ స్టాక్ మార్కెట్లో లిస్ట్ కానున్నది. అప్పర్ ప్రైస్‌బ్యాండ్(రూ.37) ధరకు దాదాపు రెట్టింపు ధరకు ఈ షేర్ స్టాక్ మార్కెట్లో లిస్టవ్వగలదని అంచనా.




## డేటా దుర్వినియోగానికి జైలు శిక్ష..

- కంపెనీలపై రూ. 15 కోట్ల దాకా జరిమానా
- వ్యక్తిగత డేటా భద్రత బిల్లుకు క్యాబినెట్ ఆమోదం




**న్యూఢిల్లీ:** వ్యక్తిగత డేటాను దుర్వినియోగం చేసిన పక్షంలో కంపెనీలు ఇకపై భారీ మూల్యం చెల్లించుకోవాల్సి రానుంది. కోట్ల రూపాయల జరిమానాలు కట్టడంతో పాటు వాటి ఎగ్జిక్యూటివ్‌లు జైలు శిక్షలు కూడా ఎదుర్కొనాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన వ్యక్తిగత డేటా భద్రత బిల్లుకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దీన్ని ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. వ్యక్తిగత డేటా భద్రత బిల్లు నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో సదరు కంపెనీ .. రూ. 15 కోట్ల దాకా లేదా తన అంతర్జాతీయ టర్నోవరులో 4 శాతం మొత్తాన్ని జరిమానాగా కట్టాల్సి వస్తుంది. ఒకవేళ వ్యక్తుల డేటాను కావాలనే చట్టవిరుద్ధంగా ప్రాసెసింగ్ చేశారని తేలిన పక్షంలో సదరు కంపెనీలో డేటా వ్యాపార విభాగానికి ఇంచార్జిగా ఉన్న ఎగ్జిక్యూటివ్‌కు మూడేళ్ల దాకా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే తమ డేటాను పూర్తిగా తొలగించేలా తగు చర్యలు తీసుకోవడానికి వ్యక్తులకు హక్కులు లభిస్తాయి. డేటా బిల్లులో మరికొన్ని ముఖ్యాంశాలు..

- వ్యక్తులకు సంబంధించిన కీలక డేటాను అన్ని ఇంటర్నెట్ కంపెనీలు.. భారత్‌లోనే భద్రపర్చాలి. ఒకవేళ విదేశాల్లో ప్రాసెస్ చేయాల్సి వస్తే.. చట్ట నిబంధనలకు లోబడి, ఆయా వ్యక్తుల నుంచి కచ్చితంగా పూర్తి అనుమతులు తీసుకోవాలి.
- ఆరోగ్యం, మతం, రాజకీయ అభిప్రాయాలు, బయోమెట్రిక్స్, జన్యుపరమైన, ఆర్థికపరమైన వివరాలను కీలక డేటాగా పరిగణించడం జరుగుతుంది. కీలక డేటాలో మార్పులు, చేర్పుల గురించి కేంద్రం ఎప్పటికప్పుడు ప్రకటిస్తుంది.
- చిన్నపాటి ఉల్లంఘనలకు కంపెనీలపై రూ. 5 కోట్లు లేదా గ్లోబల్ టర్నోవరులో 2% దాకా జరిమానా విధించవచ్చు. నిబంధనలు ఉల్లంఘించిన అధికారులకు జైలు శిక్ష కూడా విధించవచ్చు.

# ఇక చిన్న మదుపరికీ బాండ్లు!

- భారత్ బాండ్ ఈటీఎఫ్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర
- దీన్లో అన్నీ ప్రభుత్వ సంస్థల బాండ్లే
- మూడేళ్లు, ఏడేళ్ల కాలపరిమితితో త్వరలో ఆరంభం
- కనీస పెట్టుబడి రూ.1,000...
- రిస్కు లేకుండా స్థిరమైన రాబడి..!




**న్యూఢిల్లీ:** ఈక్విటీల మాదిరే కార్పొరేట్ బాండ్ మార్కెట్లోనూ రిటైల్ ఇన్వెస్టర్లు చురుగ్గా ఇన్వెస్ట్ చేసే అవకాశం రానుంది. ఇందుకు వీలుగా దేశంలోనే తొలి కార్పొరేట్ బాండ్ ఈటీఎఫ్ (భారత్ బాండ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్) ప్రారంభానికి బుధవారం ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర కేబినెట్ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఈ ఈటీఎఫ్ ద్వారా కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అదనపు నిధుల సమీకరణ సులభం కానుంది. బడ్జెట్లో పేర్కొన్నట్టుగా బాండ్ మార్కెట్‌ను ఇది మరింత విస్తృతం చేస్తుందని కేబినెట్ భేటీ అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మీడియా ప్రతినిధులతో చెప్పారు. ''భద్రత, లిక్విడిటీ, పన్ను లేని స్థిరమైన రాబడులను బాండ్ ఈటీఎఫ్ అందిస్తుంది'' అని మంత్రి వివరించారు. రిటైల్ ఇన్వెస్టర్లు సైతం రూ.1,000 నుంచి బాండ్లలో ఇన్వెస్ట్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. బాండ్లకు డిమాండ్ పెరిగితే, అప్పుడు తక్కువ ఖర్చుకే నిధులను సమీకరించుకునే అవకాశం ప్రభుత్వ రంగ సంస్థలకుంటుందని మంత్రి చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థల రుణ అవసరాలకు అనుగుణంగా ఏటా బాండ్ కేలండర్‌ను రూపొందిస్తామన్నారు. కాగా, ఈ నెల్లోనే భారత్ బాండ్ ఈటీఎఫ్‌ను ప్రారంభించే అవకాశాలున్నాయని పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం (దీపమ్) కార్యదర్శి తుహిన్ కాంత పాండే ఈ సందర్భంగా తెలియజేశారు.

**బాండ్ ఈటీఎఫ్ విశేషాలు..**

- భారత్– 22 ఈటీఎఫ్ మాదిరే 'భారత్ బాండ్ ఈటీఎఫ్'నూ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేస్తారు. అవసరమైతే విక్రయించి సొమ్ము చేసుకోవచ్చు.
- ఒక్కో యూనిట్ విలువ రూ.1,000. ఈ లెక్కన ఇన్వెస్టర్లు ఎంతైనా పెట్టుబడి పెట్టొచ్చు.
- క్లోజ్ ఎండెడ్ మ్యూచువల్ ఫండ్స్‌లా... మూడేళ్లు, పదేళ్ల స్థిర కాల వ్యవధితో భారత్ బాండ్ ఈటీఎఫ్‌ను జారీ చేస్తారు. వాటి కాలవ్యవధి వరసగా 2023లో, 2030లో ముగుస్తుంది.
- గ్రోత్ ఆప్షన్ మాత్రమే ఉంటుంది. డివిడెండ్ ఆప్షన్ ఉండదు.
- రాబడులు ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే మెరుగ్గా, స్థిరంగా ఉంటాయి. 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ల ఈల్డ్స్‌తో (ప్రస్తుతం 6.47 శాతం) పోలిస్తే 0.50–1.40% అధికంగా ఉండొచ్చని అంచనా.
- బాండ్ ఈటీఎఫ్‌లో పెట్టుబడులపై వచ్చిన మూలధన లాభాల్లోంచి ద్రవ్యోల్బణ ప్రభావాన్ని (ఇండెక్సేషన్ లాభం) మినహాయిస్తారు. ఆ తరవాతే పన్ను చెల్లించాల్సి ఉంటుంది కనక పన్ను చాలావరకూ తగ్గుతుంది.
- ప్రతి ఆరు నెలలకోసారి ఈటీఎఫ్ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) ఉంటుంది. ఇందుకోసం ఎన్ఎస్ఈ ఒక ఇండెక్స్‌ను రూపొందిస్తుంది.
- ఈటీఎఫ్ అన్నది పలు బాండ్ల సమూహం. ఏదైనా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ తన నిధుల కోసం భారత్ బాండ్ ఈటీఎఫ్ కింద బాండ్లను జారీ చేయవచ్చు.
- ఈ భారత్ బాండ్ ఈటీఎఫ్ నిర్వహణ బాధ్యతలను ఎడెల్‌వీజ్ ఏఎంసీ చూస్తుంది.

**రిస్క్ చాలా తక్కువ...**

ఐఎల్అండ్ఎఫ్ఎస్, డీహెచ్ఎఫ్ఎల్, ఎస్సెల్ గ్రూపులు.. రుణపత్రాలపై తీసుకున్న బకాయిల్ని చెల్లించటంలో విఫలమవ్వడాన్ని ఇటీవల చూశాం. వీటిల్లో రిటైల్ ఇన్వెస్టర్లు నేరుగా ఇన్వెస్ట్ చేసినా, లేక మ్యూచువల్ ఫండ్స్ రూపంలో ఇన్వెస్ట్ చేసినా డిఫాల్ట్ రిస్కు ఎదుర్కోవాల్సి వచ్చేది. అయితే, ఇప్పుడు ప్రభుత్వం తెస్తున్న భారత్ బాండ్ ఈటీఎఫ్‌లో ఇలాంటి పరిస్థితి ఉం డదు. ఎందుకంటే ఈ ఈటీఎఫ్ కింద బాండ్ల రూపంలో నిధులు సమీకరించేవన్నీ ప్రముఖ ప్రభుత్వరంగ సంస్థలే. ప్రభుత్వ సంస్థలు రుణ చెల్లింపుల్లో విఫలం కావడం ఇప్పటివరకు అరుదే. ఎందుకంటే వీటి వెనుక ప్రభుత్వం ఉంటుంది.

లిక్విడిటీతో కూడిన, నాణ్యమైన ప్రభుత్వరంగ బాండ్లలో, తక్కువ ఖర్చుతో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. మరింత మంది ఇన్వెస్టర్ల ప్రాతినిధ్యానికి ఇది వీలు కల్పిస్తుంది.
*– ఎన్ఎస్ వెంకటేశ్, సీఈవో, యాంఫి*

ప్రభుత్వరంగ సంస్థలకు నిధుల సమీకరణకు ఇదొక కొత్త మార్గంగా సాయపడుతుంది. ప్రారంభంలో 3 ఏళ్లు, 10 ఏళ్ల మెచ్యూరిటీతో భారత్ బాండ్ ఈటీఎఫ్ ఉంటుంది.
*– రాధికా గుప్తా, సీఈవో, ఎడెల్‌వీజ్ ఏఎంసీ*

బాండ్ ఈటీఎఫ్‌లో కనీస పెట్టుబడి రూ.1,000గా ఉండటం రిటైల్ ఇన్వెస్టర్లకు చాలా మంచిది. వారు తక్కువ రిస్క్‌తో కూడిన కార్పొరేట్ బాండ్లలో పాల్గొనేందుకు ఇదో మంచి అవకాశం.
*– అనిల్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్, ఇక్రా*

## కార్వీ కేసులో బ్యాంకులకు చుక్కెదురు

**తనఖా షేర్లపై సెబీనే ఆశ్రయించాలని శాట్ సూచన**




**న్యూఢిల్లీ:** క్లయింట్ల షేర్లు సొంతానికి వాడుకుందని ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) వ్యవహారంలో సెక్యూరిటీస్ అపీలేట్ ట్రిబ్యునల్‌లో (శాట్) బ్యాంకులకు చుక్కెదురైంది. తనఖా పెట్టిన షేర్లను క్లయింట్ల ఖాతాల్లోకి మళ్లించకుండా తక్షణం ఆదేశాలివ్వాలన్న బ్యాంకుల అభ్యర్థనను శాట్ తోసిపుచ్చింది. దీనిపై డిసెంబర్ 6లోగా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీనే ఆశ్రయించాలని ఆదేశించింది. అలాగే ఆయా బ్యాంకుల వాదనలు విని, డిసెంబర్ 12లోగా తగు ఆదేశాలివ్వాలని సెబీకి సూచించింది. దీంతోపాటు, కార్వీ ట్రేడింగ్ లైసెన్సును రద్దు చేసిన అంశానికి సంబంధించి డిసెంబర్ 6లోగా తగు నిర్ణయం తీసుకోవాలని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)ని ఆదేశించింది. కాగా, కార్వీ తనఖా పెట్టిన షేర్లపై రుణదాతలు మొత్తం రూ.1,400 కోట్ల మేర రుణాలిచ్చినట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. సుమారు 95,000 క్లయింట్లకు చెందిన దాదాపు రూ. 2,800 కోట్ల విలువ చేసే షేర్లను తనఖా పెట్టి కార్వీ పెద్దమొత్తంలో రుణాలు తీసుకుందన్న ఆరోపణలు రావటం తెలిసిందే. ఈ షేర్లను ఆయా క్లయింట్ల ఖాతాల్లోకి బదలాయించాలన్న సెబీ ఆదేశాలను ఎన్ఎస్‌డీఎల్ అమలు చేస్తోంది. సుమారు 83వేల మంది క్లయింట్లకు ఇప్పటికే షేర్ల బదిలీ జరిగింది. అయితే, కార్వీ తనఖా ఉంచిన షేర్లను క్లయింట్ల ఖాతాల్లోకి బదిలీ చేయరాదని, వాటిని ఎస్క్రో ఖాతాలోకి మళ్లించాలని కోరుతూ బజాజ్ ఫైనాన్స్ వంటి ఆర్థిక సంస్థలు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు.. ఐసీఐసీఐ బ్యాంక్ శాట్‌ను ఆశ్రయించాయి. దీనిపై మంగళవారం శాట్ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

## టాటా మోటార్స్ కార్ల ధరలు పెంపు..




**జైసల్మేర్/రాజస్తాన్:** దేశీయ వాహన తయారీ కంపెనీ టాటా మోటార్స్ తన ప్యాసింజర్ వాహన ధరలను పెంచనున్నట్లు బుధవారం ప్రకటించింది. వచ్చే ఏడాది ఆరంభం నుంచి ఈ పెంపు అమల్లోకి రానుందని తెలియజేసింది. భారత్ స్టేజ్ (బీఎస్)–6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా వాహనాలను విడుదల చేయాల్సి వస్తుండడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుందని, ఎంత మేర పెంచాలన్న అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని సంస్థ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్ అన్నారు. హ్యాచ్‌బ్యాక్ టియాగో నుంచి ఎస్‌యూవీ హ్యారియర్ వరకు పలు మోడళ్లను ఈ సంస్థ భారత మార్కెట్లో విక్రయిస్తోంది. వీటి ధర రూ.4.39 లక్షలు–16.85 లక్షల వరకు ఉంది.

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,480 | ▲ 420 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,600 | ▲ 400 |
| వెండి (కిలో) | 48,500 | ▲ 600 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,300 | ▲ 210 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,480 | ▲ 200 |
| వెండి (కిలో) | 48,500 | ▲ 600 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,300 | ▲ 210 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,480 | ▲ 200 |
| వెండి (కిలో) | 48,500 | ▲ 600 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,100 | ▲ 200 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,250 | ▲ 210 |
| వెండి (కిలో) | 46,300 | ▲ 600 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,350 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,590 | 0 |
| వెండి (కిలో) | 45,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,550 | ▲ 300 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,480 | ▲ 200 |
| వెండి (కిలో) | 48,500 | ▲ 600 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 58.48 (రాత్రి 11.30కు) | $56.10 (మంగళవారం ముగింపు) |
| బ్రెంట్ | 63.37 (రాత్రి 11.30కు) | $60.83 (మంగళవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 05-12-2019

| | |
|---|---|
| విశాఖ | 460–00 |
| చిత్తూరు | 471–00 |
| వరంగల్ | 447–00 |
| చెన్నై | 478–00 |
| ముంబై | 499–00 |
| **04–12–2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 444–00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 5.05 |
| విజయవాడ | 457–00 |
| నమక్కల్ | 433–00 |
| గోదావరి | 457–00 |
| బెంగళూరు | 465–00 |
| కోల్‌కతా | 495–00 |
| ఢిల్లీ | 485–00 |

# నల్లగొండ కుర్రాడికి మైక్రోసాఫ్ట్ ఆఫర్

## చరిత్ రెడ్డికి రూ.1.54 కోట్ల వార్షిక ప్యాకేజీ


కుటుంబ సభ్యులతో సాయి చరిత్ రెడ్డి

**రామగిరి (నల్లగొండ):** బాంబే ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ అభ్యసిస్తున్న నల్లగొండ కుర్రాడు చింతరెడ్డి సాయి చరిత్‌రెడ్డికి సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చక్కని ఆఫర్ ఇచ్చింది. ఆఖరి సంవత్సరం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో భాగంగా చరిత్‌రెడ్డి రూ.1.54 కోట్ల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాన్ని సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన చరిత్‌రెడ్డి 8వ తరగతి వరకు నల్లగొండలోని స్థానిక సెయింట్ ఆల్ఫోన్స్ స్కూల్లో, తరవాత ఇంటర్ వరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకున్నాడు. ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆలిండియా 51వ ర్యాంకు సాధించి ఐఐటీ సీటు దక్కించుకున్నాడు. చరిత్ రెడ్డి తల్లిదండ్రుల స్వస్థలం మాడ్గులపల్లి మండలం ధర్మాపురం. తండ్రి సైదిరెడ్డి ఎంపీటీసీగా, తల్లి నాగసీత సర్పంచ్‌గా గతంలో పనిచేశారు. ప్రస్తుతం నల్లగొండలో ఉంటున్నారు. విశేషమేంటంటే తండ్రి సైదిరెడ్డి కూడా బీటెక్ చేశారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయం బాట పట్టారు. తనయుల్లో పెద్దవాడైన సాయి చరిత్... తండ్రి ఆశయాలకు అనుగుణంగా చదివి మైక్రోసాఫ్ట్ ఆఫర్ దక్కించుకున్నాడు.

**కంప్యూటర్ సైన్స్ అంటే ఇష్టం**

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎంపికయిన నేపథ్యంలో బుధవారం చరిత్‌రెడ్డి నల్లగొండకు చేరుకున్నాడు. తాజా ప్లేస్‌మెంట్స్‌లో మైక్రోసాఫ్ట్‌కు ఎంపికయిన ముగ్గురిలో దక్షిణాదికి చెందినది చరిత్‌రెడ్డి ఒక్కడే. క్యాంపస్‌లో ఓటీపీగా మైక్రోసాఫ్ట్‌లో పనిచేయడం, తద్వారా దాని ప్రాజెక్టుల్లో మంచి ప్రతిభ కనపర్చడం కూడా చరిత్‌కు ఆ సంస్థ నుంచి భారీ ఆఫర్ రావటానికి కారణమైంది. వాషింగ్టన్‌లోని రెడ్‌మండ్ క్యాంపస్‌లో జూలైలో విధుల్లో చేరాల్సి ఉందని ఈ సందర్భంగా చరిత్ చెప్పాడు. ''నా సంతోషాన్ని మా అమ్మానాన్నలతో పంచుకుంటున్నా. నాకు చిన్నప్పటి నుంచీ కంప్యూటర్ సైన్స్ అంటే ఇష్టం దానికి తగ్గట్టే టీచర్ల మార్గదర్శకత్వంలో పక్కా ప్రణాళికతో చదివాను. అమ్మ సహకారం చాలా ఎక్కువ'' అని వ్యాఖ్యానించాడు. చరిత్ తమ్ముడు అజిత్ రెడ్డి ప్రస్తుతం చెన్నై ఐఐటీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

**చాలా ఆనందంగా ఉంది: సైదిరెడ్డి, నాగసీత**

పిల్లలిద్దరూ చదువుల్లో చిన్నప్పటి నుంచీ ఫస్టే. ఇద్దరూ ఐఐటీ స్టూడెంట్స్ కావడం, పెద్ద కుమారుడు భారీ వేతన ప్యాకేజీతో ఉద్యోగం సాధించడం మా అదృష్టంగా భావిస్తున్నాం. బాంబే ఐఐటీలో సీటు వచ్చినప్పుడే మంచి భవిష్యత్ ఉంటుందని ఊహించాం.

# వాణిజ్య ఒప్పంద లాభాలు

- అమెరికా–చైనాల మధ్య దాదాపు ఖరారైన 'తొలి దశ' ఒప్పందం
- దీంతో నష్టాలన్నీ రికవరీ
- 175 పాయింట్ల లాభంతో 40,850కు సెన్సెక్స్
- 49 పాయింట్లు పెరిగి 12,043కు నిఫ్టీ



ఆద్యంతం లాభ, నష్టాల మధ్య కదలాడిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో చివరకు స్టాక్ మార్కెట్ లాభాల్లోనే ముగిసింది. అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఒప్పందం విషయమై వెలువడిన ప్రతికూల, సానుకూల వార్తలు ప్రభావం చూపించాయి. నేటి పాలసీలో ఆర్‌బీఐ కీలక రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించగలదన్న అంచనాలతో బ్యాంక్, వాహన షేర్లు లాభపడటం కలసివచ్చింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 175 పాయింట్లు లాభపడి 40,850 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 49 పాయింట్లు పెరిగి 12,043 పాయింట్ల వద్ద ముగిశాయి. మూడు రోజుల వరుస నష్టాల అనంతరం నిఫ్టీ 12,000 పాయింట్లపైకి ఎగబాకింది.

**411 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్....**

సెన్సెక్స్ నష్టాల్లోనే ఆరంభమైంది. ఆ తర్వాత లాభాల్లోకి వచ్చింది. భారత్ బాండ్ ఈటీఎఫ్‌ను అందుబాటులోకి తెస్తామని కేంద్రం ప్రకటించడంతో మార్కెట్‌పై ఒత్తిడి పెరిగింది. మళ్లీ నష్టాల్లోకి జారిపోయింది. అయితే వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం తొలి దశ ఒప్పందం దాదాపు ఖరారైందని వార్తల కారణంగా నష్టాలన్నీ రికవరీ అయ్యాయి. గత నెలలో సేవల రంగానికి సంబంధించి ఐహెచ్‌ఎస్‌మార్కిట్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 52.7కు చేరడం సానుకూల ప్రభావం చూపించింది. ఒక దశలో 199 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, మరో దశలో 212 పాయింట్లు లాభపడింది. మొత్తం మీద రోజంతా 411 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో, యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి.

➡ ప్రీమియమ్ హ్యాచ్‌బాక్ మోడల్‌ను మార్కెట్లోకి తేవడం, అమెరికాలో నవంబర్ జేఎల్‌ఆర్ అమ్మకాలు పుంజుకోవడం, వాహనాల ధరలను పెంచడం.... ఈ కారణాలతో టాటా మోటార్స్ షేర్ 7 శాతం లాభంతో రూ.169 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభప డిన షేర్ ఇదే. ఇటీవల బాగా పెరిగిన నేపథ్యంలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ సెన్సెక్స్‌లో భారీగా 1.6 శాతం నష్టంతో రూ. 1,553 వద్ద ముగిసింది.

## లాభాల బాటలో వాహన షేర్లు

ఉత్పత్తి వ్యయాలు పెరుగుతుండటంతో వాహనాల ధరలను వాహన కంపెనీలు పెంచుతున్నాయి. దీంతో వాహన షేర్లు 7 శాతం వరకూ లాభపడ్డాయి. టాటా మోటార్స్ 7 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 0.5 శాతం పెరగ్గా, మారుతీ సుజుకీ మాత్రం 1 శాతం మేర నష్టపోయింది.

# హైదరాబాద్‌లో అంతర్జాతీయ బ్రాండ్ల టీవీల అసెంబ్లింగ్

- స్కైక్వాడ్ ఎలక్ట్రానిక్స్ ప్లాంట్లలో తయారీ
- త్వరలో ఇతర ఉపకరణాల రూపకల్పన
- కంపెనీ ఎండీ రమీందర్ సింగ్ సోయిన్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** స్మార్ట్‌ఫోన్ల తయారీలో ఉన్న మోటరోలా, నోకియా, వన్‌ప్లస్ వంటి దిగ్గజ సంస్థలు ఎల్‌ఈడీ టీవీల రంగంలోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. విశేషమేమంటే ఈ కంపెనీల టీవీలు హైదరాబాద్‌లో రూపుదిద్దుకుంటున్నాయి. ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీలో ఉన్న స్కైక్వాడ్ ఇప్పటికే ప్యానాసోనిక్, లాయిడ్ వంటి ఏడు బ్రాండ్ల టీవీలను అసెంబుల్ చేస్తోంది. కంపెనీకి ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని మేడ్చల్, శంషాబాద్ వద్ద ప్లాంట్లున్నాయి. ఏటా 30 లక్షల ఎల్‌ఈడీ టీవీలను రూపొందించే సామర్థ్యం ఉంది. 3,000 మంది ఉద్యోగులు ఉన్నారని కంపెనీ ఎండీ రమీందర్ సింగ్ సోయిన్ సాక్షి బిజినెస్ బ్యూరోకు వెల్లడించారు. అంతర్జాతీయ కంపెనీలకు ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను తయారు చేసి సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. త్వరలో నాలుగు కొత్త బ్రాండ్లు తోడవనున్నాయని వివరించారు.

**రెండో దశలో రూ.1,400 కోట్లు:** స్కైక్వాడ్ భాగస్వామ్యంతో చైనాకు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ స్కైవర్త్ శంషాబాద్ వద్ద 50 ఎకరాల్లో ప్లాంటును నెలకొల్పుతోంది. తొలి దశలో రూ.700 కోట్లు పెట్టుబడి చేస్తున్నారు. ఇరు సంస్థలు కలిసి టీవీలతోపాటు వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్స్, ఏసీలు, రిఫ్రిజిరేటర్లను అసెంబుల్ చేస్తాయని రమీందర్ వెల్లడించారు. 'ఆరు నెలల్లో ఈ ఉత్పత్తుల తయారీ మొదలవుతుంది. కొత్త ప్లాంటు ద్వారా 5,000 మందికి ఉపాధి లభించనుంది. 15–20 శాతం విడిభాగాలు స్థానికంగా తయారవుతున్నాయి. రెండవ దశలో ఇరు సంస్థలు కలిసి రూ.1,400 కోట్ల పెట్టుబడి చేయాలని భావిస్తున్నాం' అని తెలిపారు.

## రాష్ట్రీయం

# అడుగు దూరంలో ఆగిన మృత్యువు!





ఓ వ్యక్తికి ప్రాణగండం తప్పింది. దూసుకొచ్చిన మృత్యువు.. అడుగు దూరంలో ఆగడంతో అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. భూపాలపల్లి ఏరియాలోని ఓసీపీ 2లో పని చేసే కనుగొండ రమేశ్ బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో లారీ వెనుక చక్రాల మధ్య ద్విచక్ర వాహనంతో సహా రమేశ్ ఇరుక్కుపోయాడు. పక్కనే ఉన్న వారు గట్టిగా కేకలు వేయడంతో డ్రైవర్ లారీని ఆపాడు. వెంటనే సమీపాన ఉన్న సింగరేణి రెస్క్యూ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు కట్టర్ల సాయంతో బైక్ కొంత భాగాన్ని కట్ చేసి బయటకు తీశారు. మృత్యువు అడుగు దూరంలో ఆగిపోవడం.. రమేశ్ స్వల్ప గాయంతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

– జి.సంపత్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి

# ఇది కులవివక్ష కాదా?

## కొన్ని వర్గాలకే సత్వర న్యాయం దారుణం: మంద కృష్ణ

**సాక్షి, ఆసిఫాబాద్:** రాష్ట్రంలో జరుగుతున్న అత్యాచారాలు, హత్య కేసుల్లో దళిత మహిళలకు సత్వర న్యాయం జరగడం లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విమర్శించారు. శంషాబాద్‌లో జరిగిన ఘటన కంటే ముందు అనేక మంది దళిత మహిళలు అత్యాచారం, హత్యలకు గురైనా ఎవరూ పెద్దగా స్పందించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆసిఫాబాద్‌లో చేపట్టిన ర్యాలీ, నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. గత నెల 24న ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం ఎల్లాపటార్‌లో దళిత మహిళపై ముగ్గురు యువకులు సామూహికంగా అత్యాచారం చేసి హత్య చేశారని, ఈ ఘటనపై ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఆ తర్వాత జరిగిన శంషాబాద్ ఘటనపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి సత్వర న్యాయం కోసం డిమాండ్లు చేయడం కులవివక్ష కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇక కొందరు నాయకులైతే పార్లమెంటులో చర్చకు పట్టుబడుతున్నారన్నారు. కొన్ని వర్గాలకే న్యాయం చేయాలని కోరడం విడ్డూరమన్నారు.

# కేజీబీవీలో కూలిన మినీ వాటర్ ట్యాంక్

## స్కావెంజర్ మృతి, విద్యార్థులకు తప్పిన ప్రమాదం

**ధన్వాడ:** నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలోని కేజీబీవీలో ఉన్న మినీ వాటర్ ట్యాంక్ కూలి పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్ మృతి చెందింది. ధన్వాడకు చెందిన దాసరి పద్మమ్మ (36) కస్తూర్బా గాంధీ పాఠశాలలో స్కావెంజర్‌గా పని చేస్తోంది. బుధవారం విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేశాక ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా వాటర్ ట్యాంక్ ఆమెపై కూలింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విద్యార్థులు భోజనాలు చేసి ఆ ట్యాంక్ వద్దే ప్లేట్లు శుభ్రం చేసుకుంటారు. ఒక వేళ అరగంట ముందు ఈ ఘటన చోటుచేసుకుని ఉంటే భారీ ప్రమాదం జరిగి ఉండేది.

## సాగుకు అడ్డుపడుతున్నారని..

### రైతు ఆత్మహత్యాయత్నం

**మహబూబాబాద్ రూరల్:** తన భూమిని కొందరు వ్యక్తులు సాగు చేసుకోకుండా అడ్డు పడుతున్నారని మనస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెవు నర్సయ్యకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలం సాయిరెడ్డిపల్లెకు చెందిన బాలు పత్తి మారుబేరం చేస్తుంటాడు. ఇతను ముడుపుగల్‌కు రాగా నర్సయ్యకు పరిచయం అయ్యాడు. మూడేళ్ల క్రితం నర్సయ్యతో పాటు మరో 10 మంది రైతుల నుంచి రూ.7.50 లక్షల విలువైన పత్తిని బాలు కొనుగోలు చేసి డబ్బులు ఎగ్గొట్టి వెళ్లగా.. బాధిత రైతులంతా మహబూబాబాద్ రూరల్ పోలీసులను ఆశ్రయించారు. కొంత కాలం గడిచాక బాలు ఐపీ పెట్టి ఉడాయించాడు. దీంతో బాలు అడ్రస్ నర్సయ్యకు తెలిసి ఉంటుందని, డబ్బులు ఇప్పించేంత వరకు అతడి భూమిని సాగు చేయకుండా గ్రామస్తులు మూడేళ్లుగా అడ్డుకుంటున్నారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన నర్సయ్య.. ఇంట్లో పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు అతడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


పరీక్ష రాస్తున్న వైరా ఎమ్మెల్యే రాములునాయక్

# పరీక్ష రాసిన ఎమ్మెల్యే రాములు నాయక్

**ఖమ్మంసహకారనగర్:** ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పరీక్ష రాశారు. నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో స్పెల్–1 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పరీక్ష రాయడంతో తోటి విద్యార్థులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఉన్నత చదువులపై ఆసక్తి.. ఎలాగైనా పీజీ సాధించాలనే పట్టుదలతో ఆయన విద్యార్థి అవతారమెత్తారు.


**ఫారం G**
**ఆసక్తి వ్యక్తీకరణకు పిలుపు**
(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్ రప్సీ (ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 36A (1) క్రింద)

**సంబంధిత వివరాలు**

| | | |
|---|---|---|
| 1 | కార్పొరేట్ డెటార్ పేరు | సాయినాథ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ |
| 2 | కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేషన్ తేది | 26 ఆగస్ట్, 1993 |
| 3 | కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేట్ అయిన/ నమోదైన అథారిటీ | ROC-హైదరాబాద్ రిజిస్ట్రేషన్ నం: 16201 |
| 4 | కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్ / లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటిఫికేషన్ నంబర్ | U65993TG1993PTC016201 |
| 5 | కార్పొరేట్ డెటార్ యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రిన్సిపల్ కార్యాలయం చిరునామా (ఏదేని) | నమోదిత కార్యాలయం: 1-8-333 & 334, A-WANE, పోలీస్ లైన్స్ ఎదురుగా, బేగంపేట్, హైదరాబాద్ – 500016 |
| 6 | కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభ తేది | 08 జూలై, 2019 |
| 7 | ఆసక్తి వ్యక్తీకరణకు పిలుపు తేది | 05.12.2019 |
| 8 | కోడ్‌లోని సెక్షన్ 25(2)(h) క్రింద రిజల్యూషన్ దరఖాస్తుదారుల అర్హత లభ్యత | http://www.skilgroupindia.com లేదా వివరాలను irp_sepl@aaip.co.in కు ఇ–మెయిల్ చేయడం ద్వారా పొందవచ్చును |
| 9 | సెక్షన్ 29A క్రింద వర్తించు అనర్హత నిబంధనల లభ్యత: | http://www.skilgroupindia.com లేదా వివరాలను irp_sepl@aaip.co.in కు ఇ–మెయిల్ చేయడం ద్వారా పొందవచ్చును |
| 10 | ఆసక్తి వ్యక్తీకరణ స్వీకరణకు చివరి తేది | 20.12.2019 |
| 11 | కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదారుల తాత్కాలిక జాబితా జారీ తేది | 30.12.2019 |
| 12 | తాత్కాలిక జాబితాకు అభ్యంతరాల దాఖలుకు చివరి తేది | 04.01.2020 |
| 13 | కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదారుల తుది జాబితా జారీ తేది | 14.01.2020 |
| 14 | కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదారులకు సమాచార మెమొరాండం మరియు ఇవాల్యూయేషన్ మాట్రిక్స్ మరియు రిజల్యూషన్ ప్లాన్స్ కోసం అభ్యర్థన జారీ తేది | 04.01.2020 |
| 15 | రిజల్యూషన్ ప్లాన్ కోసం అభ్యర్థన, ఇవాల్యూయేషన్ మ్యాట్రిక్స్, సమాచార మెమొరాండం ("IM") మరియు తదుపరి సమాచారం పొందు విధానం | కాగోరు రిజల్యూషన్ దరఖాస్తుదార్లు irp_sepl@aaip.co.in కు ఇ–మెయిల్ పంపవలసిందిగా కోరబడుచున్నారు. కాన్ఫిడెన్షియాలిటీ అండర్‌టేకింగ్ అమలుచేసిన తరువాత ఇన్‌ఫర్మేషన్ మెమొరాండం, RFRP మరియు ఇవాల్యూయేషన్ మ్యాట్రిక్స్ ఇ–మెయిల్/డేటా ద్వారా ఏర్పాటు చేయబడును. |
| 16 | రిజల్యూషన్ ప్లాన్స్ దాఖలుకు చివరి తేది | 03.02.2020 |
| 17 | రిజల్యూషన్ ప్రొఫెషనల్‌కు రిజల్యూషన్ ప్లాన్స్ దాఖలుచేయు విధానం | రిజల్యూషన్ ప్లాన్ సాఫ్ట్ కాపీని kvsrinivas12@gmail.comకు ఇ–మెయిల్ ద్వారా పంపాలి మరియు హార్డ్ కాపీనిడా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్, రిజల్యూషన్ ప్రొఫెషనల్,4వ అంతస్తు, "కమల టవర్స్", 1–8–304 నుండి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట్, హైదరాబాద్–500003కు మార్క్‌చేసి ప్లెయిన్ సీల్డ్ ఎన్వలప్‌లో పంపాలి |
| 18 | ఆమోదం కోసం అడ్జూడికేటింగ్ అథారిటీకి రిజల్యూషన్ ప్లాన్ దాఖలు చేయాల్సిన అంచనా తేది | 04.03.2020 |
| 19 | రిజల్యూషన్ ప్రొఫెషనల్ పేరు మరియు రిజిస్ట్రేషన్ నంబర్ | డా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్ Reg. No. IBBI/IPA-001/IP-P00520/2017-18/10945 |
| 20 | బోర్డు వద్ద నమోదైన విధంగా రిజల్యూషన్ ప్రొఫెషనల్ పేరు, చిరునామా మరియు ఇమెయిల్ | డా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్, 4వ అంతస్తు, "కమల టవర్స్", 1–8–304 నుండి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట్, హైదరాబాద్–500003, ఇ–మెయిల్: kvsrinivas12@gmail.com |
| 21 | రిజల్యూషన్ ప్రొఫెషనల్‌తో ఉత్తరప్రత్యుత్తరాలకు ఉపయోగించే చిరునామా మరియు ఇమెయిల్ | 1-8-333 & 334, A-WANE, పోలీస్ లైన్స్ ఎదురుగా, బేగంపేట్, హైదరాబాద్ – 500016 ఇ–మెయిల్: irp_sepl@aaip.co.in |
| 22 | తదుపరి వివరాలు లభ్యమవుతాయి | http://www.skilgroupindia.com |
| 23 | ఫారం G ప్రచురణ తేది | 05.12.2019 |

**డా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్**
మెసర్స్ BS లిమిటెడ్ తరపున రిజల్యూషన్ ప్రొఫెషనల్
Reg. No. IBBI/IPA-001/IP-P00520/2017-18/10945
# 4వ అంతస్తు, "కమల టవర్స్", 1–8–304 నుండి 307,
పాటిగడ్డ రోడ్, బేగంపేట్, హైదరాబాద్–500003,
ఇ–మెయిల్ ఐడి: kvsrinivas12@gmail.com,irp_sepl@aaip.co.in

**తేది: 04.12.2019**
**ప్రదేశం: హైదరాబాద్**



**Mineral Exploration Research & Innovation Trust (MERIT) Government of Andhra Pradesh**
Sri Anjaneya Towers, Ibrahimpatnam, Vijayawada, Andhra Pradesh-521456.
Telephone: 0866-2882234; E-mail: ceo.merit@gmail.com

**Notice for invitation of bids to Select Exploration Agencies for G-3/ G-4 Level Exploration of Mineral Blocks in Andhra Pradesh**

Mineral Exploration Research & Innovation Trust (MERIT), Government of Andhra Pradesh has identified 8 Manganese blocks for the purpose of conducting G-3/ G-4 level Mineral Exploration with a provision to take up G-2 level exploration in continuation.
Interested bidders are requested to refer the detailed notice available at **https://tender.apeprocurement.gov.in/login.html**

**Sd/- P.Raja Babu**
**Chief Executive Officer, MERIT, GoAP**
DIPR.Ro.No. 253-PP/CL/ADVT/1/1/2019-20, Dt: 04.12.2019



**ఫారం ఎ**
**బహిరంగ ప్రకటన**
(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్ రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 6 క్రింద) **మీనా జ్యూయలర్స్ & డైమండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క క్రెడిటార్స్‌కు గమనిక నిమిత్తం**

**సంబంధిత వివరాలు**

| | | |
|---|---|---|
| 1 | కార్పొరేట్ డెటార్ పేరు | మీనా జ్యూయలర్స్ & డైమండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ |
| 2 | కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేషన్ తేది | 25 ఫిబ్రవరి, 2010 |
| 3 | కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేట్ అయిన/నమోదైన అథారిటీ | ROC హైదరాబాద్ |
| 4 | కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ ఐడెంటిటీ నంబరు/ లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటిఫికేషన్ నంబరు | U28990TG2010PTC067237 |
| 5 | కార్పొరేట్ డెటార్ యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రిన్సిపల్ ఆఫీస్ (ఏదైనా ఉంటే) దాని చిరునామా | 5-9-58/1-15, షాప్ నంబరు 63, బాబూఖాన్ ఎస్టేట్, బషీర్‌బాగ్, హైదరాబాద్ TG - 500029 IN |
| 6 | కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభతేది | 26-11-2019 (ఆర్డర్ కాపీ 03-12-2019న సిద్ధం చేయబడినది |
| 7 | ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రాసెస్ మూసివేయబడే అంచనా తేది | 23–05–2020 |
| 8 | ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌గా పనిచేస్తున్న ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ పేరు మరియు రిజిస్ట్రేషన్ నం. | డా. K.V. శ్రీనివాస్ IBBI/ IPA-001/ IP-P00520/2017-18/10945 |
| 9 | బోర్డ్ వద్ద నమోదైన విధంగా ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ చిరునామా మరియు e–మెయిల్ | కమల టవర్, 4వ అంతస్తు, 1–8–304 నుంచి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట, హైదరాబాద్ – 500017 ఫోన్ :+91 8309310156, 9959223615 e–మెయిల్ – kvsrinivas12@gmail.com |
| 10 | ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉపయోగించే చిరునామా మరియు e–మెయిల్ | కమల టవర్, 4వ అంతస్తు, 1–8–304 నుంచి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట, హైదరాబాద్ – 500017 e–మెయిల్ – irp_meena@aaip.co.in |
| 11 | క్లెయిమ్‌ల దాఖలుకు ఆఖరుతేది | 17–12–2019 |
| 12 | ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌చే నిశ్చయించిన, సెక్షన్ 21లోని ఉప సెక్షను (6A) లోని క్లాజ్ (b) క్రింద క్రెడిటార్లు ఎవరైనా ఉంటే వారి క్లాస్‌లు | వర్తించదు |
| 13 | ఒక క్లాస్‌లో క్రెడిటార్ల యొక్క అధీకృత ప్రతినిధిగా పనిచేయడానికి గుర్తించబడిన ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ పేర్లు (ప్రతీ క్లాస్‌లో మూడుపేర్లు) | వర్తించదు |
| 14 | (a) సంబంధిత ఫారాలు మరియు (b) అధీకృత ప్రతినిధుల వివరాలు లభ్యత | వెబ్‌లింక్: https://www.ibbi.gov.in/home/download వర్తించదు |

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వారు **మెసర్స్ మీనా జ్యూయలర్స్ & డైమండ్స్ ప్రైవేట్ లిమిటెడ్** యొక్క కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రాసెస్ 26–11–2019న (03–12–2019న ఆర్డర్ కాపీ సిద్ధం చేయబడింది) ప్రారంభానికి ఆదేశించారని ఇందుమూలంగా తెలియచేయడమైనది.
**మెసర్స్ మీనా జ్యూయలర్స్ & డైమండ్స్ ప్రైవేట్ లిమిటెడ్** యొక్క క్రెడిటార్లు రుజువుతో తమ క్లెయిమ్‌లను 17–12–2019న లేదా ఆలోగా ఎంట్రీ నంబరు 10కి ఎదురుగా తెలిపిన చిరునామాలో గల ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌కు దాఖలు చేయవలసిందిగా కోరబడుచున్నారు.
ఫైనాన్షియల్ క్రెడిటార్లు తమ క్లెయిమ్‌లను రుజువుతో ఎలక్ట్రానిక్ పద్ధతుల ద్వారా మాత్రమే దాఖలు చేయాలి. ఇతర క్రెడిటార్లు అందరూ స్వయంగా, పోస్టుద్వారా లేదా ఎలక్ట్రానిక్ పద్ధతుల ద్వారా రుజువుతో క్లెయిమ్‌లను దాఖలు చేయవచ్చును.
ఎంట్రీ నంబరు 12కు ఎదురుగా తెలిపిన విధంగా ఒక క్లాసుకు చెందిన ఫైనాన్షియల్ క్రెడిటార్ ఫారం CA లో క్లాస్ (వర్తించదు) యొక్క అధీకృత ప్రతినిధిగా పనిచేయడానికి ఎంట్రీనంబరు 13 ఎదురుగా తెలిపిన ముగ్గురు ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ నుంచి తమ అధీకృత ప్రతినిధి యొక్క ఎంపికను సూచించవలెను.
తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే క్లెయిమ్ రుజువులు దాఖలు చేస్తే పెనాల్టీలు విధించబడును.

**తేది:04-12-2019**
**ప్రదేశం: హైదరాబాద్**
ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ పేరు మరియు సంతకం:
సం/– డా.కె.వి. శ్రీనివాస్
ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్



**ఫారం ఎ**
**బహిరంగ ప్రకటన**
(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్ రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 6 క్రింద) **మీనా జ్యూయలర్స్ ఎక్స్‌క్లూజివ్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క క్రెడిటార్స్‌కు గమనిక నిమిత్తం**

**సంబంధిత వివరాలు**

| | | |
|---|---|---|
| 1 | కార్పొరేట్ డెటార్ పేరు | మీనా జ్యూయలర్స్ ఎక్స్‌క్లూజివ్ ప్రైవేట్ లిమిటెడ్ |
| 2 | కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేషన్ తేది | 17 నవంబర్, 2009 |
| 3 | కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేట్ అయిన/నమోదైన అథారిటీ | ROC హైదరాబాద్ |
| 4 | కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ ఐడెంటిటీ నంబరు/ లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటిఫికేషన్ నంబరు | U28121TG2009PTC065854 |
| 5 | కార్పొరేట్ డెటార్ యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రిన్సిపల్ ఆఫీస్ (ఏదైనా ఉంటే) దాని చిరునామా | 5-9-58/1-15, షాప్ నంబరు 63, బాబూఖాన్ ఎస్టేట్, బషీర్‌బాగ్, హైదరాబాద్ TG - 500029 IN |
| 6 | కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభతేది | 26-11-2019 (ఆర్డర్ కాపీ 03-12-2019న సిద్ధం చేయబడింది) |
| 7 | ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రాసెస్ మూసివేయబడే అంచనా తేది | 23–05–2020 |
| 8 | ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌గా పనిచేస్తున్న ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ పేరు మరియు రిజిస్ట్రేషన్ నం. | డా. K.V. శ్రీనివాస్ IBBI/ IPA-001/ IP-P00520/2017-18/10945 |
| 9 | బోర్డ్ వద్ద నమోదైన విధంగా ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ చిరునామా మరియు e–మెయిల్ | కమల టవర్, 4వ అంతస్తు, 1–8–304 నుంచి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట, హైదరాబాద్ – 500017 ఫోన్ :+91 8309310156, 9959223615 e–మెయిల్ – kvsrinivas12@gmail.com |
| 10 | ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉపయోగించే చిరునామా మరియు e–మెయిల్ | కమల టవర్, 4వ అంతస్తు, 1–8–304 నుంచి 307, పాటిగడ్డ రోడ్, బేగంపేట, హైదరాబాద్ – 500017 e–మెయిల్ – irp_meena@aaip.co.in |
| 11 | క్లెయిమ్‌ల దాఖలుకు ఆఖరుతేది | 17–12–2019 |
| 12 | ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌చే నిశ్చయించిన, సెక్షన్ 21లోని ఉప సెక్షను (6A) లోని క్లాజ్ (b) క్రింద క్రెడిటార్లు ఎవరైనా ఉంటే వారి క్లాస్‌లు | వర్తించదు |
| 13 | ఒక క్లాస్‌లో క్రెడిటార్ల యొక్క అధీకృత ప్రతినిధిగా పనిచేయడానికి గుర్తించబడిన ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ పేర్లు (ప్రతీ క్లాస్‌లో మూడుపేర్లు) | వర్తించదు |
| 14 | (a) సంబంధిత ఫారాలు మరియు (b) అధీకృత ప్రతినిధుల వివరాల లభ్యత | వెబ్‌లింక్: https://www.ibbi.gov.in/home/download వర్తించదు |

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వారు **మెసర్స్ మీనా జ్యూయలర్స్ ఎక్స్‌క్లూజివ్ ప్రైవేట్ లిమిటెడ్** యొక్క కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రాసెస్ 26–11–2019న (03–12–2019న ఆర్డర్ కాపీ సిద్ధం చేయబడింది) ప్రారంభానికి ఆదేశించారని ఇందుమూలంగా తెలియచేయడమైనది.
**మెసర్స్ మీనా జ్యూయలర్స్ ఎక్స్‌క్లూజివ్ ప్రైవేట్ లిమిటెడ్** యొక్క క్రెడిటార్లు రుజువుతో తమ క్లెయిమ్‌లను 17–12–2019న లేదా ఆలోగా ఎంట్రీ నంబరు 10కు ఎదురుగా తెలిపిన చిరునామాలో గల ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌కు దాఖలు చేయవలసిందిగా కోరబడుచున్నారు.
ఫైనాన్షియల్ క్రెడిటార్లు తమ క్లెయిమ్‌లను రుజువుతో ఎలక్ట్రానిక్ పద్ధతుల ద్వారా మాత్రమే దాఖలు చేయాలి. ఇతర క్రెడిటార్లు అందరూ స్వయంగా, పోస్టుద్వారా లేదా ఎలక్ట్రానిక్ పద్ధతుల ద్వారా రుజువుతో క్లెయిమ్‌లను దాఖలు చేయవచ్చును. ఎంట్రీ నంబరు 12కు ఎదురుగా తెలిపిన విధంగా ఒక క్లాసుకు చెందిన ఫైనాన్షియల్ క్రెడిటార్ ఫారం CAలో క్లాస్ (వర్తించదు) యొక్క అధీకృత ప్రతినిధిగా పనిచేయడానికి ఎంట్రీనంబరు 13కు ఎదురుగా తెలిపిన ముగ్గురు ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ నుంచి తమ అధీకృత ప్రతినిధి యొక్క ఎంపికను సూచించవలెను.
తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే క్లెయిమ్ రుజువులు దాఖలు చేస్తే పెనాల్టీలు విధించబడును.

**తేది:04-12-2019**
**ప్రదేశం: హైదరాబాద్**
ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ పేరు మరియు సంతకం:
సం/– డా.కె.వి. శ్రీనివాస్
ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్



**ఫారం ఎ**
**బహిరంగ ప్రకటన**
(ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్ రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 6 క్రింద) **మీనా జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క క్రెడిటార్స్‌కు గమనిక నిమిత్తం**

**సంబంధిత వివరాలు**

| | | |
|---|---|---|
| 1 | కార్పొరేట్ డెటార్ పేరు | మీనా జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ |
| 2 | కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేషన్ తేది | 30 సెప్టెంబర్, 2015 |
| 3 | కార్పొరేట్ డెటార్ ఇన్‌కార్పొరేట్ అయిన/నమోదైన అథారిటీ | ROC హైదరాబాద్ |
| 4 | కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ ఐడెంటిటీ నంబరు/ లిమిటెడ్ లయబిలిటీ ఐడెంటిఫికేషన్ నంబరు | U74900TG2007PTC054432 |
| 5 | కార్పొరేట్ డెటార్ యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రిన్సిపల్ ఆఫీస్ (ఏదైనా ఉంటే) దాని చిరునామా | 5-9-58/1-15, షాప్ నంబరు 201/A, బాబూఖాన్ ఎస్టేట్, బషీర్‌బాగ్, హైదరాబాద్ TG - 500029 IN |
| 6 | కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభతేది | 26-11-2019 (ఆర్డర్ కాపీ 03-12-2019న సిద్ధం చేయబడింది) |
| 7 | ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రాసెస్ మూసివేయబడే అంచనా తేది | 23–05–2020 |
| 8 | ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌గా పనిచేస్తున్న ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ పేరు మరియు రిజిస్ట్రేషన్ నం. | డా. K.V. శ్రీనివాస్ IBBI/ IPA-001/ IP-P00520/2017-18/10945 |
| 9 | బోర్డ్ వద్ద నమోదైన విధంగా ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ చిరునామా మరియు e–మెయిల్ | కమల టవర్, 4వ అంతస్తు, 1–8–304 నుంచి 307 పాటిగడ్డ రోడ్, బేగంపేట, హైదరాబాద్ – 500017 ఫోన్ :+91 8309310156, 9959223615 e–మెయిల్ – kvsrinivas12@gmail.com |
| 10 | ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉపయోగించే చిరునామా మరియు e–మెయిల్ | కమల టవర్, 4వ అంతస్తు, 1–8–304 నుంచి 307 పాటిగడ్డ రోడ్, బేగంపేట, హైదరాబాద్ – 500017 e–మెయిల్ – irp_meena@aaip.co.in |
| 11 | క్లెయిమ్‌ల దాఖలుకు ఆఖరుతేది | 17–12–2019 |
| 12 | ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌చే నిశ్చయించిన, సెక్షన్ 21లోని ఉప సెక్షను (6A) లోని క్లాజ్ (b) క్రింద క్రెడిటార్లు ఎవరైనా ఉంటే వారి క్లాస్‌లు | వర్తించదు |
| 13 | ఒక క్లాస్‌లో క్రెడిటార్ల యొక్క అధీకృత ప్రతినిధిగా పనిచేయడానికి గుర్తించబడిన ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ పేర్లు (ప్రతీ క్లాస్‌లో మూడుపేర్లు) | వర్తించదు |
| 14 | (a) సంబంధిత ఫారాలు మరియు (b) అధీకృత ప్రతినిధుల వివరాల లభ్యత | వెబ్‌లింక్: https://www.ibbi.gov.in/home/download వర్తించదు |

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ వారు **మీనా జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్** యొక్క కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రాసెస్ 26–11–2019న (03–12–2019న కాపీ సిద్ధం చేయబడింది) ప్రారంభానికి ఆదేశించారని ఇందుమూలంగా తెలియచేయడమైనది.
**మీనా జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్** యొక్క క్రెడిటార్లు రుజువుతో తమ క్లెయిమ్‌లను 17–12–2019న లేదా ఆలోగా ఎంట్రీ నంబరు 10కి ఎదురుగా తెలిపిన చిరునామాలో గల ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్‌కు దాఖలు చేయవలసిందిగా కోరబడుచున్నారు.
ఫైనాన్షియల్ క్రెడిటార్లు తమ క్లెయిమ్‌లను రుజువుతో ఎలక్ట్రానిక్ పద్ధతుల ద్వారా మాత్రమే దాఖలు చేయాలి. ఇతర క్రెడిటార్లు అందరూ స్వయంగా, పోస్టుద్వారా లేదా ఎలక్ట్రానిక్ పద్ధతుల ద్వారా రుజువుతో క్లెయిమ్‌లను దాఖలు చేయవచ్చును. ఎంట్రీ నంబరు 12కు ఎదురుగా తెలిపిన విధంగా ఒక క్లాసుకు చెందిన ఫైనాన్షియల్ క్రెడిటార్ ఫారం CA లో క్లాస్ NA యొక్క అధీకృత ప్రతినిధిగా పనిచేయడానికి ఎంట్రీనంబరు 13కు ఎదురుగా తెలిపిన ముగ్గురు ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ నుంచి తమ అధీకృత ప్రతినిధి యొక్క ఎంపికను సూచించవలెను.
తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే క్లెయిమ్ రుజువులు దాఖలు చేస్తే పెనాల్టీలు విధించబడును.

**తేది:04-12-2019**
**ప్రదేశం: హైదరాబాద్**
ఇంటెరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్ పేరు మరియు సంతకం:
సం/– డా.కె.వి. శ్రీనివాస్
ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్


హైదరాబాద్‌లోని దుర్గం చెరువుపై దాదాపు పూర్తి కావస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జి

## క్లుప్తంగా...

### ఎమ్మెల్యేలకు పదవుల కోసం
## చట్ట సవరణ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని 28 కార్పొరేషన్ల పదవులను లాభదాయక పదవుల పరిధి నుంచి ప్రభుత్వం తొలగించింది. ఈమేరకు జీతాలు, పెన్షన్ల చెల్లింపు, అనర్హతల తొలగింపు చట్టాన్ని సవరిస్తూ బుధవారం రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి సంతోష్‌రెడ్డి అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు కార్పొరేషన్ల పదవులు అప్పగించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అయితే ద్వంద్వ పదవులు కలిగి ఉన్న ప్రజా ప్రతినిధులపై అనర్హత వేటు వేయాలని లాభదాయక పదవుల నిబంధనల్లో ఉంది. దీంతో లాభదాయక పదవుల పరిధి నుంచి కార్పొరేషన్లను తొలగిస్తూ సర్కార్ తాజాగా ఆర్డినెన్స్ జారీ చేసింది.


పురస్కారాన్ని అందుకుంటున్న జయేశ్ రంజన్

### జయేశ్ రంజన్‌కు స్వీడన్ పురస్కారం

**సాక్షి, హైదరాబాద్:** స్వీడన్‌తో ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేయడంలో చేసిన కృషికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ 'రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్' అవార్డును అందుకున్నారు. ఢిల్లీలోని స్వీడన్ రాయబార కార్యాలయంలో స్వీడన్ రాజు కార్ల్ గుస్తాఫ్, రాణి సిల్వియా బుధవారం జయేశ్‌కు ఈ అవార్డును అందజేశారు. నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ అవార్డును స్వీడన్ దేశ ప్రయోజనాలకు తోడ్పడే వారికి అందజేస్తారు. ఐకియా స్టోర్‌తో పాటు, ఇటీవలి కాలంలో తెలంగాణలో పలు రంగాల్లో స్వీడన్ పెట్టుబడులు వచ్చాయి. ప్రతిష్టాత్మక రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్‌ను అందుకున్న జయేశ్ రంజన్‌ను మంత్రి కేటీఆర్ అభినందించారు.

### పోలీసు భద్రత కల్పించండి:ఎన్‌హెచ్‌ఏఐ

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ రహదారులపై టోల్‌ప్లాజాల వద్ద ఫాస్టాగ్ పద్ధతిని అవలంభించనున్నందున కొద్ది రోజులపాటు భద్రత ఏర్పాటు చేయాల్సిందిగా ఎన్‌హెచ్‌ఏఐ పోలీసు శాఖను కోరింది. డిసెంబర్ 1 నుంచి అమలులోకి రావాల్సిన ఫాస్టాగ్ విధానాన్ని కేంద్రం డిసెంబర్ 15 వరకు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఇప్పటికీ చాలా మంది వాహనదారుల్లో ఫాస్టాగ్‌పై అవగాహన రాలేదు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 22 వేల మందే ట్యాగ్‌లు కొనుగోలు చేశారు. కొత్త విధానం అమల్లోకి వచ్చాక టోల్ ప్లాజాల వద్ద గందరగోళం ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 17 టోల్ ప్లాజాల వద్ద భద్రత ఏర్పాటు చేయాల్సిందిగా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పోలీసు శాఖను కోరారు.

### బీబీనగర్ ఎయిమ్స్‌కు గెజిట్ నోటిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** బీబీనగర్‌లో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్రం బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి. కేంద్రం కూడా బడ్జెట్లో నిధులు కేటాయించింది. అయినా ఇప్పటివరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల కాలేదు. గెజిట్ నోటిఫికేషన్ విడుదలైనట్లు వైద్య, ఆరోగ్య మంత్రి ఈటల రాజేందర్ ఓ ప్రకటనలో తెలిపారు.

### ఒడిశా సెంట్రల్ వర్సిటీ వీసీగా ప్రొ.రామబ్రహ్మం


**హైదరాబాద్:** ఒడిశాలోని సెంట్రల్ యూనివర్సిటీ వీసీగా హెచ్‌సీయూ విశ్రాంత ప్రొఫెసర్ ఐ.రామబ్రహ్మం నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర మానవ వనరుల శాఖ మంగళవారం ఉత్తుర్వులు జారీ చేసిందని హెచ్‌సీయూ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 5 ఏళ్ల వరకు వీసీగా కొనసాగుతారు. హెచ్‌సీయూలో ఎంఏ పొలిటికల్ సైన్స్, ఆంధ్రా వర్సిటీ నుంచి ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేశారు.

## దోమను చూస్తే... ఇంకా దడదడే!

### మలేరియా.. కేసులు తగ్గుతున్నా.. ఇప్పటికీ ఆగ్నేయాసియాలో తొలి స్థానంలో భారత్

దేశంలో మలేరియా కేసుల నమోదులో గణనీయ తగ్గుదల కనిపిస్తున్నా.. ఇప్పటికీ ఆగ్నేయాసియాలో మొదటి స్థానంలో మనమే ఉండటం కలవరపరుస్తోంది. అలాగే ప్రపంచంలోనూ ఆఫ్రికా దేశాల సరసన నిలబడి 11వ స్థానంలో భారత్ ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయాన్ని ప్రపంచ మలేరియా నివేదిక–2019 స్పష్టం చేసింది. బుధవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ నివేదికను విడుదల చేసింది. ఆగ్నేయాసియాలో 11 దేశాలుంటే, వాటిల్లో కేవలం 3 దేశాల్లోనే 98 శాతం మలేరియా కేసులు నమోదయ్యాయి. అందులో భారత్‌లోనే ఎక్కువగా 58 శాతం కేసులు నమోదవగా.. ఇండోనేసియాలో 30 శాతం, మయన్మార్‌లో 10 శాతం కేసులు నమోదయ్యాయి. అలాగే మలేరియా మరణాలు సైతం భారత్‌లోనే ఎక్కువగా నమోదవుతుండటం ఆందోళన కలిగించే అంశం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 85 శాతం మలేరియా కేసులు 19 దేశాల్లోనే నమోదవుతున్నాయి.

– సాక్షి, హైదరాబాద్




### ఐదేళ్లలో భారత్‌లో తగ్గుముఖం..

2020 నాటికి మలేరియా కేసుల సంఖ్యను 40 శాతం కంటే ఎక్కువగా తగ్గించాలని, 2030 నాటికి మలేరియాను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ అన్ని దేశాలకు మార్గనిర్దేశనం చేసింది. ఆ లక్ష్యాలను చేరుకోవడంలో భారత్ ముందుకు సాగుతోందని, సాపేక్షికంగా చూస్తే మలేరియా కేసులు గణనీయంగా తగ్గినట్లు నివేదిక తెలిపింది. 2014లో భారత్‌లో 11.02 లక్షల మలేరియా కేసులు నమోదు కాగా, 562 మంది చనిపోయారు. అయితే తర్వాత మలేరియా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2018లో మలేరియా కేసుల సంఖ్య ఏకంగా 3.99 లక్షలకు తగ్గింది. మరణాల సంఖ్య కూడా 85కు పడిపోయింది. ఈ వివరాలను ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలోనూ వెల్లడించింది. ఇదిలావుండగా తెలంగాణ రాష్ట్రంలోనూ మలేరియా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2014లో 5,189 కేసులు నమోదయ్యాయి. అయితే ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి తెలంగాణలో 1,327 మలేరియా కేసులే నమోదయ్యాయి.



### 38 దేశాలు మలేరియా రహితం..

**మన** పక్కనే ఉన్న మాల్దీవులు, శ్రీలంక దేశాలు మలేరియా రహితంగా కొనసాగుతున్నాయి. మొత్తం 38 దేశాలు మలేరియా రహితమని ధ్రువీకరించడం గమనార్హం. ఇక 2018లో 27 దేశాల్లో 100 కంటే తక్కువ మలేరియా కేసులున్నట్లు తేలింది. ప్రపంచంలో గతేడాది ఏకంగా 4.05 లక్షల మంది మలేరియా కారణంగా మరణించారని నివేదిక తెలిపింది. అందులో 2.72 లక్షల (67%) మంది ఐదేళ్ల పిల్లలే కావడం గమనార్హం. ఈ మరణాల్లో 85 శాతం భారత్ సహా ఆఫ్రికన్ ప్రాంతంలోనే సంభవించడంపై విచారం వ్యక్తమవుతోంది. ప్రపంచంలో మలేరియాను ఎదుర్కోవాలన్న సవాల్‌లో పురోగతి మందగించిందని ప్రపంచ మలేరియా నివేదిక వ్యాఖ్యానించింది.

### వెయ్యిలో 57 మందికి..

2010–18 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా మలేరియా తీవ్రత తగ్గిందని ప్రపంచ మలేరియా నివేదిక తెలిపింది. 2010లో ప్రతీ వెయ్యిలో 71 మంది మలేరియాకు గురికాగా, 2018లో ఆ సంఖ్య 57 కేసులకు పడిపోయింది. ఏదేమైనా 2014–2018 వరకు మలేరియా వ్యాప్తి రేటు గణనీయంగా తగ్గింది. గర్భిణీలు, పిల్లలు ఎక్కువగా మలేరియా బారిన పడుతున్నారు. వీరిపై దృష్టి పెట్టకపోతే ఎటువంటి పురోగతి సాధించలేమని మలేరియా నివేదిక తెలిపింది.

## రైలుకు ర్యాట్ సిగ్నల్

**సాక్షి, హైదరాబాద్:** ఎలుక... ఇప్పుడు రైల్వే శాఖను గడగడలాడిస్తోంది. సిగ్నల్ లేకుండా రైలు ముందుకు కదిలితే ప్రమాదం ఎలా పొంచి ఉందో, ఎలుకల గుంపుతోనూ అలాంటి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు. దీంతో రైల్వే యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలుకల రూపంలో ఎదురయ్యే ప్రమాదానికి అడ్డుకట్ట వేయడానికి కసరత్తు ప్రారంభించింది. ఆ కసరత్తు ఖరీదు ఎంతో తెలుసా...

**ఏకంగా రూ. 228 కోట్లు.**

రైలు పట్టాల కింద పందికొక్కుల సైజులో ఉండే ఎలుకలు అటూఇటూ పరుగులు పెడుతుంటాయి. ప్రయాణికులు పట్టాలపైకి విసిరేసే మిగిలిపోయిన చిరుతిండి, కప్పుల్లో మిగిలిపోయిన టీ, కాఫీ చుక్కల కోసం అవి కలియబడుతుంటాయి. ఒకటి కాదు రెండు కాదు, ఒక్కో ప్లాట్‌ఫామ్ వద్ద అవి వందల్లో కనిపిస్తాయి. పట్టాలకు అటూఇటూ పెద్దపెద్ద బొరియలు చేసుకుని వాటిల్లోనే ఉంటాయి. ఇప్పుడు ఆ బొరియలే రైళ్లకు చిక్కులు తెస్తున్నాయి. బొరియల కారణంగా పట్టాల దిగువన నేల గుల్లబారి భూమి దిగబడే పరిస్థితి నెలకొంది. దీనివల్ల రైలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్‌లో భాగంగా స్వచ్ఛ రైల్వే కార్యక్రమాన్ని కూడా ముమ్మరంగా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పరిశుభ్ర కార్యక్రమాలు చేపట్టే క్రమంలో ఎలుకల వల్ల ముప్పు పొంచి ఉన్న విషయాన్ని అధికారులు గుర్తించారు. అందుకు పరిష్కారంగా భారీ కాంక్రీట్ బెడ్‌లు నిర్మించాలని రైల్వే అధికారులు నిర్ణయించి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. రైళ్ల గమనాన్ని మార్చి మరీ పనులు చేస్తున్నారు.

**ఒక్కో ప్లాట్‌ఫామ్‌కోసం రూ. 3 కోట్ల ఖర్చు**

గతంలో పట్టాల కింద స్లీపర్స్... వాటి కింద మామూలు నేలనే ఉండేది. ఒక దశాబ్దం క్రితం నుంచి సిమెంటు పూత వేయటం ప్రారంభించారు. అయితే ఆ సిమెంట్‌పూత ఎలుకల తాకిడికి తట్టుకోలేకపోతోంది. తాజాగా వాటి స్థానంలో భారీ కాంక్రీట్ బెడ్ నిర్మిస్తున్నారు. ప్లాట్‌ఫామ్‌కు 500 మీటర్ల మేర వీటిని నిర్మిస్తున్నారు. చాలా మందంగా ఈ బెడ్ వేసిన తర్వాత దానిపై ట్రాక్‌ను బిగిస్తున్నారు. ట్రాక్ ప్రాంతాన్ని శుభ్రం చేసిన తర్వాత ఆ నీళ్లు వెళ్లేందుకు ఓ పక్కన ప్రత్యేక డ్రెయిన్ నిర్మిస్తున్నారు. ఈ బెడ్ నిర్మాణానికి మీటరుకు రూ.60 వేల నుంచి రూ.65 వేల వరకు ఖర్చవుతోంది. వెరసి ఒక ప్లాట్‌ఫామ్ వద్ద బెడ్ నిర్మాణానికి దాదాపు రూ.3 కోట్లు ఖర్చవుతోంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 34 స్టేషన్‌లలో 76 ప్లాట్‌ఫామ్స్ వద్ద పనులు పూర్తవుతున్నాయి.

**రైలు పట్టాల కింద వందలు వేలల్లో సంచారం**
- చుట్టూ బొరియలు ఏర్పడటంతో పట్టాలు దిగబడే ప్రమాదం
- పట్టాల దిగువన కాంక్రీట్ బెడ్ల నిర్మాణం చేయాలని యోచన



**పరిశుభ్రతే లక్ష్యం**

**స్వ**చ్ఛ రైల్వేలో భాగంగా అన్ని స్టేషన్లు పరిశుభ్రంగా ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గతంలో రైల్వే అధికారులను గట్టిగా ఆదేశించారు. దీంతో అధికారులు ఆ పనులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎలుకలు ఎక్కువగా ఉండి, మట్టి తోడి చిందరవందర చేయటంతో పరిశుభ్రత పనులు సాధ్యం కావటం లేదు. నీటితో శుభ్రం చేసినా మళ్లీ ఎలుకలు చిందరవందర చేస్తున్నాయి. కడిగిన నీళ్లు బొరియల్లోకి చేరిపోతున్నాయి. అలా కాకుండా ఆ నీళ్లు సాఫీగా ముందుకు వెళ్లాలంటే డ్రెయిన్‌లు ఉండాలి. ఇలా అన్నింటికి కలిసి వచ్చేలా ఈ పనులు చేపట్టారు.

## అంచనాలు మించిన ఆదాయం

- సగటున 22 శాతం పెరిగినట్టు ఆర్టీసీ ప్రాథమిక అంచనా
- ఇదే స్థిరపడితే రోజువారీ పెరగనున్న మొత్తం రూ.2 కోట్లు

**సాక్షి, హైదరాబాద్:** చార్జీల పెంపుదల ఆర్టీసీలో ఆశలు రేకెత్తిస్తోంది. కొన్నేళ్లుగా తీవ్ర నష్టాలతో కునారిల్లుతున్న ఆర్టీసీ, ఇప్పుడు చార్జీల పెంపుతో వచ్చే అదనపు ఆదాయంతో గట్టునపడొచ్చన్న నమ్మకం వ్యక్తమవుతోంది. మంగళవారం తొలి షిఫ్ట్ నుంచి కొత్త చార్జీలు అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. కిలోమీటరుకు 20 పైసలు చొప్పున పెరగగా, తొలిరోజు అందిన ప్రాథమిక లెక్కల ప్రకారం ఆదాయం 22 శాతాన్ని మించి ఉన్నట్టుగా తెలుస్తోంది. మరో రెండు రోజులు చూస్తేగానీ కచ్చితమైన వివరాలు అందవని పేర్కొంటున్న అధికారులు, తొలి రోజు మాత్రం అంచనాకు మించి ఆదాయం ఉన్నట్టుగా గుర్తించామంటున్నారు. నగరంలో అది 25 శాతంగా ఉండగా, జిల్లాల్లో 20 శాతాన్ని మించి ఉందని అంటున్నారు. వెరసి రోజువారి ఆదాయంలో కనీసం రూ.2 కోట్లు చొప్పున పెరిగే అవకాశం కనిపిస్తోంది. త్వరలో బస్సుల షెడ్యూల్ మార్చడం, కార్మికుల డ్యూటీ సమయాలను సవరించటం వల్ల పనితీరు మెరుగుపడి ఆక్యుపెన్సీ రేషియో పెరుగుతుందని, దీనివల్ల ఆదాయం మరింత పెరుగుతుందని వారు అంటున్నారు. నగరంలో ప్రస్తుతం డ్రైవర్లు, కండక్టర్లు ఒక షిఫ్ట్‌లో 6.50 గంటల మేర పనిచేస్తున్నారు. మరో 40 నిమిషాలు డ్యూటీ బాధ్యతలు తీసుకోవటం, అప్పగించటం (చేంజ్ ఓవర్)గా ఉంటోంది. ఇప్పుడు ఈ సమయాన్ని తగ్గించటంతోపాటు అసలు డ్యూటీ సమయం 7.20 గంటలకు పెంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఉత్పాదకత పెరిగి కి.మీ.కు ఆదాయం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

## సమ్మె వదిలి.. డ్యూటీ చేపట్టి..

- విధుల్లోకి జేఏసీ నేతలు
- ముగ్గురు కో–కన్వీనర్లు పనుల్లోకి
- నేడు అశ్వత్థామరెడ్డి చేరిక?

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో సుదీర్ఘ కాలం కొనసాగిన సమ్మెగా రికార్డుల్లోకెక్కిన ఆర్టీసీ కార్మికుల ఆందోళనలను ముందుండి నడిపిన కార్మిక సంఘాల జేఏసీ నేతలు ఇప్పుడు తిరిగి విధుల్లో చేరుతున్నారు. 52 రోజుల పాటు కొనసాగిన సమ్మెకు నేతృత్వం వహించిన జేఏసీ నేతలు డ్యూటీలో బిజీ అవుతున్నారు. కొన్నేళ్లపాటు వారు పేరుకే డ్యూటీలో ఉన్నా.. విధుల్లో మాత్రం పనులు చేయలేదు. విధుల్లో ఉండాల్సిన అవసరం లేకుండా కార్మిక శాఖ ద్వారా ఉన్న రిలీఫ్‌లను వారు వినియోగించుకున్నారు. ఇటీవల సమ్మె నేపథ్యంలో వారికున్న రిలీఫ్‌లను ఆర్టీసీ రద్దు చేసింది. దీంతో వారు కచ్చితంగా విధులకు హాజరుకావాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికే జేఏసీ కోకన్వీనర్ థామస్‌రెడ్డి కరీంనగర్ బస్టాండులో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరారు. సూపర్‌వైజర్స్ అసోసియేషన్‌కు చెందిన మరో కోకన్వీనర్ సుధ చేరారు. కోకన్వీనర్ రాజిరెడ్డి ముషీరాబాద్ డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో ఉన్నారు. ఇక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి ఒక్కరే విధుల్లో చేరలేదు. ఆయన బుధవారం ఎంజీబీఎస్‌లో కంట్రోలర్ డ్యూటీకి రానున్నట్లు సమాచారం. తమ రిలీఫ్‌లు పునరుద్ధరించాలని కోరుతూ టీఎంయూ నేతలు అశ్వత్థామరెడ్డి, థామస్‌రెడ్డిలు బుధవారం కార్మిక శాఖ కమిషనర్‌కు లేఖ సమర్పించారు.

### 38 కుటుంబాలకు కారుణ్య నియామకాలు
**సమ్మె కాలంలో మృతిచెందిన కార్మికుల లెక్కతేల్చిన ఆర్టీసీ అధికారులు**

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ సమ్మె కాలంలో 38 మంది కార్మికులు మృతి చెందినట్టు అధికారులు లెక్కతేల్చారు. దీంతో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించడంపై తాజాగా దృష్టి సారించారు. 8 రోజుల్లో వారికి ఉద్యోగాలు ఇవ్వాలంటూ గత ఆదివారం కార్మికులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. దీంతో డిపోల వారీగా ఉన్న ఖాళీలు, ఆయా కుటుంబ సభ్యుల్లో అర్హులు, వారి విద్యార్హతలు, ఏయే పోస్టుల్లో నియమించొచ్చో జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే 24 కుటుంబాలకు సంబంధించిన సభ్యులు ఆర్టీసీలో ఉద్యోగం చేసేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ లేఖలు సమర్పించారు. ముఖ్యమంత్రి ఆదేశం ప్రకారం వచ్చే సోమవారం కల్లా అర్హులైన కుటుంబ సభ్యులు ఉద్యోగాలు పొంది ఉండాలి. ఈ మేరకు ఏర్పాట్లు వేగిరం చేయాలని రవాణా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆర్టీసీ ఎండీని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్టు భవన్‌లోని తన చాంబర్‌లో ఎండీ సునీల్‌శర్మ, ఈడీలతో మంత్రి మాట్లాడారు.

### ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే ప్రయాణం
**కేసీఆర్ ఆదేశం మేరకు మెతుకు ఆనంద్ ప్రయాణం**

**అనంతగిరి:** 'ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ నెలకోసారి ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలి. సిబ్బంది, ప్రజల సమస్యలను పరిశీలించాలి'అని సూచించిన సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ బుధవారం వికారాబాద్ నుంచి అసెంబ్లీ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ముందుగా వికారాబాద్ బస్టాండ్‌కు చేరుకున్న అనంతరం బస్సులో హైదరాబాద్ చేరుకున్నారు.


మేయర్‌గా ఎన్నికైన సందర్భంగా కాంచనను అభినందిస్తున్న కార్యకర్తలు

## షోలాపూర్ మేయర్‌గా తెలుగు మహిళ

- సదాశివపేటకు చెందిన కాంచన యెన్నం గెలుపు
- మహారాష్ట్రలోనే తొలి తెలుగు మహిళా మేయర్‌గా రికార్డు

**షోలాపూర్:** మహారాష్ట్రలోని షోలాపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తెలుగు జెండా రెపరెపలాడింది. షోలాపూర్ మున్సిపాలిటీ మేయర్‌గా ఉమ్మడి మెదక్ జిల్లా సదాశివపేటకు చెందిన తెలుగు మహిళ యెన్నం కాంచన ఎన్నికయ్యారు. మహారాష్ట్రలో మేయర్ పదవి చేపట్టిన తొలి తెలుగు మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. జిల్లా పరిషత్ సీఈవో ప్రకాశ్ వాయ్‌చల్ పర్యవేక్షణలో ఎస్‌ఎంసీ కౌన్సిల్ హాల్‌లో బుధవారం జరిగిన ఎన్నికలో బీజేపీ కార్పొరేటర్ అయిన కాంచన విజయం సాధించి మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. కాగా, డిప్యూటీ మేయర్‌గా బీజేపి కార్పొరేటర్ రాజేశ్ కాళే విజయం సాధించారు.

**22 ఏళ్లుగా ప్రజా జీవితంలో..**


సదాశివపేటకు చెందిన కాంచన కుటుంబం చాలా కాలం కిందే షోలాపూర్ వెళ్లి స్థిరపడింది. కాంచన భర్త రమేశ్ దుప్పట్లు, టవల్స్ సేల్స్ ఏజెంటుగా పని చేస్తుంటారు. ప్రజా జీవితంలో సేవలందించడం అంటే కాంచనకు ఎంతో ఇష్టమని ఆమె భర్త తెలిపారు. 22 ఏళ్ల కిందట 1997లో కాంచన రాజకీయ ప్రవేశం చేశారని చెప్పారు. మహిళా పొదుపు సంఘాలు స్థాపించి మహిళలను ఆర్థికంగా చైతన్యవంతులను చేశారని పేర్కొన్నారు. 2002లో ఎన్నికల బరిలో దిగిన తొలిసారే షోలాపూర్ కార్పొరేటర్‌గా గెలిచారు. ఆ తర్వాత 2007, 2012, 2017 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. కాగా, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని మేయర్‌గా విజయం సాధించిన అనంతరం కాంచనా యెన్నం పేర్కొన్నారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీతో పాటు మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తానని చెప్పారు. ఎక్కడ ఎలాంటి లోపాలకు తావు లేకుండా తన విధులు నిర్వర్తిస్తానని తెలిపారు.

### ఆ వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీగా నీతూప్రసాద్!

**సాక్షి, హైదరాబాద్:** తెలుగు యూనివర్సిటీ, తెలంగాణ వర్సిటీకి ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా నీతూప్రసాద్‌ను నియమించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఆయా వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీగా ఉన్న కమర్షియల్ టాక్స్ కమిషనర్ అనిల్‌కుమార్ ఇటీవల పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో నీతూప్రసాద్ కమర్షియల్ టాక్స్ కమిషనర్‌గా నియమితులయ్యారు. దీంతో అనిల్‌కుమార్ ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించిన బాధ్యతలను కూడా నీతూప్రసాద్‌కే అప్పగించే అవకాశం ఉంది.

### ప్రత్యేక రైళ్లు నడపండి
**రైల్వే బోర్డు చైర్మన్‌కు ఎంపీ సంజయ్ వినతి**

**సాక్షి, న్యూఢిల్లీ:** రోడ్డు మార్గంతో సమానంగా సికింద్రాబాద్–కరీంనగర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్‌ను ఎంపీ బండి సంజయ్ కోరారు. నిజామాబాద్ మీదుగా సికింద్రాబాద్‌కు రైలు ప్రయాణానికి అధిక సమయం పడు తోందని, దీన్ని తగ్గించేలా కాజీపేట్ మీదుగా రైళ్లు నడపాల్సిందిగా వినోద్‌కుమార్‌ను ఎంపీ బుధవారం ఢిల్లీలో కలసి కోరారు. ముంబై వెళ్లే రైళ్లకు షిర్డీ సమీపంలోని నాగర్‌సోల్ స్టేషన్‌లో ఆపాలని కోరారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.